


తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
RNI NO.APTEL / 2013 /50370
శనివారం 17.02.2024 | సంపుటి : 10 సంచిక : 218 | పేజీలు : 12 వెల: రూ. 4/-
Follow :
తెలంగాణ — Simultaneously Published from Hyderabad & Karimnagar — ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్






## నేడు సాగునీటిపై శ్వేతపత్రం

## దళిత బంధు కొనసాగిస్తాం

ఎస్సీల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది
పథకంపై అసెంబ్లీలో భట్టి కీలక ప్రకటన
అభయహస్తం కింద రూ.1000 కోట్ల బడ్జెట్ కేటాయింపు
త్వరలోనే విధివిధానాలు రూపకల్పన

## రైతులపై కొనసాగుతున్న దాష్టీకదాడులు

ఢిల్లీ చలో నిరసనలో మృతి చెందిన రైతు

## మావోయిస్టులు లేకపోవడంతోనే రాజకీయ అరాచకాలు

వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ

## 13 మంది బీఆర్ఎస్ నేతలు మాతోటచ్‌లో ఉన్నారు

అందులో 8 మంది ఎమ్మెల్యేలు, ఐదుగురు ఎంపీలు
బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు

## తెలంగాణ ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్‌గా సిరిసిల్ల రాజయ్య

## ఢిల్లీ దయాల్ మార్కెట్‌లో అగ్నిప్రమాదం

11 మంది మృతి.. నలుగురికి తీవ్ర గాయాలు

పై వార్తల వివరాలు 2లో

### బలహీనులను బలవంతులు చేసేందుకే

# కులగణన

### అరశాతం వాళ్లు ఇకపాలకులు కాలేరు



**చిత్తశుద్ధితో ముందుకువెళ్తున్నాం • పాలితులుగా ఉన్న వారిని పాలకులుగా చేయడమే మా ఉద్దేశం**

**కులగణన కోసం ఇంటింటి కుటుంబ సర్వే : సీఎం రేవంత్‌రెడ్డి • కులగణన తీర్మానానికి తెలంగాణ శాసనసభ ఆమోదం**

హైదరాబాద్(జనంసాక్షి): బీసీ కులగణన విషయంలో తమ ప్రభుత్వం చిత్తశుద్ధిని శంకించాల్సిన అవసరం లేదని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. బలహీన వర్గాలను బలోపేతం చేయడమే ఉద్దేశమని చెప్పారు. రాష్ట్రంలో సమగ్ర కులగణన, సామాజిక, ఆర్థిక ఇంటింట సర్వేపై శాసనసభలో మంత్రి పొన్నం ప్రభాకర్ తీర్మానం ప్రవేశపెట్టారు. ఈసందర్భంగా చేపట్టిన చర్చలో సీఎం మాట్లాడారు. మంచి కార్యక్రమం చేపట్టాలనే ఉద్దేశంతో తీర్మానాన్ని సభ ముందుకు తీసుకొచ్చామన్నారు. గత ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే వివరాలను బయట పెట్టారా? అని ప్రశ్నించారు."చర్చను ప్రతిపక్షం తప్పుదోవ పట్టిస్తోంది. కులగణనను అమలుచేసే క్రమంలో న్యాయ, చట్టపరమైన చిక్కులపై అనుమానముంటే సూచనలు ఇవ్వండి. అంతేకానీ.. తీర్మానానికే చట్టబద్ధత లేదన్నట్లుగా మాట్లాడటం మనందరికీ మంచిది కాదు. మేం రహస్యంగా ఏమీ చేయడం లేదు. ఈ తీర్మానంపై రాష్ట్ర జనాభాలో అరశాతం ఉన్నవాళ్లకు బాధ ఉండొచ్చు. రాష్ట్రాన్ని గుప్పిట్లో పెట్టుకున్నాం.. లెక్కలు బయటకు వస్తే 50 శాతం జనాభా ఉన్నవాళ్లకు రాజ్యాధికారంలో ఎక్కడ భాగం ఇవ్వాల్సి వస్తుందోనన్న బాధ ఉంటుందేమో. ఇప్పటికైనా ప్రధాన ప్రతిపక్ష నేత సభకు రావాలి. భారాస ఎమ్మెల్యే కడియం శ్రీహరి చిత్తశుద్ధిపై మాకు ఎలాంటి అనుమానం లేదు.. కానీ సహవాస దోషం అన్నట్టుగా కొంతమంది పక్కన కూర్చోవడంతో ఆయన్నూ తప్పుదోవ పట్టిస్తున్నారు.మా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే బీసీ కులగణనపై మంత్రివర్గంలో తీర్మానం చేశాం. మీరు అడగకుండానే సభలో పెట్టాం. స్వయంగా మేమే ముందుకు వచ్చి చేస్తున్నాం. విస్పష్టంగా చెప్తున్నాం.. పాలితులుగా ఉన్నవారిని పాలకులుగా తయారుచేయడమే మా ఉద్దేశం. జనాభాకు అనుగుణంగా నిధులు కేటాయించి వాళ్ల ఆర్థిక ప్రయోజనాలను నిలబెట్టాలని భావిస్తున్నాం. ఇంతమంచి తీర్మానం చేసినప్పుడైనా దాన్ని స్వాగతించి సూచనలు చేయాల్సిందిగా కోరుతున్నాం. సహేతుకమైన సూచనలను ప్రభుత్వం పరిగణలోకి తీసుకుంటుంది"

మిగతా 2లో..



## చట్టబద్ధత ఉండేలా చూడండి:కేటీఆర్

హైదరాబాద్(జనంసాక్షి):ప్రభుత్వం బీసీ కులగణనపై తీర్మానం కాదు, చట్టం చేయాలని మాజీమంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. బీసీ కులగణనకు చట్టబద్ధత ఉంటేనే ఈ కార్యక్రమం ఫలవంతం అవుతుందన్నారు. కులగణనపై న్యాయ విచారణ కమిషన్ అయినా వేయాలని డిమాండ్ చేశారు. బిల్లు కోసం అసెంబ్లీ సమావేశాలను పొడిగించాలన్నారు.బీసీ కులగుణనకు బిల్లు ప్రవేశపెడితేనే కార్యక్రమం ఫలప్రదం అవుతుందని మాజీమంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. కేంద్రంలో ఓబీసీ సంక్షేమ మంత్రిత్వశాఖ పెట్టాలని గతంలో డిమాండ్ చేసినట్లు పేర్కొన్నారు.

మిగతా 2లో..

## రైతులకు ప్రయోజనం చేకూరేలా పనిచేస్తున్నాం



రుణాలు పొందేందుకు అన్నదాతలకు కేంద్రం 'గ్యారంటీ'

ఆందోళనల నేపథ్యంలో ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు

2లో

## కేంద్రంపై కార్మికుల పోరు

దేశవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో మిన్నంటిన నిరసనలు




2లో

## వ్యాపార సంస్థల లబ్ధి కోసమే అగ్నివీర్



కేంద్రం ప్రభుత్వంపై రాహుల్ గాంధీ విమర్శలు

కైమూర్(జనంసాక్షి): దేశంలోని పెద్ద వ్యాపార సంస్థలకు లబ్ధి చేకూరేలా రక్షణ రంగ బడ్జెట్‌ను మోదీ ప్రభుత్వం ఖర్చు చేయాలనుకుంటోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపిం చారు .ఇందుకోసమే కేంద్రం అగ్నివీర్ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. భారత్ జోడో న్యాయ్ యాత్ర

మిగతా 2లో..

## ఎంపీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ భారాసకు ఎదురుదెబ్బలు

కాంగ్రెస్‌లో చేరుతున్న హైదరాబాద్,రంగారెడ్డి నేతలు

హస్తం తీర్థం పుచ్చుకున్న పట్నం, బొంతు తదితరులు



2లో



## రైతులపై కొనసాగుతున్న దాష్టీకదాడులు

**- అన్నదాతల ఢిల్లీ చలో నిరసనలో మృతి చెందిన రైతు**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**మరోవైపు చండీగఢ్‌లో రైతు సంఘాల నేతలతో కేంద్ర మంత్రులు జరిపిన చర్చలు అసంపూర్తిగా ముగిశాయి. ఇప్పటి వరకు మూడు దఫాలుగా చర్చలు జరిపినా ఫలితం లేకపోయింది. హర్యానా ప్రభుత్వం, పోలీసుల చర్యలపై రైతు సంఘాల నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎంఎస్‌పీకి చట్టపరంగా హామీ, ఇతర డిమాండ్లపై చర్చించారు. రైతుల డిమాండ్లపై ఆదివారం సాయంత్రం మరోసారి చర్చలు జరుగనున్నాయి.కాగా పంటలకు కనీస మద్దతు ధరపై చట్టం చేయాలని కోరుతూ రైతులు ఢిల్లీ చలో కార్యక్రమంతో నిరసనకు ఢిల్లీ బాటపట్టారు. ఈ ఆందోళనకు మద్దతుగా ఫిబ్రవరి 16న సంయుక్త కిసాన్ మోర్చా.. గ్రామీణ భారత్ బంద్‌కు పిలుపునిచ్చింది. ఈ పిలుపుకు పలు పార్టీలు, సంఘాలు మద్దతు తెలిపాయి. ఈ నిరసనలో పాల్గొన్న వృద్ధ రైతు గుండెపోటుతో మరణించాడు.పంజాబ్-హర్యానా సరిహద్దులోని శంభులో రైతులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అన్నదాతలు అక్కడకి పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం ఓ వృద్ధ రైతు(78)కు గుండెపోటు రావడంతో.. 4 గంటల సమయంలో రాజ్‌పురాలోని ప్రభుత్వ ఆసుపత్రికి తిసుకెళ్లారు. అక్కడి నుంచి పాటియాలాలోని ప్రభుత్వ రాజింద్ర ఆసుపత్రికి తరలించారు. అత్యవసర విభాగంలో చికిత్స పొందుతూ రాజింద్ర ఆసుపత్రిలో రైతు మరణించాడు. మృతుడు పంజాబ్‌లోని గురుదాస్‌పూర్ జిల్లాకు చెందిన జ్ఞాన్ సింగ్‌గా గుర్తించారు. ఇప్పుడే కాదు అంతకు ముందు నిరసనలో కూడా కొందరు రైతులు మరణించారు. మరోవైపు చండీగఢ్‌లో కేంద్ర మంత్రులు.. రైతు సంఘాల నేతలతో మూడు దఫాలుగా చర్చలు జరిపారు. అయితే ఈ చర్చలు ఫలించలేదు. హర్యానాలో రైతు సంఘాల నేతలు పోలీసుల ఆక్షంలపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎంఎస్‌పీకి చట్టపరంగా హామీ, ఇతర డిమాండ్లపై చర్చించారు. రైతుల డిమాండ్లపై ఆదివారం సాయంత్రం మరోసారి చర్చలు జరుగనున్నాయి.

## చట్టబద్ధత ఉండేలా చూడండి

తమ ప్రభుత్వం నుంచి ఓబీసీ సంక్షేమ మంత్రిత్వశాఖపై రెండుసార్లు తీర్మానాలు చేసి పంపినట్లు తెలిపారు. ఓబీసీ సంక్షేమ మంత్రిత్వశాఖ పెట్టాలని ప్రధాని మోదీకి విజ్ఞప్తి చేసినట్లు గుర్తుచేశారు.కేంద్రంలో ఓబీసీ శాఖ పెడితే బీసీలకు రూ.2 లక్షల కోట్లయినా వస్తాయని కేటీఆర్ తెలిపారు. రాష్ట్రంలో బీసీ కులగణనకు తీర్మానం కాకుండా.. బిల్లు ద్వారా చట్టబద్ధత ఉంటేనే ఈ కార్యక్రమం ఫలవంతం అవుతుందన్నారు. కులగణనపై న్యాయ విచారణ కమిషన్ అయినా వేయాలని డిమాండ్ చేశారు. బిల్లు కోసం అసెంబ్లీ సమావేశాలను పొడిగించాలని విజ్ఞప్తి చేశారు. కులగణన కోసం బిల్లు తెస్తే మా పార్టీ తరఫున సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. కులగణనపై తీర్మానం కాదు, చట్టం చేయాలని మాజీమంత్రి గంగుల కమలాకర్ కూడా డిమాండ్ చేశారు. బీసీ కులగణన చేస్తే బీసీ కులాలే నష్టపోతాయని, న్యాయపరమైన చిక్కులు రాకుండా కులగణన చట్టం చేయాలని అసెంబ్లీలో పేర్కొన్నారు. కులగణనను ఏ శాఖతో నిర్వహిస్తారు. ఏవిధంగా చేస్తారో ముందే స్పష్టం చేయాలని, కులగణన విధివిధానాలపై అఖిలపక్షంతో చర్చించాలని పేర్కొన్నారు.కేంద్రం పరిధిలోని అంశంపై రాష్ట్రం ఎలా చట్టం చేస్తుందో తెలపాలని, రిజర్వేషన్లు 50 శాతం మించిపోతే ఏం చేస్తారో స్పష్టత ఇవ్వాల్సి ఉందన్నారు. గతంలో ఇతర రాష్ట్రాల్లో చేసిన కులగణనకు న్యాయపరంగా చిక్కులు వచ్చాయని, మన వద్ద అటువంటి చిక్కులు రాకుండా చట్టం ఉండాలన్నారు. జనాభా ఆధారంగా చట్టసభల్లో 50 శాతం బీసీ ఎమ్మెల్యేలు ఉండాలని ఆశిస్తున్నట్లు తెలిపారు.మరోవైపు కులగణన తీర్మానంపై సీపీఐ హర్షం వ్యక్తం చేసింది. వెనుకబడిన వర్గాలకు ఈ కులగణనతో లబ్ధి చేకూరుతుందని భద్రాద్రి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. తాము బీసీ కులగణనను బలపరుస్తున్నట్లు తెలిపారు. కానీ కులగణను తీర్మానంలా కాకుండా బిల్లురూపంలో తీసుకురావాలని తెలిపారు."రాష్ట్రప్రభుత్వం బీసీ కులగణనపై తీర్మానం కాదు, చట్టం చేయాలి. బీసీ కులగణనకు చట్టబద్ధత ఉంటేనే ఈ కార్యక్రమం ఫలవంతం అవుతుంది. కులగణనపై న్యాయ విచారణ కమిషన్ వేయాలి. బిల్లు కోసం అసెంబ్లీ సమావేశాలను పొడిగించాలి. కులగణన కోసం బిల్లు తెస్తే మా పార్టీ తరఫున సంపూర్ణ మద్దతు ఉంటుంది. - కేటీఆర్, మాజీమంత్రి

## ఢిల్లీ దయాల్ మార్కెట్‌లో అగ్నిప్రమాదం

**11 మంది మృతి.. 4గురికి తీవ్ర గాయాలు**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ఢిల్లీ అలీపూర్‌లోని దయాల్ మార్కెట్‌లో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. శుక్రవారం ఉదయం నాటికి మరణించిన వారి సంఖ్య 11కి పెరిగిందని అధికారులు తెలిపారు. ఢిల్లీ అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, దయాల్ మార్కెట్‌లో గురువారం సాయంత్రం 5.30 గంటల సమయంలో జరిగిన అగ్నిప్రమాదంలో ఒక పోలీసు కానిస్టేబుల్‌తో సహా మరో ముగ్గురు గాయపడ్డారు. అగ్నిప్రమాదానికి ముందు పేలుడు సంభవించిందని స్థానికులు తెలిపారు. ఈ ఘటన చోటు చేసుకున్న వెంటనే అక్కడి డ్రగ్ రిహాబిలిటేషన్ సెంటర్ నుంచి వరుసగా ఆనుకొని ఉన్న ఎనిమిది షాపులకు మంటలు వ్యాపించాయి. గురువారం సాయంత్రం 5:30 గంటలకు అగ్నిప్రమాదం జరిగినట్లు తమకు కాల్ వచ్చిందని, వెంటనే 22 అగ్నిమాపక యంత్రాలను అందుబాటులో ఉంచామని డీఎఫ్‌ఎస్ అధికారి తెలిపారు. రాత్రి 9 గంటల సమయానికి మంటలను అదుపులోకి తెచ్చామని, ఫ్యాక్టరీ ఆవరణలో 11 కాలిపోయిన మృతదేహాలను వెలికితీసినట్లు వెల్లడించారు. దీనికి సంబంధించిన ఎక్స్ ఖాతాలో %శ% ఒక పోస్ట్ చేశారు చీఫ్ అతుల్ గార్గ్. ఢిల్లీలోని అలీపూర్ ప్రాంతంలోని పెయింట్ ఫ్యాక్టరీ అగ్నిప్రమాదంలో 11 మంది కార్మికులు మరణించారు. ఇందులో కొందరు దట్టమైన పొగలో కుప్పకూలిపోగా.. ఫ్యాక్టరీ లోపల చిక్కుకున్న కార్మికులు మంటల్లో కాలిపోయారు. దీని కారణంగా తమ సిబ్బంది వీరిని రక్షించలేక పోయామని తెలిపారు. ఇలా జరగడం చాలా దురదృష్టకరం అని విచారాన్ని వ్యక్తం చేశారు.' గోడౌన్లలో నిల్వ ఉంచిన రసాయనాల వల్ల పేలుడు సంభవించినట్లు ప్రాథమికంగా నిర్ధరించారు. గాయపడిన నలుగురు జ్యోతి (42), దివ్య (20), మోహిత్ సోలంకి (34), పోలీస్ కానిస్టేబుల్ కరంబీర్ (35)గా గుర్తించారు. వీరిని రాజా హరీశ్‌చంద్ర ఆసుపత్రిలో చేర్చినట్లు అధికారి తెలిపారు. ప్రస్తుతం వారి పరిస్థితి నిలకడగా ఉందన్నారు. మృతదేహాలను బాబు జగ్జీవన్‌రామ్ ఆస్పత్రిలో భద్రపరిచామని, వాటిని గుర్తించే ప్రక్రియ కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.

## దళిత బంధు కొనసాగిస్తాం

**హైదరాబాద్(జనంసాక్షి):** ఎస్సీల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, దళిత బంధు పథకాన్ని కొనసాగిస్తుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. అభయహస్తం కింద రూ.1,000 కోట్ల బడ్జెట్ కేటాయింపులు జరిగాయని, విధివిధానాలు రూపొందించిన తర్వాతే పథకాన్ని ముందుకు తీసుకువెళతామని చెప్పారు. ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌పై ప్రతిపక్షాలు అడిగిన ప్రశ్నలకు అసెంబ్లీలో భట్టి సమాధానమిస్తూ.. ప్రభుత్వం ఎస్సీల సంక్షేమానికి ప్రాధాన్యమిచ్చినందున ఈ బడ్జెట్‌లో రూ.1000 కోట్లు కేటాయించిందన్నారు. కేటాయింపులు చేసినా గత ప్రభుత్వం రూ.17 వేల కోట్ల నిధులు విడుదల చేయడంలో విఫలమైందని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఇందిరమ్మ గృహాలు, బడ్జెట్ కేటాయింపులపై భట్టి మాట్లాడుతూ పేదలకు ఇళ్ల స్థలాలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఎస్సీలకు 18 శాతం రిజర్వేషన్లు కల్పించే విషయంలో ప్రభుత్వం తగిన సమయంలో నిర్ణయం తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ప్రతిపక్ష నేతల సూచనలను స్వాగతించిన డిప్యూటీ సీఎం, యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ ముందు ఉంటుందని , ఈ క్రమంలోనే టీఎస్‌పీఎస్సీ ప్యానెల్‌ను ఏర్పాటు చేశామని చెప్పారు. కమిషన్‌కు అవసరమైన సిబ్బందిని నియమించిన తర్వాత నోటిఫికేషన్లు జారీ చేస్తామని చెప్పారు. గత పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రం రూ.7,11,911 కోట్ల బడ్జెట్‌యేతర అప్పులు చేసిందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌పై ప్రతిపక్షాలకు ఇచ్చిన సమాధానంలో, మొత్తం ఆరు హామీలను అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని.. %ఖీ=దీవీ% పరిమితుల ప్రకారం రుణం తీసుకోవాలన్నారు.

# బలహీనులను బలవంతులు చేసేందుకే కులగణన

అని రేవంత్ అన్నారు.సమగ్ర కులగణన తీర్మానానికి శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఈ తీర్మానాన్ని అసెంబ్లీలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్? ప్రవేశపెట్టారు. బీసీల సామాజిక, ఆర్థిక, విద్య అవకాశాల కోసమే కుటుంబ సర్వే చేపడుతున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. పాలితులుగా ఉన్న వారిని పాలకులను చేయడమే తమ ఉద్దేశ్యమని తెలిపారు. కులగణన కోసం ఇంటింటి కుటుంబ సర్వే చేపడతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. సామాజిక, ఆర్థిక, విద్య అవకాశాల కోసమే కుటుంబ సర్వే చేపడుతున్నామని వివరించారు. నేడు శాసనసభలో సమగ్ర కులగణనపై రాష్ట్ర ప్రభుత్వం తీర్మానం ప్రవేశపెట్టి, ఆమోదం తెలిపింది. ఈ తీర్మానాన్ని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రవేశపెట్టారు. అనంతరం సభను ఉద్దేశించి సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు.ఉపాధి, రాజకీయ అవకాశాలు, ప్రణాళికల కోసమే ఈ సర్వే అంటూ సీఎం రేవంత్? రెడ్డి స్పష్టం చేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలు, ఇతర బలహీన వర్గాల అభ్యున్నతి కోసమే సర్వేనని చెప్పారు. బలహీనవర్గాలను బలోపేతం చేయడమే ఈ ప్రభుత్వ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. బలహీన వర్గాలను ఆర్థికంగా నిలబెట్టాలన్నదే తమ ప్రభుత్వ ధ్యేయమని వివరించారు. పాలితులుగా ఉన్న వారిని పాలకులుగా చేయడమే తమ ఉద్దేశ్యమని తెలిపారు. జనాభాకు అనుగుణంగా నిధులు కేటాయించడమే ప్రభుత్వ లక్ష్యమని, అందుకే కుల గణనచేపడుతున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. గత ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే వివరాలు బయటపెట్టలేదని విమర్శించారు. సమగ్ర సర్వే వివరాలను రహస్యంగా ఉంచి ఎన్నికలప్పుడు వాడుకున్నారని బీఆర్ఎస్ ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. మంచి కార్యక్రమాన్ని చేపట్టాలని పొన్నం ప్రభాకర్? ఈ తీర్మానం ప్రవేశపెట్టారని సీఎం రేవంత్? రెడ్డి అన్నారు. ప్రజలకు కొన్ని అనుమానాలు వచ్చే విధంగా ప్రతిపక్షం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. చర్చను ప్రతిపక్షం తప్పుదోవ పట్టిస్తోందన్నారు. గత ప్రభుత్వం చేసిన సమగ్ర కుటుంబ సర్వే బయటపెట్టారా అంటూ ప్రశ్నించారు. ఎవరికైనా అనుమానం ఉంటే చెబితే పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు. ఎవరైనా సూచనలు ఇచ్చినా వాటిని పరిగణనలోకి తీసుకుంటామని సీఎం తెలిపారు. "మంచి కార్యక్రమాన్ని చేపట్టాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ తీర్మానం ప్రవేశపెట్టారు. ప్రజలకు కొన్ని అనుమానాలు వచ్చే విధంగా ప్రతిపక్షం వ్యవహరిస్తోంది. చర్చను ప్రతిపక్షం తప్పుదోవ పట్టిస్తోంది. గత ప్రభుత్వం చేసిన సమగ్ర కుటుంబ సర్వే ఎందుకు బయటపెట్టలేదు? ఎవరికైనా అనుమానం ఉంటే చెబితే పరిగణనలోకి తీసుకుంటాము. ఎవరైనా సూచనలు ఇస్తే తీసుకుంటాము. ఉపాధి, రాజకీయ అవకాశాలు, ప్రణాళికల కోసమే ఈ సర్వే" అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.అంతకు ముందు అసెంబ్లీలో సమగ్ర కులగణనపై బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్? తీర్మానం ప్రవేశపెట్టారు. రాష్ట్రమంతా సామాజిక, ఆర్థిక ఇంటింటి సర్వే చేపట్టాలని నిర్ణయించామని తెలిపారు. కులగణన కోసం బిల్లు అవసరం లేదన్నారు. గతంలోనూ బిల్లు లేకుండానే కులగణన జరిగిందని గుర్తు చేశారు. కులగణనకు చిత్తశుద్ధి అవసరం, బిల్లు కాదన్నారు. గతంలో సమగ్ర కుటుంబ సర్వే చేసినా వివరాలు బయటపెట్టలేదని మంత్రి విమర్శించారు. కులగణనపై అందరి సలహాలు తీసుకొని ముందుకెళ్తామని చెప్పారు. బీసీ మంత్రిత్వ శాఖ కోసం దిల్లీలో ధర్నాలు జరిగాయి కానీ కనీసం కేంద్ర ప్రభుత్వం బీసీ శాఖను కూడా ఏర్పాటు చేయలేదని మంత్రి పొన్నం ప్రభాకర్ ధ్వజమెత్తారు.

## వ్యాపార సంస్థల లబ్ధి కోసమే అగ్నివీర్

లో భాగంగా బిహార్‌లోని కైమూర్ జిల్లాలో మొహనియాలో స్థానిక యువతతో ఆయన ముచ్చటించారు. ఈ ప్రాంతం బిహార్-ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రాల సరిహద్దుల్లో ఉంది. ఇక్కడి యువతలో ఎక్కువమంది కేంద్ర సాయుధ బలగాల్లో ఉద్యోగాల కోసం దరఖాస్తు చేస్తుంటారు. రెండేళ్ల క్రితం ఎన్డీయే ప్రభుత్వం ప్రవేశపెట్టిన అగ్నివీర్ పథకానికి వ్యతిరేకంగా ఈ ప్రాంతంలో ఎక్కువమంది యువత ఆందోళనకు దిగారు."సాధారణ సైనికులకు లభించినట్లు అగ్నివీర్‌లకు జీతం, పెన్షన్ లభించవు. క్యాంటీన్ వసతి కూడా ఉండదు. రక్షణ బడ్జెట్‌లో సైనికుల జీతాలు, ప్రోత్సాహకాల కోసం ఖర్చు చేయాలని మోదీ ప్రభుత్వం భావించడం లేదు. ఆ మొత్తాన్ని దేశంలోని బడా వ్యాపార సంస్థల లబ్ధి కోసం ఖర్చు చేయాలనుకుంటోంది. ఎన్నికల ప్రచారంలో ఉద్యోగాలు కల్పిస్తామని హామీలిచ్చి.. అధికారంలోకి రాగానే 45 ఏళ్లలో రికార్డు స్థాయిలో దేశంలో నిరుద్యోగుల సంఖ్యను పెంచారు " అని రాహుల్ విమర్శించారు. అనంతరం స్థానిక రైతులతో సమావేశమైన రాహుల్.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే పంటకు కనీస మద్దతు ధరకి చట్టబద్ధత కల్పిస్తామని తెలిపారు.

## కేంద్రంపై కార్మికుల పోరు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ తెలంగాణ రాష్ట్రమంతటా చేపట్టిన సార్వత్రిక సమ్మె దిగ్విజయంగా సాగింది. కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో అన్ని జిల్లాల్లో ర్యాలీలు, ధర్నాలు, రాస్తారోకోలతో ఆందోళన చేపట్టారు. కార్పొరేట్ శక్తులు తలొగ్గి, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తే నిరసనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కేంద్రం ఇకనైనా తీరు మార్చుకోవాలని సూచించారు.కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, వరంగల్ జిల్లా నర్సంపేటలో అఖిలపక్ష రైతు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. దిల్లీలో ఆందోళన చేస్తున్న రైతుల న్యాయమైన కోరికలను నెరవేర్చాలని నినదించారు. హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల నుంచి కార్మిక సంఘాల నేతలు కలెక్టరేట్ వరకు ప్రదర్శన చేపట్టారు. పంటలకు మద్దతు ధర ఇవ్వకుండా ప్రధాని మోదీ కర్షకుల పొట్ట కొడుతున్నారని ఆరోపించారు. వరంగల్‌లో పోచమ్మ మైదాన్ కూడలిలో కేంద్రానికి వ్యతిరేకంగా నినదించారు.భద్రాద్రి జిల్లా ఇల్లందులో జరిగిన నిరసనలో మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్యతో పాటు పలువు న్యూడెమొక్రసీ నాయకులు పాల్గొన్నారు. ఖమ్మంలో కార్మిక సంఘాల నాయకులు బస్సు డిపో ఎదుట బైఠాయించి బస్సుల రాకపోకలు అడ్డుకున్నారు. అన్నదాతల పట్ల కేంద్రం వ్యవహరిస్తున్న తీరు సరిగా లేదన్నారు. మధిరలో ఆందోళనకారులు బ్యాంకులు, ప్రైవేటు విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలను మూసి వేయించారు.

# ఎంపీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ భారాసకు ఎదురుదెబ్బలు

**కాంగ్రెస్‌లో చేరుతున్న హైదరాబాద్,రంగారెడ్డి నేతలు**

**హస్తం తీర్థం పుచ్చుకున్న పట్నం, బొంతు తదితరులు**



**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ కాంగ్రెస్‌లో చేరికలు కొనసాగుతున్నాయి. మాజీ మంత్రి పట్నం మహేందర్ రెడ్డి, ఆయన భార్య సునీత%శా% కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. హైదరాబాద్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ దంపతులు కాంగ్రెస్‌లో చేరారు. బీఆర్ఎస్ నాయకుడు, అల్లు అర్జున్ మామ కంచర్ల చంద్రశేఖర్ రెడ్డి సైతం హస్తం గూటికి చేరారు. తెలంగాణ పార్టీ ఇంఛార్జ్ దీపాదాస్ మున్షి ఆధ్వర్యంలో వీరంతా పార్టీలో చేరారు. ఈ నేతలు సీఎం రేవంత్‌రెడ్డితో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. కాంగ్రెస్ ఎలాంటి బాధ్యతలు అప్పగించినా నిబద్ధతతో పనిచేస్తామని స్పష్టం చేశారు. పట్నం మహేందర్ రెడ్డి తాండూరు నియోజకవర్గంలో కీలక నేతగా ఉన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆయనకు బీఆర్ఎస్ టిక్కెట్ దక్కలేదు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో తనపై గెలిచిన పైలట్ రోహిత్ రెడ్డికి బీఆర్ఎస్ టిక్కెట్ ఇచ్చింది. 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున విజయం సాధించిన రోహిత్ రెడ్డి..ఆ తర్వాత బీఆర్ఎస్ గూటికి చేరారు. అప్పటి నుంచి ఈ ఇద్దరు నేతల మధ్య ఆధిపత్య పోరు నడుస్తోంది.2023 ఎన్నికల్లో టిక్కెట్ దక్కపోవడంతో మహేందర్ రెడ్డి అలకబూనారు. అయితే ఆయనకు ఎన్నికల కొద్దిరోజుల ముందు మంత్రి పదవి ఇచ్చి గులాబీ బాస్ కేసీఆర్ బుజ్జగించారు. ఎన్నికల సమీపిస్తున్న వేళ మహేందర్ రెడ్డి కాంగ్రెస్ లో చేరతారని ప్రచారం జోరుగా సాగింది. కానీ ఎప్పటికప్పుడు బీఆర్ఎస్ అధిష్ఠానం మహేందర్ రెడ్డి చర్చలు జరిపి ఆయనను పార్టీ నుంచి వెళ్లకుండా కాపాడుకుంది. కానీ మరో రెండు నెలల్లో పార్లమెంట్ ఎన్నికల జరగనున్న నేపథ్యంలో మహేందర్ రెడ్డి కారు దిగిపోయారు. కాంగ్రెస్ లో చేరిపోయారు. బొంతు రామ్మోహన్ కూడా బీఆర్ఎస్ అధిష్ఠానంపై చాలాకాలంగా అసంతృప్తిగా ఉన్నారు. గతంలో హైదరాబాద్ మేయర్ గా అవకాశం దక్కినా.. ఆ టర్మ్ పూర్తైన తర్వాత ఆయనకు పార్టీలో కీలకమైన పదవులు ఏమీ దక్కలేదు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఉప్పల్ టిక్కెట్ ను బొంతు రామ్మోహన్ ఆశించారు. చాలా ప్రయత్నాలు చేశారు. కానీ టిక్కెట్ దక్కించుకోలేకపోయారు. అప్పటి నుంచి అసంతృప్తిగా ఉన్న బొంతు పార్లమెంట్ ఎన్నికల వేళ కారు దిగిపోయారు.

**కాంగ్రెస్‌లోకి అల్లు అర్జున్ మామ చంద్రశేఖర్ రెడ్డి**

తెలంగాణలో బీఆర్ఎస్ కు షాకుల మీద షాకులు తగులుతున్నాయి. కీలక నేతల ఒక్కొక్కరూ పార్టీని వీడుతున్నారు. కాంగ్రెస్ కండువాలు కప్పుకుంటున్నారు. తాజాగా కీలక నేత గులాబీ పార్టీకి గుడ్ బై చెప్పేందుకు సిద్ధమయ్యారు. టాలీవుడ్ హీరో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ మామ చంద్రశేఖర్ రెడ్డి కారు దిగేందుకు సిద్ధమయ్యారు. కాంగ్రెస్ చేరుతున్నానని ఆయన అధికారికంగా ప్రకటించారు.తాను తెలంగాణ వాదినని చంద్రశేఖర్ రెడ్డి చెప్పుకొచ్చారు. తనకు బీఆర్ఎస్ అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు తన సొంతగూటికి చేరతానని తెలిపారు. గతంలో యూత్ కాంగ్రెస్ పనిచేసిన విషయాన్ని చంద్రశేఖర్ రెడ్డి ప్రస్తావించారు. కాంగ్రెస్ లో చేరిన తర్వాత పార్టీ ఆదేశాలకు కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు.

## రైతులకు ప్రయోజనం చేకూరేలా పనిచేస్తున్నాం

హర్యానా(జనంసాక్షి): రైతు ఉద్యమ నేపథ్యంలో హర్యానాలో పర్యటిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. రైతులకు మేలు చేసే పథకాలపై కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందని శుక్రవారం అన్నారు. రైతుల బ్యాంకు రుణాలకు తమ ప్రభుత్వం గ్యారెంటీ ఇచ్చిందని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. శుక్రవారం నాలుగో రోజుకు చేరిన రైతుల ఆందోళన నేపథ్యంలో ఆయన ఈ ప్రకటన చేశారు. హర్యానా రేవారిలో ఎయిమ్స్‌కి శంకుస్థాపన చేసిన ప్రధాని మోదీ, కేంద్రంలోని తమ బీజేపీ ప్రభుత్వం రైతులకు ప్రయోజనాలు అందించేందుకు పనిచేస్తుందని అన్నారు. అక్కడ ఏర్పాటు చేసిన సభలో ప్రసంగించిన ప్రధాని మోదీ, కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వంపై పలుమార్లు విమర్శలు గుప్పించారు. బ్యాంకుల నుంచి రుణాలు పొందేందుకు కేంద్రం రైతులకు 'గ్యారంటీ' ఇచ్చిందని, ఇంతకు ముందు వాటిని తిరస్కరించారని ప్రధాని అన్నారు. కాగా పంటకు కనీస మద్దతు(ఎంఎస్‌పీ) చట్టంతో సహా 12 హామీలను అమలు చేయాలని కోరుతూ రైతులు రోడ్డెక్కారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు 'ఢిల్లీ ఛలో' పేరుతో దేశ రాజధాని ముట్టడికి పిలుపునిచ్చారు. అయితే, వీరందరిని హర్యానా-ఢిల్లీ బోర్డర్‌లో పోలీసులు, కేంద్ర బలగాలు అడ్డుకున్నాయి. కేంద్రమంత్రులు, రైతు సంఘాల నేతలతో పలుమార్లు చర్చలు జరిపినప్పటికీ ఆందోళన విరమణపై హామీ రాలేదు.

## మావోయిస్టులు లేకపోవడంతోనే రాజకీయ అరాచకాలు

**వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ**

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (జనంసాక్షి) : గత పదేళ్లుగా తెలంగాణ రాష్ట్రంలో అరాచక రాజకీయం రాజ్యమేలిందని, మావోయిస్టులు ఉండివుంటే ఇటువంటి రాజకీయాలకు కళ్లెం పడేదని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అభిప్రాయపడ్డారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా లాబీలో మీడియాతో 'చిట్‌చాట్'లో ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. మాజీ సీఎం కేసీఆర్ తెలంగాణను ఆర్థికంగా దివాళా తీయించారని, అన్ని వ్యవస్థలను ధ్వంసం చేశారని అన్నారు. ఈ పరిస్థితి నుంచి తెలంగాణను పునర్నిర్మించుకుంటూ రావడం అంత సులువేమీ కాదని చెబుతూనే మావోయిస్టుల ప్రస్తావన తీసుకొచ్చారు రాజనర్సింహ..! గతంలో ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి కూడా ఇలాంటి వ్యాఖ్యలు చేసిన విషయాన్ని ఈ సందర్భంగా పలువురు గుర్తుచేయడం గమనార్హం.

## తెలంగాణ ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్‌గా సిరిసిల్ల రాజయ్య

**హైదరాబాద్(జనంసాక్షి):**తెలంగాణ ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్‌గా మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్యను సర్కారు నియమించింది. రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యులుగా ఎం.రమేశ్, సంకేపల్లి సుధీర్‌రెడ్డి, నెహ్రూ నాయక్ మాలోత్‌ను నియమిస్తూ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ శుక్రవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. వీరంతా రెండేళ్లపాటు పదవిలో కొనసాగనున్నారు. సిరిసిల్ల రాజయ్య వరంగల్ (ఎస్సీ) పార్లమెంట్ స్థానం నుంచి 15వ లోక్‌సభకు కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసి గెలుపొందారు.

# 13 మంది బీఆర్ఎస్ నేతలు మాతోటచ్‌లో ఉన్నారు

**హైదరాబాద్(జనంసాక్షి):** 8 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, 5మంది బీఆర్ఎస్ ఎంపీలు బీజేపీతో టచ్‌లో ఉన్నారని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ అన్నారు. బీఆర్ఎస్ ఎన్డీఏలో చేరుతోందని ఢిల్లీ నుంచి జరుగుతున్న ప్రచారాన్ని ఖండించారు. ఎట్టి పరిస్థితుల్లో బీఆర్ఎస్‌తో పొత్తు ఉండదని.. ఇదంతా కేసీఆర్ ఆడుతున్న నాటకమని ఆయన అన్నారు. సాక్షాత్తు ప్రధాని మోడీనే వారి అవినీతిపై మాట్లాడారని బండి సంజయ్ పేర్కొన్నారు. అధికారంలో ఉన్నప్పుడే కేసీఆర్‌ను ఎన్డీఏలో చేరుతామనీ అడిగితేనే చేర్చుకోలేదన్నారు. తెలంగాణలో మేము 17కి 17సీట్లు గెలుస్తామని.. దేశవ్యాప్తంగా 400 సీట్లు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ఒక్కటి కూడా గెలిచే అవకాశం లేదన్నారు. బీఆర్ఏ స్‌కు ఎంపీ అభ్యర్థులు లేరని, ఉన్న వాళ్లు పక్క చూపులు చూస్తున్నారన్నారు. ఎంపీకి పోటీ చేయమని అభ్యర్థులను కేసీఆర్ బతిమలాడుతున్నారన్నారు. కేసీఆర్ అవినీతిని వ్యతిరేకించి ఎవరు హరీష్ రావుతో సహ బీజేపీలోకి వస్తామని అంటే ఆహ్వానిస్తామన్నారు. బీఆం "ఎస్ కాంగ్రెస్‌కు అవగాహన ఒప్పందం ఉందన్నారు. అందుకే బీఆర్ఎస్ ఇన్ని స్కాంలు బయటపడుతున్న చర్యలు కాంగ్రెస్ చర్యలు తీసుకోవట్లేదని మండిపడ్డారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడి ఉంటే కేటీఆర్, కేసీఆర్ ఇప్పటికే జైలులో ఉండేవాళ్లన్నారు. గ్రౌండ్ లెవెల్‌లో కాంగ్రెస్‌పై వ్యతిరేకత వచ్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసినందుకు ప్రజలు బాధపడుతున్నారన్నారు. కర్ణాటకలోనే కాదు.. తెలంగాణలో సైతం గ్యారంటీల పేరుతో మోసం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్‌కి ఎన్ని సీట్లు వస్తాయనేది ఆ పార్టీ నేతలే చెప్పాలన్నారు. కేఏ పాల్ కూడా 17సీట్లు గెలుస్తాం అనే ధీమాతో ఉన్నారన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో రాముడు మోడీ ఒక్కవైపు , రజాకార్లు, ఎంఐఎం, బీఆర్ఎస్ ఒక వైపు ఉన్నాయన్నారు. దేవుడిని రాముడిని నమ్మే వాళ్లు బీజేపీకి ఓటేస్తారన్నారు. బీఆర్ఎస్ అవినీతి అంతా కాగ్ రిపోర్ట్ ద్వారా బయట పడిందని బండి సంజయ్ చెప్పారు. కాళేశ్వరంపై సెంట్రల్ కమిటీ చాలా స్పష్టంగా నివేదిక ఇచ్చిందని తెలిపారు. కాళేశ్వరం పనికి రాదని చెప్పిందని అన్నారు. ప్రజా సమస్యలు ఏమీ లేనట్లు ఒక నది జలాల విషయం పట్టుకుని బీఆర్ఎస్, కాంగ్రెస్ విమర్శలు చేసుకుంటున్నాయని చెప్పారు. అయోధ్య రాముని ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాన్ని బహిష్కరించిన పార్టీని ప్రజలే బహిష్కరిస్తారన్నారు. ఏ ప్రభుత్వం అయిన ఐదు ఏళ్లు ఉండాలని కోరుకుంటామన్నారు. వాగ్దానాలు పూర్తి చేయకుంటే ప్రజలే కాంగ్రెస్‌కి బుద్ధి చెప్తారన్నారు

## నేడు సాగునీటిపై శ్వేతపత్రం

**హైదరాబాద్(జనంసాక్షి):**అసెంబ్లీలో నేడు రాష్ట్రప్రభుత్వం నీటిపారుదలశాఖపై శ్వేతపత్రం విడుదల చేయనుంది. కాగా అ విషయమై శుక్రవారం అధికార, విపక్షాల మధ్య కాసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. నీటిపారుదల ప్రాజెక్టులపై శ్వేత పత్రాన్ని శనివారం విడుదల చేస్తామని ప్రభుత్వం పేర్కొనగా, శుక్రవారమే పెట్టాలంటూ బీఆర్ఎస్, బీజేపీ, సీపీఐ పట్టుబట్టాయి. చివరకు శ్వేతపత్రం విడుదలపై రేపు ఉదయం బీఏసీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడించారు. అనంతరం శాసనసభ రేపటికి వాయిదా పడింది. శాసనసభలో నీటపారుదల రంగంపై ప్రభుత్వం పెట్టనున్న శ్వేతపత్రం శనివారానికి వాయిదా పడింది. చాలా విస్తృతమైన అంశం ఐనందున, ఎక్కువ సమయం కావాలని అసెంబ్లీ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు కోరగా, అందుకు అంగీకరించిన సభాపతి గడ్డం ప్రసాద్ రేపటికి సభను వాయిదా వేశారు. శనివారం బీఏసీ సమావేశం తర్వాతే తదుపరి నిర్ణయం ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. అంతకుముందు రేపటికి వాయిదా వేయడాన్ని బీఆర్ఎస్, బీజేపీ తీవ్రంగా వ్యతిరేకించాయి. అజెండాలో ఉన్న నీటిపారుదల అంశంపై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని హరీశ్‌రావు ప్రకటించారు. బీఏసీ చర్చించకుండా నిర్ణయం తీసుకోవడం ఏంటని ప్రశ్నించారు. నీటిపారుదల శాఖపై లఘు చర్చ అని ఎజెండాలో చెప్పారని, కానీ ఎందుకు వాయిదా వేస్తున్నారని ప్రశ్నించారు. ఇవాళ అసెంబ్లీ ముగుస్తుందని చెబుతున్నారని, నీటిపారుదలపై ఎంతసేపు చర్చకైనా సిద్ధంగా ఉన్నామని హరీశ్‌రావు స్పష్టం చేశారు. ప్రధాన ప్రతిపక్షానికి గౌరవం ఇస్తూ నడుచుకోవాలని, ఇష్టారీతిన సభ నడుపుదామనడం సబబు కాదన్నారు."అజెండాలో ఉన్న నీటిపారుదల అంశంపై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నాము. ఇవాళ శ్వేతపత్రం విడుదల చేయండి. నీటిపారుదలపై లఘు చర్చ అని ఎజెండాలో చెప్పారు, కానీ ఎందుకు వాయిదా వేస్తున్నారు. ప్రధాన ప్రతిపక్షానికి గౌరవం ఇస్తూ నడుచుకోవాలి, ఇష్టారీతిన సభ నడుపుదామనడం సబబు కాదు"అని హరీశ్‌రావు అన్నారు. అసెంబ్లీలో జీరో అవర్ నిర్వహించాలని బీజేపీ శాసనసభ పక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. అవసరమైతే సభను మరో 4 రోజులు పొడిగించాలన్నారు. ఎజెండాలో పెట్టిన నీటిపారుదల అంశంపై ఇవాళే చర్చించాలని, ఎజెండా బేఖాతరు చేసి రేపటికి వాయిదా వేయడం సబబు కాదని మండిపడ్డారు. నీటిపారుదలలో అవినీతిపై సీబీఐ విచారణకు సిద్ధమా? కాదో? చెప్పాలని ప్రశ్నించారు. కాళేశ్వరంలో అవినీతి జరిగినట్లు ఆరోపిస్తున్నారని, సీబీఐతో విచారణ జరిపించి నిజానిజాలు బయటపెట్టాలని డిమాండ్ చేశారు. న్యాయవిచారణ వీలు కావట్లేదని మీరే చెబుతున్నారని, సీబీఐ విచారణ అంశంపై ఎందుకు యూటర్న్ తీసుకున్నారని అడిగారు. దీనిపై శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ బీఏసీలో చర్చించిన అంశాలనే సభ ముందుంచామన్నారు. ప్రతి రోజూ బీఏసీ ఉండదని సభ్యులు గుర్తించాలని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యమైన అంశం కావున రేపు ఉదయం బీఏసీలో నిర్ణయం తీసుకోవాల్సి ఉందని, నీటిపారుదలపై శ్వేతపత్రం పెట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. శాసనసభ రేపు ఉదయం 10 గంటలకు వాయిదా పడింది."శనివారం ఉదయం బీఏసీ సమావేశం తర్వాత నిర్ణయం తీసుకుంటాము. శాసనసభలో శనివారం నీటిపారుదల శాఖపై శ్వేతపత్రం విడుదల చేస్తాము. ఇది చాలా విస్తృతమైన అంశం ఐనందున సభ్యులందరూ పాల్గొనాలి." అని శ్రీధర్‌బాబు అన్నారు.


### ఇంటర్ ఒరిజినల్ మెమో పోయినది

సూర్యాపేట జిల్లా,చింతలపాలెం మండలం, దొండపాడు గ్రామమునకు చెందిన పారేపల్లి వెంకట సాయి నిహారిక D/O వెంకట హరి ప్రసాదరావు అనే నా ఇంటర్ ఒరిజినల్ మార్కుల మెమో 13.02.2024 తేదిన దొండపాడు గ్రామం నుండి కోదాడకు వెళ్లే దారిలో పోయినది ఎవరికైనా దొరికిన ఎడల దయచేసి నాకు ఇవ్వగలరని మనవి.
సెల్: 6304406515

**తెలంగాణ ప్రభుత్వం**
**రోడ్లు మరియు భవనాల శాఖ,**

e-procurement NIT No.11/DB/DBC/Dist/HNK/2023-24/1432 Dt: 13.02.2024

హన్మకొండజిల్లా హన్మకొండ ఆర్&బి డివిజన్‌లో 09పనులకు ఆన్‌లైన్ టెండర్లు ఆహ్వానించడమైనది. టెండరు దారులు టెండరు షెడ్యూళ్లను ఈ-మార్కెట్‌ప్లేస్ అనగా www.eprocurement.gov.in నుండి తేది:16.02.2024 సాయంత్రం 3గం॥ల నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును.2. చివరితేది మరియు సమయం 19.02.2024 సాయంత్రం 4గం॥ల వరకు.3. మిగతా వివరాలకు ఈ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్‌ప్లేస్ అనగా https://tender.telangana.gov.in

**సం/- జిల్లా ఆర్&బి అధికారి హన్మకొండ జిల్లా**

DIPR No.2734-DP/CL/ADVT/1/2023-24

**తెలంగాణ ప్రభుత్వము**
**రోడ్లు & భవనాల శాఖకార్యాలయము**
**ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు వారి కార్యాలయము (ఆర్ & బి)డివిజన్,సిద్ధిపేట**

NIT NO.PA/DB/T1/10/2023-24 Dt:16.02.2024

1. సిద్ధిపేట జిల్లా గజ్వేల్ వద్ద ఎమ్మెల్యే రెసిడెన్స్ కమ్ క్యాంప్‌ఆఫీస్‌కు పేయింటింగ్స్ & చిరు మరమ్మతులు చేయుట. అంచనా విలువ రూ.7లక్షలు. 2. సిద్ధిపేటలో కోర్టు కాంప్లెక్స్ పరిసరాలలో భారీ వర్షాల వల్ల కూలిపోయిన ప్రహరీ గోడను నిర్మించుట. అంచనా విలువ రూ.0.80లక్షలు.3.సిద్ధిపేట జిల్లాలో దుబ్బాక అసెంబ్లీ నియోజకవర్గ హెడ్‌క్వార్టర్స్‌లోని ఎమ్మెల్యే రెసిడెన్స్ కమ్ క్యాంప్ ఆఫీస్‌కు పేయింటింగ్‌వేయుట. అంచనా విలువ రూ.5లక్షలు. 1. బిడ్‌దాఖలుకు చివరి తేది: 22.02.2024 సా॥ 4గం॥లకు.2.సంబంధిత ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు పేరు & చిరునామా: ది ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు(ఆర్&బి) డివిజన్, సిద్ధిపేట, సిద్ధిపేట జిల్లా ఫోన్:9440818096.3)మిగతా వివరాలకు @ ఈ- ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్‌ప్లేస్ @ www.eprocurement.gov.in

**సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు(ఆర్&బి) డివిజన్,సిద్ధిపేట జిల్లా**

DIPR No.2740-DP/CL/ADVT/1/2023-24

**తెలంగాణ ప్రభుత్వము**
**రోడ్లు మరియు భవనాలు శాఖ**

ఈ-ప్రొక్యూర్‌మెంట్ షార్టు టెండరు నోటీసు

1) e-NIT NO.18/SE(R&B)01/KNR/2023-24. Dt:09.02.2024.కరీంనగర్ జిల్లాలో పొస్కోకోర్టు మరియు ఫ్యామిలీ కోర్టు కలిగిన 10+2 కోర్టు కాంప్లెక్స్ నిర్మించుట. అంచనా విలువ రూ.81 కోట్లు. 2)e-NIT NO.18/SE(R&B)02/KNR/2023-24. Dt:09.02.2024.కరీంనగర్‌లో 20 రెసిడె న్షియల్ క్వార్టర్లు & హెల్త్ క్లబ్‌లు నిర్మించుట. మొత్తం అంచనా విలువ రూ.26 కోట్లు.బిడ్‌దాఖలుకు మొదలు తేది:17.02.2024సా॥ 4గం॥లకు. బిడ్‌దాఖలుకు చివరితేది:05.03.2024 సా॥ 4గం॥లకు. పీక్యూస్టేజ్ తేది:05.03.2024 సా॥ 4.30 గం॥లకు. కమర్షియల్ స్టేజ్ తేది:11.03.2024 సా॥ 4గం॥లకు. సంబంధిత అధికారి ఎస్ఈ పేరు& చిరునామా : సూపరింటెండింగ్ ఇంజినీరు వారి కార్యాలయము (ఆర్&బి) సర్కిల్, కరీంనగర్ మిగతా వివరాలకు ఈ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్ ఫారం www.tender.telangana.gov.in లో చూడవచ్చును. ఈ మెయిల్ ఐడీ: ersu pengerkmnr@gmai;.com.

**సం/- సూపరింటెండింగ్ ఇంజినీరు (ఆర్ & బి)సర్కిల్, కరీంనగర్**

DIPR No.2717-DP/CL/ADVT/1/2023-24

# కానిస్టేబుళ్ళందరికీ ఏకకాలంలో శిక్షణ ఇవ్వాలి

- టీఎస్ఎస్పీ కానిస్టేబుళ్లగా ఎంపికైన వారిపై ప్రభుత్వ వివక్ష
- ఖండించిన బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



**హైదరాబాద్, ఫిబ్రవరి 16 (జనంసాక్షి) :** టీఎస్ఎస్పీ కానిస్టేబుళ్లుగా ఎంపికైన వారిపై రాష్ట్ర ప్రభుత్వం చూపుతున్న వివక్షను తీవ్రంగా ఖండిస్తున్నానని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డా. ఆర్. ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఎక్స్ (ట్విట్టర్) వేదికగా టీఎస్-ఎస్పీ కానిస్టేబుళ్లకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించారు. ఒకే పోలీస్ రిక్రూట్మెంట్ నోటిఫికేషన్ ద్వారా సెలెక్ట్ అయిన సివిల్, ఆర్మ్డ్ రిజర్వ్ , టీఎస్ఎస్పీ కానిస్టేబుళ్ళందరికీ ఏకకాలంలో శిక్షణ ఇవ్వాలని అన్నారు. కేవలం సివిల్, ఆర్మ్డ్ రిజర్వ్ కానిస్టేబుళ్లకు శిక్షణ ఇస్తూ మిగిలిన 5,010 మంది టీఎస్-ఎస్పీ కానిస్టేబుళ్లకు శిక్షణ ఇవ్వకపోవడం సరైనది కాదన్నారు.

# శ్రీవిద్య అరెస్ట్ ఎప్పుడు?

- అక్రమక్రమబద్ధీకరణ కేసులో దర్యాప్తు మరిచిన ఖాకీలు..!!
- తప్పించుకుందా..? తప్పించారా?
- పోలీసుల పాత్రపై భిన్నాభిప్రాయాలు!

**ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి):** ఖమ్మం నగరంలో కోట్లు విలువైన భూమిని జీవో 59 ద్వారా రెగ్యులరైజ్ చేయించుకోవడం కోసం నకిలీ పత్రాలు సృష్టించిన కేసు రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. పగడాల. నాగరాజు బిఆర్ఎస్ నగర అధ్యక్షుడి బాధ్యతల్లో ఉండి ఆదర్శవంతంగా ఉండాల్సింది పోయి అక్రమ పద్ధతిలో ప్రభుత్వ భూమిని అప్పనంగా కొట్టేసాడు. బైపాస్ రోడ్డుకు ఆనుకొని వున్న 415 గజాల స్థలాన్ని దేవుడి వంట షెడ్డుకు ఉన్న ఇంటి నంబర్ ని తన స్థలంలో ఉన్న ఇంటిగా చూపెట్టి తన ప్రభుత్వాన్ని తానే మోసం చేసాడు. ఈ వ్యవహారానికి సహకరించిన అధికారుల చేతులకు అవినీతి సొమ్ము ముట్టిందని సమాచారం. తన సోదరుడు రెవిన్యూ శాఖ లో ఉండటంతో ఇలాంటి సలహాలు అతనే ఇచ్చాడని , తన సోదరుడు కూడా రెవిన్యూ శాఖను అడ్డు పెట్టి రెగ్యులరైజ్ చేయించుకున్నాడని సమాచారం. పగడాల నాగరాజు భార్య శ్రీ విద్య చౌదరి కార్పోరేటర్ గా ఉండి ప్రభుత్వ ఆస్థులను కొల్లగొట్టింది. ఆమె ఏ1 , పగడాల నాగరాజు ఏ2 గా ఉన్నారు. పోలీసులు అరెస్ట్ చేయడానికి వెళితే బట్టలు మార్చుకొని వస్తానని లోపలికి వెళ్లి మాయమైంది. ఆమె కోసం వచ్చిన ఓ మహిళా నేత శ్రీ విద్య ను తప్పించిందని సమాచారం. సిసి ఫుటేజ్ ని పరిశీలిస్తే తప్పించిన వారెవరో , సహకరించిన వారెవరో తేల్చి వారి పై కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంది.



**పోలీసుల ప్రమేయం ఉందా ..?**

బిఆర్ఎస్ కార్పోరేటర్ శ్రీ విద్య చౌదరిని తప్పించడంలో మాజీ పోలిస్ అధికారి పాత్ర ఉన్నట్లు సమాచారం. తన పై కేసు నమోదు అయ్యిందని ముందుగానే సమాచారం ఇచ్చి, ముందస్తు బెయిల్ కోసం కోర్టుకు వెళ్లమని సలహా ఇచ్చినట్లు సమాచారం. శ్రీ విద్య ను అరెస్ట్ చేయడానికి వెళ్లి అరెస్ట్ చేయకుండా ఆమెను తప్పించుకునే విధంగా సహకరించాడని సమాచారం. అందుకు గాను భారీగా నగదు చేతులు మారినట్లు సమాచారం. ఎక్కడో దేశ విదేశాల్లో ఉన్న వారిని , దట్టమైన అడవిలో దాక్కున్న వారిని అరెస్ట్ చేసి కటకటాల్లోకి నెట్టే పోలిసులు శ్రీ విద్య విషయంలో వారికి అడ్డొస్తున్న మమకారం ఏంటో ఎవ్వరికి అంతుచిక్కడం లేదు. భర్తను అరెస్ట్ చేసిన పోలిసులు , భార్య ఎక్కడ ఉందని అడిగి పట్టుకోవడం పెద్ద విషయం కాదు. అయినా కాని పోలిసులు మెతక వైఖరి అవలంభించడం వెనుక ఉన్న ఆంతర్యం తెలియడం లేదు. కొత్తగా వచ్చిన సిపి, ఏసిపి , సిఐ లు శ్రీ విద్యను అరెస్ట్ చేసి తప్పు చేసిన వారికి, చేయాలనుకునే వారికి భయాన్ని కల్పించాల్సిన బాధ్యత ఉంది.

# నూతన విద్యావిధానం రద్దు చేయాలి

- భగత్ సింగ్ కు భారతరత్న ప్రకటించాలి
- ఢిల్లీ సరిహద్దుల్లో రైతులపై కాల్పులు చేసి నిర్బంధాలు ప్రయోగించడం దుర్మార్గం
- గ్రామీణ భారత్ బంద్ కు మద్దతుగా హైదరాబాద్ లో వామపక్ష విద్యార్థి సంఘాలు ఆధ్వర్యంలో విద్యార్థి ప్రదర్శన




**హైదరాబాద్, ఫిబ్రవరి 16 (జనంసాక్షి) :** విద్యారంగంలో మతోన్మాద ఆరెస్సెస్ ఎజెండా అమలు చేయాలని, విద్యా రంగాన్ని కార్పోరేట్, ప్రైవేట్ శక్తులకు అప్పజెప్పె ప్రయత్నం చేయడానికి దేశంలో నూతన విద్యావిధానం తీసుకుని వస్తున్నారని విద్యావిధానం ద్వారా దేశంలో వీదేశీ యూనివర్శిటీలను రద్దుచేయాలని,యూజీసీ కి గ్రాంట్స్ పెంచాలని, డిమాండ్ చేస్తూ రైతులు, కార్మికులు ఇచ్చిన గ్రామీణ భారత్ బంద్ మద్దతుగా వామపక్ష విద్యార్థి సంఘాలు (ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, ఏఐడీఎస్‌వో, పీడీఎస్‌యూ, ఏఐఎస్‌బీ, పీడీఎస్‌యూ(వీ)) ఆధ్వర్యంలో నారాయణగూడ నుండి ఆర్.టి.సి.క్రాస్ రోడ్స్ వరకు విద్యార్థి ప్రదర్శన - అనంతరం క్రాస్ రోడ్స్ లో నిరసన సభ జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు టి.నాగరాజు, ఆర్.ఎల్.మూర్తి (ఎస్ఎఫ్ఐ), పుట్టా లక్ష్మణ్ (ఏఐఎస్ఎఫ్), మహేష్(పిడిఎస్‌యు), రామకృష్ణ(పిడిఎస్‌యు), మల్లేష్(ఎఐఎస్‌డిఓ), హకీమ్ నవీద్(ఎఐఎస్‌బి), ఎ.విజయ్ (పిడిఎస్‌యు విజృంభణ)లు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో విద్యారంగానికి తక్కువ నిధులు ఇచ్చి ,నూతన విద్యావిధానం పేరుతో ప్రభుత్వం ప్రభుత్వ యూనివర్శిటీలు, విద్యాసంస్థలను నష్టం చేసే చర్యలు చేస్తుందని అన్నారు. నూతన విద్యావిధానం 2020 ఈ దేశంలో విద్యరంగంలో ఫెడరల్ స్ఫూర్తి దెబ్బతీసి రాష్ట్రాల హక్కులు కాలరాస్తుందని కార్పోరేట్ శక్తుల, వీదేశీ శక్తుల ప్రవేశం దీని ద్వారా మరింత సులభతరం అవుతుంది అని అన్నారు. రాజీవ్ గాంధీ నేషనల్ ఫెలోషిప్స్ గత 8 సంవత్సరాల నుండి పెండింగ్ ఉన్నాయని వాటిని పునరుద్ధరణ చేసి అందరికీ ఫెలోషిప్స్ అందించాలని వారు డిమాండ్ చేశారు. రాజకీయాలు కోసం, ఓట్లు కోసం దేశ. అత్యున్నత పురస్కారం భారతరత్న ఇస్తున్న మోదీ ఈ దేశం కొసం ప్రాణత్యాగం చేసిన భగత్ సింగ్ త్యాగాని ఎందుకు గుర్తించడం లేదని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు, యువతకు స్ఫూర్తి భగత్ సింగ్ కు తక్షణమే భారత రత్న పురస్కారం ఇవ్వాలని అన్నారు. ప్రతి యెటా యువతకు 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని 2014 ఎన్నికల్లో హామీ ఇచ్చిన మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత మరిశారని ఎడాదికి రెండుకోట్లు చోప్పున 10 సంవత్సరాలలో 20 కోట్లు ఉద్యోగాలు ఎమైయాయని ప్రశ్నించారు. మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రశ్నించే వారిపై దాడులు, హత్యలు, కేసులు పెరిగాయని ఈడి,సిబిఐ లను పంపి బెదిరింపులు చేస్తోందని అన్నారు. దేశ ప్రజాస్వామ్యం అపహాస్యం చేస్తూరని అన్నారు. పేదలకు ఉపాధి లేదు, రోజురోజుకు పెరుగుతున్న ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని. వాటీని. నియంత్రణ చేయలేని పరిస్థితి దాపురించిందని అన్నారు. విద్యాసంస్థలలో మత విద్వేషాలు పెంచి కళాశాలలో ,యూనివర్శిటీలలో దాడులు చేస్తున్నారు. ఫీజులు పెంచుతున్నారు. అందరికీ విద్య, అందరికీ ఉపాధి కల్పించకుండా కేవలం మోదీ,ఆదానీ,అంబానీల కోసం పనిచేస్తుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి రావాలసిన విభజన హామీలు ఐఐటీలు, ఐఐఎం ,కేంద్రీయ పాఠశాలలు, ఏకలవ్య పాఠశాలలు, సైనిక పాఠశాల కేటాయింపులు లేవు. ప్రకటించిన సెంట్రల్ ట్రైబల్ యూనివర్శిటీ కూబా మాటలకు తప్ప అక్కడ కనీసం బిల్డింగ్ కూడా లేదన్నారు. తక్షణమే విభజన హామీలను అమలు చేసి రాష్ట్రనికి రావాల్సినవి. ఇవ్వాలని తెలిపారు. ఢిల్లీ సరిహద్దు శంభూ లో పోరాడుతున్న రైతులపై కాశ్మీర్ సరిహద్దులలో వాడే పెలెట్స్ వాడి కాల్పులు జరుపుతున్నారు అన్నంపెట్టే అన్నదాతలను నిర్బందాలు ప్రయోగించి లాఠీచార్జ్ చేసి, కాల్పులు జరిపి,దేశద్రోహులుగా చిత్రికరిస్తున్నారు. తక్షణమే రైతులు డిమాండ్స్ నెరవేర్చాలని అన్నారు. కార్మికుల హక్కులు హరించే నల్ల చట్టాలు నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ భారత్ బంద్ మద్దతుగా విద్యార్థులు నిరసనలు, ఆందోళనలు, ప్రదర్శనలు అన్ని జిల్లాలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శులు ఎం.మమత, దామెర కిరణ్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు లెనిన్ గువేరా,రాష్ట్ర కమిటీ సభ్యులు జె.రమేష్,రమ్య , హైదరాబాద్ జిల్లా నాయకులు స్టాలిన్, శ్రీమాన్, నాగేందర్, ప్రశాంత్, సుష్మ, నందిని, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు చైతన్య, రాష్ట్ర నాయకులు మనోజ్, ఎం.డి.అన్వర్, పి.డి.ఎస్.యు.రాష్ట్ర ఉపాధ్యక్షులు గడ్డం శ్యామ్, ఎఐడిఎస్ఓ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు నితీష్,కార్యదర్శి నాగరాజు, రాష్ట్ర నాయకులు అరుణ్, పి.డి.ఎస్.యు.రాష్ట్ర ఉపాధ్యక్షుడు అనిల్,రాష్ట్ర నాయకులు రాకేష్,గణేష్, మధు సూదన్, తదితరులు పాల్గొన్నారు.

# కులగణనతో తెలంగాణలోని అన్ని వర్గాలకు సమన్యాయం

- మేడ్చల్ కాంగ్రెస్ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌కి శుభాకాంక్షలు తెలిపిన వజ్రేష్ యాదవ్





**హైదరాబాద్, ఫిబ్రవరి 16 (జనంసాక్షి) :** తెలంగాణ లోని అన్నివర్గాలకు సమ న్యాయం జరిగేలా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న కుల గణన నిర్ణయం అన్ని వర్గాలకు సమ న్యాయం చేస్తుందని టీ.పీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్ మల్కాజిగిరి ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. శుక్రవారం నాడు తెలంగాణ శాసన సభలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ అధ్వర్యంలో తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమైన నిర్ణయమన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా రేవంత్ రెడ్డి ఇచ్చిన వాగ్దానం మేరకు నేడు శాసన సభలో బిల్లు పాస్ చేయడంతో కాంగ్రెస్ పార్టీపై ప్రజలకు సంపూర్ణ నమ్మకం పెరిగిందని అన్నారు.ఈ సందర్భంగా వారిని అసెంబ్లీ లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

# భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలతో నిరసన




**హైదరాబాద్, ఫిబ్రవరి 16 (జనంసాక్షి) :** ఆల్ ఇండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ పిలుపుమేరకు టీఎన్జీవో యూనియన్ కేంద్ర సంఘ ఆదేశాల మేరకు, టీఎన్జీఓస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డా.ఎస్.ఎమ్.హుస్సేని (ముజీబ్) ఆధ్వర్యంలో హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా కార్యవర్గం, వివిధ యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు సమక్షంలో మధ్యాహ్న భోజన సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి కేంద్ర, రాష్ట్ర ఉద్యోగుల పట్ల కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న వైఖరి ఖండించారు. ముఖ్యంగా సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని, ఇన్కమ్ టాక్స్ పరిమితి పది లక్షలకు పెంచాలని, కేంద్ర సంస్థలను ప్రైవేటీకరణ విధానం పూర్తిగా మానుకోవాలని, కాంట్రాక్ట్ మరియు ఔట్సోర్సింగ్ ఉద్యోగులని రెగ్యులరైజ్ చేయాలని ఈ సందర్భంగా ప్లే కార్డ్స్ తో ధ్వజమెత్తారు. కార్యక్రమంలో కేంద్ర సంఘ ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్, ఉపాధ్యక్షులు కస్తూరి వెంకట్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, పబ్లిసిటీ సెక్రటరీ శ్రీమతి శైలజ, జిల్లా కార్యదర్శి విక్రమ్ కుమార్, అసోసియట్ అధ్యక్షుడు కె.అర్.రాజ్ కుమార్, ఉపాధ్యక్షులు ఉమర్ ఖాన్, కురాడి శ్రీనివాస్, నరేష్ కుమార్ సభ్యులు సుజాత, ఖలీద్ అహ్మద్, బొలిగిద్ద శంకర్, శ్రీధర్ నాయుడు, ముఖీమ్ ఖురేషి, సుమారు 50 యూనిట్ల అధ్యక్షులు, కార్యదర్శులు మరియు ప్రాథమిక సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ముజీబ్ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి 6956 స్టాఫ్ నర్సులను, 16604 పోలీస్ కానిస్టేబుల్స్ ని నియమించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈనాటి కార్యక్రమానికి అనుమతించిన జిల్లా కలెక్టర్‌కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పోలీస్ ఉద్యోగులకు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మిత్రులకి ధన్యవాదాలు తెలిపారు.

# ప్రపంచ వ్యాప్తంగా కెసిఆర్ 70వ జన్మదిన వేడుకలు

- బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ కో-ఆర్డినేటర్ మహేష్ బిగాల



**హైదరాబాద్, ఫిబ్రవరి 16 (జనంసాక్షి) :** తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కెసిఆర్ 70వ జన్మదిన వేడుకలను ప్రపంచమంతా ఎన్నారైలు ఘనంగా నిర్వహిస్తారని బీఆరెస్ ఎన్నారై కోఆర్డినేటర్ మహేష్ బిగాల తెలిపారు. మహేష్ బిగాల మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా దేశాలలో కెసిఆర్ జన్మదిన వేడుకలు బ్రహ్మాండంగా జరపాలని వివిధ దేశాల బీఆరెస్ ప్రతినిధితులను కోరారు. కొన్ని దేశాలలో బ్లడ్ డొనేషన్ డ్రైవ్, గ్రీన్ ఛాలెంజ్ కి సంఘీ భావంగా చెట్లు నాటడం, అనాధలకు సహాయం చెయ్యడం, ఎప్పటిలాగే ప్రపంచం అంతటా ఘనంగా నిర్వహించాలని తెలిపారు.

# వైన్‌షాప్ అక్రమ దందాపై ఈడీ దాడులు

- పాలకుర్తిలో కలకలం
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన వైనం
- మద్యం షాపుల సిండికేట్ దందాకు బ్రేక్ వేసిన ఎన్ఫోర్స్ మెంట్ శాఖ




**పాలకుర్తి, ఫిబ్రవరి 16 (జనంసాక్షి)** అధిక ధరలకు మద్యం విక్రయిస్తుండటంతో ఎన్ఫోర్స్మెంట్ శాఖ అధికారులు వైన్ షాప్ పై దాడులు చేసి ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గురువారం ఎక్సైజ్ శాఖ సిఐ సంతోష్ రెడ్డి మాట్లాడుతూ పాలకుర్తి మండలంలోని వివిధ గ్రామాలకు, బెల్టు దుకాణాలకు అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్న మండలంలోని దర్దేపల్లి రోడ్డులో గల శ్రీ దుర్గా వినాయక వైన్ షాప్ పై ఎన్ ఫోర్స్ మెంట్ శాఖ అధికారులు దాడులు నిర్వహించి, అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నట్లు తేలడంతో ఆ షాపును సీజ్ చేశారని తెలిపారు. వైన్ షాప్ పై దాడి చేసిన ఇన్ఫోర్స్మెంట్ అధికారులు యాజమాన్యానికి రూ 3లక్షల జరిమానా విధించి వైన్ షాపును చేశారని తెలిపారు. అధిక ధరలకు మధ్యాన్ని విక్రయి స్తుండటంతో పాటు కల్తీ మద్యం ఏరులై పారుచున్నప్పటికీ ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టించుకోవడంలేదని విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా చేశాక అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# ప్లాస్టిక్ ఫ్రీ మేడారం జాతరగా నిర్వహించాలి



**వరంగల్ ఈస్ట్, ఫిబ్రవరి 16 (జనం సాక్షి) :** రాబోవు మేడారం జాతరలో ప్లాస్టిక్ ఫ్రీ మేడారం జాతరగా నిర్వహించి పర్యావరణాన్ని ముఖ్యంగా అక్కడ ప్రజలకు మేలు చేయాలని ఉద్దేశంతో హనుమకొండ జిల్లా వినియోగదారుల సమాచార సంఘం అధ్యక్షుడు, ప్రముఖ పర్యావరణ వేత్త ప్రొఫెసర్ రతన్ సింగ్ ఠాగూర్ అన్నారు. రతన్ సింగ్ ప్లాస్టిక్ వల్ల కలుగు అనర్థాలు ఇతర పర్యవసనాలపై వాలంటీర్లకు అవగాహన సదస్సు నిర్వహించి తను రాసిన కరపత్రాన్ని ఏవివి కళాశాల ప్రిన్సిపాల్ విజేందర్ రెడ్డి ఆవిష్కరిస్తూ 75 సంవత్సరాల వయసులో కూడా రతన్ సింగ్ పర్యావరణ పై చేస్తున్న పోరాటం అద్భుతమని తను ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కోడిమాల శ్రీనివాసరావు, అధ్యాపకురాలు డాక్టర్ ఎస్ అనిత వరంగల్ జిల్లా కన్స్యూమర్ ఇన్ఫర్మేషన్ సెంటర్ అధ్యక్షుడు సుదర్శన్ గౌడ్ మరొక పర్యావరణవేత్త సర్వేశం తదితరులు పాల్గొన్నారు

## నేటి సార్వత్రిక సమ్మెకు మద్దతుగా
# నల్లబ్యాడ్జీలతో పాఠశాల విధులకు హాజరు

**తొర్రూర్, ఫిబ్రవరి16 (జనంసాక్షి):** దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు, రైతు సంఘాలు నిర్వహిస్తున్న సార్వత్రిక సమ్మెకు మద్దతుగా తొర్రూరు మండలం అమ్మా పురం గ్రామ ప్రాథమిక మరియు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు . ఆనంతరం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా టీఎస్ యుటిఎఫ్ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు మురళీకృష్ణ మాట్లాడుతూ నేటి సార్వత్రిక సమ్మెకు రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ(యూఎస్పీసీ ) మరియు టిఎస్ యుటిఎఫ్ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని అన్నారు. కేంద్రప్రభుత్వ విధానాలతో కార్మికులు, రైతులు, సాధారణ ప్రజలతోపాటు మధ్యతరగతి ఉద్యోగులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు కనీస వేతనాలు లేవు, ఉద్యోగ భద్రత లేదు. ఏళ్ళ తరబడి కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో కొనసాగిస్తున్నారు. గత పదేళ్ళలో ఆదాయపన్ను స్లాబులను సవరించలేదు, రాయితీ మొత్తాన్ని పెంచలేదు. అన్ని వస్తువులపై జిఎస్టీ వసూలు చేస్తూ వేతన జీవులపై ఆదాయపన్ను భారాన్ని అధికంగా మోపి, కార్పొరేట్లకు మాత్రం పన్నుల్లో రాయితీలు కల్పించారు.

రైతులు, కార్మికుల సమస్యలతో పాటు ఆదాయపన్ను శ్లాబులు సవరించాలని, రాయితీ పరిమితిని పెంచాలని, సీపీఎస్, పీఎఫ్ఆర్డీఏలను రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్దరించాలని, ఎన్ఈపీ -2020 ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టి ఎస్ యూ టి ఫ్ జిల్లా కోశాధికారి నాగ మల్లయ్య, ఇంఛార్జి ప్రధానోపాధ్యాయురాలు వీరన్న , ఉపాధ్యాయులు మంజుల, రజియా బేగం,సరిత,కల్యాణి,సునీత, హరికృష్ణ చారీ,వెంకన్న, శ్రీనివాస చారీ,రత్న శేకర్,శ్రీనివాస్, రమేష్, వెంకటేశ్వర్లు,వెంకటేశ్వర్లు, లక్ష్మయ్య, ధనలక్ష్మి, సుగుణమ్మ, హేమలత, యకుబీ తదితరులు పాల్గొన్నారు.



# మానవ నాగరికతకు వెన్నెముక వ్యవసాయం

మానవ నాగరికతకు వెన్నెముక అయిన వ్యవసాయం శతాబ్దాలుగా విపరీతంగా అభివృద్ధి చెందింది. మారుమూల గ్రామాలలో జీవనాధారమైన వ్యవసాయం నుండి పారిశ్రామిక వ్యవసాయంలో అత్యాధునిక సాంకేతికతల వరకు, ప్రపంచ వ్యవసాయ వ్యవస్థలు విశేషమైన మార్పులను చూశాయి. ఈ ప్రపంచంలోని వ్యవసాయ వ్యవస్థలను లోతుగా పరిశీలిస్తే వివిధ ప్రాంతాలలో ఉపయోగించే వివిధ పద్ధతులు, అధ్యయనం ద్వారా వెల్లడి అవుతుంది.ప్రపంచంలోని అగ్రికల్చరల్ సిస్టమ్స్ అనేది మన జీవితాల్లో అపారమైన ప్రాముఖ్యతను కలిగి ఉన్న అంశం. ఇది ప్రపంచ జనాభాను పోషించడమే కాకుండా ఆర్థిక వ్యవస్థలు, సంస్కృతులు , పర్యావరణ వ్యవస్థలలో కీలక పాత్ర పోషిస్తుంది.

వాతావరణ మార్పు వ్యవసాయ వ్యవస్థలను ఎలా ప్రభావితం చేస్తుంది? వాతావరణ మార్పు అనూహ్య వాతావరణానికి దారి తీస్తుంది, పంట దిగుబడి మరియు పశువుల ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తుంది. ఈ ప్రభావాలను తగ్గించడానికి అనుసరణ వ్యూహాలు స్థిరమైన అభ్యాసాలు కీలకమైనవి.వేగంగా మారుతున్న ప్రపంచంలో వ్యవసాయం భవిష్యత్తు ఏమిటి! వ్యవసాయం యొక్క భవిష్యత్తు స్థిరత్వం ఆవిష్కరణలలో ఉంది. మన గ్రహాన్ని సంరక్షించుకుంటూ ఆహారం కోసం పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడానికి మనం పర్యావరణ అనుకూలపద్ధతులను,అనుసరించాలి ,సాంకేతికతను ఉపయోగించుకోవాలి. వ్యవసాయంలో జీవవైవిధ్యం ఎందుకు ముఖ్యమైనది? జీవవైవిధ్యం పర్యావరణ వ్యవస్థ స్థిరత్వం మరియు స్థితిస్థాపకతను నిర్వహించడానికి సహాయపడుతుంది. ఇది పంట దిగుబడిని పెంచుతుంది, తెగులు నియంత్రణను మెరుగుపరుస్తుంది. నేల ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తుంది. స్థిరమైన వ్యవసాయానికి వ్యక్తులు ఎలా మద్దతు ఇవ్వగలరు !స్థిరంగా ఉత్పత్తి చేయబడిన ఆహారాలను ఎంచుకోవడం, ఆహార వ్యర్థాలను తగ్గించడం , స్థానిక రైతుల మార్కెట్‌లకు మద్దతు ఇవ్వడం ద్వారా వినియోగదారులు వైవిధ్యం చూపగలరు.నేటికీ వాడుకలో ఉన్న పురాతన వ్యవసాయ పద్ధతులకు కొన్ని ఉదాహరణలు ఏమిటి? హిమాలయాలలో టెర్రస్ వ్యవసాయం చేయబడేది.పారిశ్రామిక వ్యవసాయం అనేది ఆధునిక వ్యవసాయం యొక్క ఒక రూపం , ఇది పంటలు జంతువుల పారిశ్రామిక ఉత్పత్తి , గుడ్లు లేదా పాలు వంటి జంతు ఉత్పత్తులను సూచిస్తుంది . పారిశ్రామిక వ్యవసాయం పద్ధతులలో వ్యవసాయ యంత్రాలు , వ్యవసాయ పద్ధతులు, జన్యు సాంకేతికత , ఉత్పత్తిలో స్థాయి ఆర్థిక వ్యవస్థలను సాధించే పద్ధతులు , వినియోగం కోసం కొత్త మార్కెట్ల సృష్టి, జన్యు సమాచారానికి పేటెంట్ రక్షణను ఉపయోగించడం , ప్రపంచ వాణిజ్యం ఉన్నాయి . ఈ పద్ధతులు అభివృద్ధి చెందిన దేశాలలో విస్తృతంగా ఉన్నాయి , ప్రపంచవ్యాప్తంగా ఎక్కువగా ప్రబలంగా ఉన్నాయి. సూపర్ మార్కెట్లలో లభించే మాంసం , పాల ఉత్పత్తులు , గుడ్లు , పండ్లు కూరగాయలు చాలా వరకు ఈ విధంగా ఉత్పత్తి చేయబడతాయి.

**మారుతున్న వ్యవసాయం:** వ్యవసాయాన్ని మార్చడం , పంట భ్రమణానికి భిన్నంగా ప్లాట్ (క్షేత్ర) భ్రమణం ద్వారా నేల సంతానోత్పత్తిని కాపాడే సాగు విధానం . వ్యవసాయాన్ని మార్చడంలో ఒక ప్లాట్లు క్లియర్ చేయబడి, తక్కువ కాలం పాటు సాగు చేయబడతాయి బీ అప్పుడు అది వదిలివేయబడుతుంది , దాని సహజ వృక్షసంపదకు తిరిగి రావడానికి అనుమతించబడుతుంది, అయితే సాగుదారుడు మరొక ప్లాట్‌కు వెళతాడు. నేల అలసిపోయిన సంకేతాలను చూపినప్పుడు లేదా సాధారణంగా పొలంలో కలుపు మొక్కలు ఆక్రమించబడినప్పుడు సాగు కాలం సాధారణంగా నిలిపివేయబడుతుంది. పొలాన్ని సాగు చేసే సమయం సాధారణంగా భూమిని బీడుగా ఉంచడం ద్వారా పునరుత్పత్తికి అనుమతించబడిన కాలం కంటే తక్కువగా ఉంటుంది.వ్యవసాయాన్ని మార్చే ఒక భూ-క్లియరింగ్ విధానం స్లాష్-అండ్-బర్న్ పద్ధతి, ఇది నిలబడి ఉన్న వృక్షసంపదను నరికి కాల్చిన తర్వాత పొలంలో స్టంప్‌లు, పెద్ద చెట్లను మాత్రమే వదిలివేస్తుంది, దాని బూడిద నేలను సుసంపన్నం చేస్తుంది. క్లియర్ చేసిన తర్వాత భూమిని సాగు చేయడం సాధారణంగా గొఱ్ఱ లేదా తవ్వే కర్రతో చేయబడుతుంది నాగలి ద్వారా కాదు .ఉష్ణమండల ప్రాంతాల అటవీ భూముల సంతానోత్పత్తిని క్షీణింపజేస్తున్నందున వ్యవసాయాన్ని మార్చడం తరచుగా సూత్రప్రాయంగా దాడి చేయబడింది. ఏదేమైనప్పటికీ, వ్యవసాయాన్ని మార్చడం అనేది భూసార పరిరక్షణ , ఎరువుల వాడకం యొక్క అధునాతన సాంకేతికతలు లేకుండా, అదే క్షేత్రంలో దీర్ఘకాలిక, నిరంతర సాగు, భూమి యొక్క సంతానోత్పత్తికి చాలా హానికరమైన ప్రాంతాలలో ఉష్ణమండల నేల పరిస్థితులకు అనుగుణంగా ఉంటుంది. అటువంటి వాతావరణంలో పొలాన్ని కొద్ది కాలం పాటు సాగు చేసి , నేల పూర్తిగా పోషకాలతో ఎప్పుడు సమృద్ధిగా ఉండాల్సిన అవసరం ఉంది. అయితే ప్రస్తుత పరిస్థితులలో సహజ ఎరువులను వాడే పరిస్థితుల్లో రైతులు లేరు. కేవలం రసాయనక ఎరువులు పురుగు మందులు వాడి వ్యవసాయం చేస్తున్నారు. దీనివల్ల భూమి తన భూసారాన్ని కోల్పోయి నాణ్యమైన పంటలు దిగుబడి అందించలేక పోతుంది.1960 వచ్చిన హరిత విప్లవం వ్యవసాయ రంగంలో ఒక విప్లవాత్మకమైందని చెప్పవచ్చు. సాధారణ దిగుబడి స్థాయి నుండి అత్యధికంగా దిగుబడి సాధించే దిశగా వ్యవసాయంలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. ముఖ్యంగా అధిక దిగుబడి నిచ్చే పంటల రకాలు అందుబాటులోనికి వచ్చాయి. దీనికి తోడుగా యూరియా అందుబాటులోనికి రావడం వ్యవసాయంలో పత్ర వ్యవసాయం దర్శనమిచ్చింది. ప్రస్తుతం దేశ జనాభా 142 కోట్లకు జనాభా చేరుకుంది. ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశంగా భారతదేశ మొదటి స్థానంలో ఉంది. ఇంతమంది జనాభాకు ఆహారాన్ని అందించాలంటే వ్యవసాయంలో విప్లమాత్మకమైన మార్పులు చోటు చేసుకుంటేనే తప్ప ఆశించిన స్థాయిలో వ్యవసాయ ఉత్పత్తులు పెంచలేమని చెప్పవచ్చు. ఇప్పటికే రైతులు వ్యవసాయం గిట్టుబాటు గాక తమ భూమి నుండి పక్కకు జరుగుతున్నారు. రెండవది సాగు భూమి అంత స్థిరాస్తి( రియల్ ఎస్టేట్) భూములుగా మారిపోతున్నాయి. ఇప్పటికే 35% భూమి రియల్ ఎస్టేట్ రంగానికి పోయింది.10 శాతం మంది రైతులు తమ వ్యవసాయాన్ని వదిలేసి ఇతర రంగాలకు మారినారు. ఉన్న కొద్దిపాటి వ్యవసాయ భూమి, రైతులు పూర్తిగా తన సాంప్రదాయక వ్యవసాయ విధానాన్ని వదిలేసి అడ్డమీది కూలిగా మారకముందే వ్యవసాయాన్ని రక్షించుకోవాల్సిన అవసరం ఉంది. ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా రైతులు గిట్టుబాటు గాక ఉద్యమాలు చేస్తున్నారు ఢిల్లీ పరిసర ప్రాంతాలలో ఫిబ్రవరి 12, 2024 రోజున పార్లమెంటు ముట్టడికి దేశ రైతులందరూ మూకుమ్మడిగా ఆందోళన కార్యక్రమానికి పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. గతంలో 2021 లో తీసుకువచ్చిన మూడు వ్యవసాయ నల్ల చట్టాలను వ్యతిరేకంగా సంవత్సర కాలం పాటు ఢిల్లీ పరిసర ప్రాంతాలలో ఆందోళన చేయగా 750 మంది రైతులు ఆత్మ బలిదానం చేశారు.2022లో కేంద్ర ప్రభుత్వం ఈ మూడు నెలల చట్టాలను రద్దు చేస్తున్నట్లు ప్రధాన మంత్రి స్వయం గా పార్లమెంటులో ప్రకటించడం జరిగింది. అయితే రద్దు చేసే కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టిన కేంద్ర ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా చట్టాన్ని చేయకపోవడం నిరసనగా ఢిల్లీ పంజాబ్ హర్యానా ఉత్తర ప్రదేశ్ రాజస్థాన్ తదితర ప్రాంతాల రైతులే కాకుండా దేశవ్యాప్తంగా రైతు సంఘాలు రైతులు పాల్గొని ఉద్యమాలు ఉధృతం చేసే దిశగా పయనిస్తున్నాయి. కేవలం భారతదేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా రైతాంగ ఉద్యమాలు మళ్లీ ఊపందుకున్నాయి. పెట్టుబడి, ఆరుకాలం కష్టించి పండించిన పంట గిట్టుబాటు లేక రైతులు తమ పొలాల్లోని తుమ్మ చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడుతున్న సంఘటనలు కోకోనలు.

భారతదేశంలో రైతు ఆత్మహత్యలు అనేది 1970ల నుండి రైతులు ఆత్మహత్యల ద్వారా చనిపోతున్న జాతీయ విపత్తును సూచిస్తుంది , వారు ఎక్కువగా ప్రైవేట్ భూస్వాములు ,బ్యాంకుల నుండి తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించలేకపోవడం వల్ల . 2014 మరియు 2020 మధ్య 6 సంవత్సరాలలో రైతుల ఆత్మహత్యల సంఘటనలు ఎక్కువగా ఉన్నాయని ఎన్‌సిఆర్‌బి డేటా చూపిస్తుంది. 2014లో 5,600 మంది రైతులు ఆత్మహత్యలతో మరణించగా, 2020లో 5,500 మంది రైతులు ఆత్మహత్యలతో మరణించారు. వ్యవసాయ కూలీలను 2020 సంఖ్యతో కలిపితే, ఆత్మహత్యల సంఖ్య 10,600కి పెరిగింది. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో ఆఫ్ ఇండియా నివేదిక ప్రకారం 1995 మరియు 2014 మధ్య మొత్తం 296,438 మంది భారతీయ రైతులు ఆత్మహత్యల ద్వారా మరణించారు. వీరిలో 60,750 రైతు ఆత్మహత్యలు 1995 నుండి మహారాష్ట్ర రాష్ట్రంలో , మిగిలినవి ఒడిశా , తెలంగాణాలో జరిగాయి . భారతదేశంలో రైతు ఆత్మహత్యల రేటు 100,000 మొత్తం జనాభాకు 1.4 , 1.8 మధ్య ఉంది, 2005 వరకు 10 సంవత్సరాల కాలంలో. అయితే, 2017 , 2018 గణాంకాలు సగటున రోజుకు 10 కంటే ఎక్కువ ఆత్మహత్యలు లేదా 5760 ఆత్మహత్యలను చూపించాయి. సంవత్సరం. రాష్ట్రాలు రైతుల ఆత్మహత్యల డేటాను తారుమారు చేస్తున్నాయని ఆరోపణలు ఉన్నాయి, అందువల్ల వాస్తవ గణాంకాలు మరింత ఎక్కువగా ఉండవచ్చు.

భారతదేశం వ్యవసాయాధారిత దేశం, దాదాపు 70% మంది ప్రజలు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారు. 2017లో భారతదేశ ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయం 15.4% వాటాను కలిగి ఉంది. 2020లో మొత్తం కార్మికులలో 41.49% వ్యవసాయంతో ముడిపడి ఉంది. భారతదేశంలో జరిగిన మొత్తం ఆత్మహత్యలలో 11.2% రైతుల ఆత్మహత్యలు. రైతు వ్యతిరేక చట్టాలు, అధిక రుణ భారాలు, పేద ప్రభుత్వ విధానాలు, సబ్సిడీలలో అవినీతి, పంట వైఫల్యం, మానసిక ఆరోగ్యం , వ్యక్తిగత సమస్యలు కుటుంబ సమస్యలు వంటి రైతు ఆత్మహత్యలకు కార్యకర్తలు పండితులు అనేక వివాదాస్పద కారణాలను అందించారు . రైతుల ఆదాయం 30 శాతం పెరిగింది, అయితే 2013 మరియు 2019 మధ్య వారి అప్పులు దాదాపు 58 శాతం పెరిగాయి. ఫలితంగా, రైతుల రుణాలు వారి వార్షిక ఆదాయంలో 13 శాతం పాయింట్లు పెరిగాయని తాజా గణాంకాలు వెల్లడించాయి. స్టాటిస్టిక్స్ ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్ మంత్రిత్వ శాఖ. వెల్లడించిన వివరాలు. ఇప్పటికైనా ప్రభుత్వాలు వ్యవసాయ రంగానికి చేయూతను అందించి ఆదుకోవలసిన బాధ్యత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఉంది.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

# ఒక్క ఊపిరి చాలదా?
# 750 కావాలా!

*మన అన్నదాతలు అయిన రైతులు, రైతు కూలీల ఆందోళనకు నాలుగు రోజులు కాగా పోలీసుల దాడిలో గాయపడిన 400 మందిలో 176 మంది తీవ్రంగా గాయపడిన చికిత్స పొందుతున్నట్లు రైతు సంఘాల నేతలు పేర్కొన్నారు. శంబు బార్డర్ లో గాయపడిన రైతుల్లో గుజ్జర్ సింగ్ అనే రైతు శుక్రవారం ఊపిరి కోల్పోయారు.2020- 21 లో జరిగిన 378 రోజుల ఆందోళనలో 750 మంది ఊపిరి కోల్పోయారు. గురువారం గ్రామీణ భారత్ బంద్ విజయవంతం అయ్యింది. ఢిల్లీ బార్డర్ లలో భారీగా రైతులు ఆందోళన లో ఉన్నారు.యాంటీ నేషనల్ ఇంటర్ నెట్ బంద్ చేసేసారు.మొత్తం 70 మంది యూ ట్యూబర్ ల అకౌంట్లు బంద్ చేసారు.ట్విట్టర్ హ్యాండిల్ లు బంద్ చేశారు.రైతులు మాత్రం అయితే ఢిల్లీలోనికి ప్రవేశించే ప్రయత్నం ఆపలేదు.శంబు, టిక్రి, గాజిపూర్, సింగు బోర్డర్, తదితర బోర్డర్లలో లక్షలాది మంది రైతులు, రైతు కూలీలు చేరుకుంటున్నారు. బోర్డర్ లలో డ్రోన్ లతో,12 బోర్ చక్రాలను ప్రయోగిస్తున్నారు, రబ్బర్ బుల్లెట్ లను ప్రయోగించడం, టియర్ గ్యాస్ ను వదులుతున్నారని రైతులు పేర్కొంటున్నారు.సర్కార్ ఎమ్మెస్పీ ని చట్టం చేయాలని, రుణ మాఫీ చేయాలని, ప్రధాన డిమాండ్లను రైతులు పెట్టినారు. చర్చలు ప్రభుత్వం తో జరిగినా ఫలితం లేదు!*




### లంగర్ లగ్ గయా!

బోర్డర్ లలో లంగర్ లు పెట్టేసారు. వంటా వార్పు కొనసాగుతున్నది.ప్రజాస్వామ్యము లో తమ న్యాయమైన శాంతి యుత పోరాటం ను ఆపేది లేదని రైతులు పేర్కొంటున్నారు. ఆరు నెలలకు సరిపడ రేషన్, ఇతర ఏర్పాట్లతో రైతు, రైతు కుటుంబాలు బోర్డర్లకు చేరుకున్నాయి.రైతులను, టెర్రరిస్టుల మాదిరి, దేశద్రోహులు మాదిరి సర్కార్ ట్రీట్ చేయడం పట్ల రైతులు తీవ్ర అభ్యంతరం చెబుతున్నారు. దేశ స్వతంత్రం కోసం, అనంతరం దేశం రక్షణలో, దేశానికీ బుక్కెడు బువ్వ పెడుతున్న రైతన్న ల కుటుంబాలను, ముఖ్యంగా పంజాబీలను దేశ ద్రోహులు అనడం దారుణం! కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వచ్చిన తరవాత రైతులను అగౌరావపర్చడం కోసం ఏదది పడితే అది నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారు, అని రైతులు వాపోతున్నారు.

### 'బారికేడ్' మతలబు మారింది!

1830 ప్రాంతం లో యూరప్ లో బారికేడ్ లను ప్రజలు వారి మీదికి పోలీస్ లు రాకుండా ఏర్పాటు చేసేవారు!బెల్జియం, ఇటలీ, ఫ్రాన్స్, జర్మనీ లలో ఇదే జరిగేది! అలా ఉద్యమాలు, పోరాటాలు జరిగేవి! ప్రజలు కుర్చీలు, తలుపులు, మంచాలు పోలీస్,మిలిటరీ కి అడ్డంగా పెట్టే వారు!కాని ఇప్పుడు పీఎం మోడీ సర్కార్ లో పోలీస్ లు, మిలిటరీ, దేశంలోని ప్రజలు, ముఖ్యంగా రైతులు, రాజ్యాంగం, ప్రజాస్వామ్యం ఇచ్చిన శాంతియుతంగా ప్రదర్శన, ధర్నా నిర్వహించి, హక్కులను అడుగకుండా అడ్డుకోడానికి కాంక్రిట్ తో, రోడ్ల మీద మొలలు పాతి, గుంటలు తవ్వి బారికేడ్లను నిర్మించారు. శత్రువుల మీద వేసినట్లు, డ్రోన్లతో గ్యాస్ బాంబులు వేస్తున్నారు. రబ్బర్ బుల్లెట్ల తో, చెర్ర లతో కాల్చి గాయపరుస్తున్నారు!ఇదేమి రాజ్యం?పీఎం మోదీజీ!మదర్ ఆఫ్ డెమొక్రసీ లో కన్నీరు ఎవరు పెడుతున్నారో! ఒక్కసారి చూసారా?

### గుప్త చందాల గుట్టు రట్టు!

సుప్రీం కోర్ట్ ఒక వైపు రాజ్యాంగ విరుద్దమని రాజకీయ పార్టీ లకు గుప్త చందాలు ఇచ్చే మీ ప్రభుత్వం విధానం అయిన ఎలక్టరోల్ బాండ్ విధానం ను రద్దు చేయడం జరిగింది!అటు ప్రధాన విపక్ష పార్టీ అయిన కాంగ్రెస్ పార్టీ, యువజన కాంగ్రెస్ కు చెందిన 210 కోట్ల రూపాయలు సభ్యత్వం, తదితర మొత్తం ఉన్న బ్యాంక్ అకౌంట్ లను ఫ్రీజ్ చేస్తారు.మీ పార్టీ కి ఎవరెవరు? ఎంత ఇచ్చారు? ఆ కంపెనీ ల పేర్లు ఏమిటో? చెప్పగలరా? ఎన్నికల ఫండ్స్ లెక్కలు, దేశం లోని రాజకీయ పార్టీ లు అన్నీ బయట పెట్టాలి!రైతులకు, న్యాయం చేయండి! ఇంకా వారు ఎన్ని త్యాగాలు చేయాలి! ఈసారి నాలుగు రోజుల్లో ఒక్క ప్రాణం పోయింది! ఇంకా ఎన్ని ఊపిరులు పోవాలి? కాస్త మానవత్వం చూపండి! ఇన్సాన్ బనో! ఒక్క ఊపిరి చాలదా? గతంలో మాదిరి 750 ఊపిరులు కావాలా!



ఎండి.మునీర్
సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు
9951865223

# శ్రీధర్‌కు ఎన్ఎండిసి దక్కునా!

***మార్చి 18, 2023న పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్ సెలక్షన్ బోర్డ్ ఎన్ ఎండిసి టాప్ పోస్ట్ కోసం 7 మంది అభ్యర్థులను ఇంటర్వ్యూ చేసింది. సింగరేణి మాజీ బాస్, మాజీ సీఎండీ, ఐఎ ఎస్ అధికారి నడిమెట్ల శ్రీధర్ కూడా ఇంటర్వ్యూకు హాజరయ్యారు. అప్పటి బిఆరెస్ ప్రభుత్వం ఎన్ఎండిసి ఉన్నత పదవికి అతని పేరును అనుకూలంగా సిఫార్సు చేసింది. సింగరేణి మాజీ బాస్ బి ఆర్ ఎస్ నాయకులు మాజీ సీఎం కేసీఆర్/కేటీఆర్, కవితలకు సన్నిహితులుగా ఉన్నారు. ఆ కారణంగా మొత్తం బీఆర్ఎస్ పాలనలో 9 ఏళ్ల పాటు సింగరేణి బాస్‌గా కొనసాగారు.***



సింగరేణిలో ఎక్కువ కాలం పనిచేసిన అధినేత ఆయనే. ఈ సమయంలో బిఆరెస్ /టీబి జికె ఎస్ కి కాంట్రాక్టులు, కొనుగోలు ఆర్డర్లు, బదిలీ మరియు ఓవర్‌బర్డెన్ తొలగింపు కాంట్రాక్టులు,ఎండివో నియామకాలు, భూ కేటాయింపులు, భవనాల కేటాయింపు, క్వార్టర్స్ కేటాయింపు, మెడికల్ అన్‌ఫిట్‌లు, సి ఎస్సార్ నిధుల కేటాయింపు, డి ఎం ఎఫ్ టి నిధులు వంటి వాటికి సంబంధించి అతనిపై అనేక ఆరోపణలు వచ్చాయి. కేటాయింపు మొదలైనవి. ఆయనకు మరియు కేంద్ర ప్రభుత్వానికి మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడింది. ఎమ్ఓయు కింద అవసరమైన మేరకు కేంద్ర ప్రభుత్వం ముందస్తు అనుమతి లేకుండా అతని కొనసాగింపును రాష్ట్ర ప్రభుత్వం చేసింది. దీనిపై కేంద్రం అభ్యంతరం వ్యక్తం చేసింది. 99వ ఏజీఎంలో సింగరేణి బాస్‌గా కొనసాగేందుకు కేంద్ర ప్రభుత్వ ప్రతినిధి వ్యతిరేకంగా ఓటు వేశారు. ఇది అప్పట్లో సంచలన వార్తగా మారింది. తర్వాత బొగ్గు శాఖ కార్యదర్శి తనను సింగరేణి బాస్‌గా తొలగించాలని తెలంగాణ చీఫ్ సెక్రటరీకి గట్టిగా లేఖ రాశారు. దీంతో ఆయనకు, కేంద్రానికి మధ్య వివాదం తారాస్థాయికి చేరుకుంది. అతను బిఆర్ ఎస్ కి చాలా దగ్గరయ్యాడు. కోల్ బ్లెట్ ప్రజలు అతన్ని బి ఆర్ ఎస్ ఏజెంట్ అని పిలిచేవారు. 2017లో జరిగిన యూనియన్ ఎన్నికల్లో బి ఆర్ ఎస్ యూనియన్ తెలంగాణ బొగ్గు గని కార్మికసంఘం కి అనుకూలంగా పక్షపాతం చూపాడు. 2019లో టిబిజి కే ఎస్ పదవీకాలం ముగిసినప్పటికీ, అతను 5 సంవత్సరాలు యూనియన్ ఎన్నికలు నిర్వహించలేదు మరియు అన్ని యూనియన్లు అతనిపై ఆగ్రహం వ్యక్తం చేశాయి. అతను బిఎమ్ ఎస్ నాయకులు మరియు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వంటి బీజేపీ నాయకులతో వివాదాలకు దిగాడు. వారిని అవమానించాడు. ఆదిలాబాద్‌కు చెందిన బీజేపీ ఎంపీ తనపై అవినీతి ఆరోపణలు చేస్తూ కేంద్ర ప్రభుత్వానికి సవివరమైన ఫిర్యాదు రాశారు. సాధారణంగా పీఈఎస్బి ద్వారా ఎంపికైన 3 నెలలలోపు, అపాయింట్‌మెంట్ ఆర్డర్‌లు జారీ చేయబడతాయి. 18.3.2023 నుండి పీఈ ఎస్ బి యొక్క అన్ని ఎంపికలను కేబినెట్ నియామకాల కమిటీ ఆమోదించింది కానీ ఎన్ఎండిసి పోస్ట్ కోసం అప్పటి సింగరేణి బాస్, ఐఏఎస్ అధికారి నడిమెట్ల శ్రీధర్ ఎంపిక ప్రతిపాదనను ఆమోదించలేదు. పీఈఎస్బి ఎంపిక ప్యానెల్ సాధారణంగా ఒక సంవత్సరానికి చెల్లుబాటు అవుతుంది. అతని ఎంపిక చెల్లుబాటు 17.3.2024 వరకు ఉంటుంది. 2023 డిసెంబర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత సింగరేణిలో ఆయన పదవీకాలాన్ని పొడిగించలేదు. అతను సింగరేణి నుండి తొలగించబడ్డాడు. తెలంగాణ జీఏడీ విభాగంలో రిపోర్టు చేయాల్సిందిగా కోరారు. నెల రోజులుగా పోస్టింగ్ కోసం ఎదురుచూస్తూనే ఉన్నాడు. తరువాత షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖలో నియమించబడ్డాడు. ఈ పరిణామాల కారణంగా అవమానానికి గురైన అతను ఇప్పుడు ఎన్ఎండిసి టాప్ పోస్ట్‌పై దృష్టి సారించాడు. అతను ఎన్ఎండిసి టాప్ పోస్ట్ కోసం అపాయింట్‌మెంట్ ఆర్డర్‌ను పొందడానికి తన స్థాయిని ఉత్తమంగా ప్రయత్నిస్తున్నాడు. రాష్ట్ర జిఎడి , ఇంధన శాఖలు, చీఫ్ సెక్రటరీ వద్ద మరియు బొగ్గు మంత్రిత్వ శాఖలో కూడా అతనిపై విచారణ కోసం చాలా ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయి. అప్పటి టీపీసీసీ అధ్యక్షుడు, ప్రస్తుతం ఉన్న ఆయనపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు.ప్రస్తుత మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి,ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి వంటి పలువురు , కాంగ్రెస్ నేతలు ఆయనపై ఆరోపణలు చేశారు. అతను బిఆర్ఎస్ ఏజెంట్‌గా ఉన్నందున ఎన్ఎండిసి పోస్ట్‌కు అతని అభ్యర్థిత్వం యొక్క మునుపటి ప్రభుత్వ సిఫార్సులు చెల్లుబాటు కావని మరియు ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం నుండి తాజా క్లియరెన్స్ తీసుకోవాలని డిమాండ్‌లు ఉన్నాయి. గత వైరుధ్యాలు, ఆరోపణలు లేదా తిరస్కరణలను విస్మరించి కేంద్ర ప్రభుత్వం ఎన్ఎమ్‌డిసి టాప్ పోస్ట్ కోసం అతనికి అపాయింట్‌మెంట్ ఆర్డర్‌ను జారీ చేస్తుందా? అనేది ఆసక్తికరంగా ఉంది. గతంలో టిడిపి ఎమ్మెల్యే గా ఉన్నపుడు, ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి కూడా శ్రీధర్ అవినీతి మీద వాకబు చేసిన దాఖలాలు ఉన్నాయి! అందుకే సీఎం గా ఆయన రాగానే శ్రీధర్ కు స్థాన చలనం జరిగింది.సింగరేణి లో ఆయన అవినీతి మీద విచారణకు సిపిఐ పక్ష నేత కొత్తగూడెం ఎమ్మెల్యే కూనం నేని సాంబశివరావ్ డిమాండ్ చేశారు.

**-ఎండి. మునీర్, సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు,9951865223,**

# 'రాజకీయాలకు రాచబాట'
# కటాలిన్ నోవాక్ రాజీనామా

*చిల్డ్రన్ హోం నిర్వాహకులు పిల్లలను లైంగికంగా వేధిస్తున్న విషయాన్ని కప్పిపుచ్చిన సంస్థ డిప్యూటీ డైరెక్టర్‌ను కోర్టు దోషిగా తేల్చి శిక్ష విధించిన వ్యక్తికి హంగేరీ అధ్యక్షురాలు కటాలిన్ నోవాక్ క్షమాభిక్షను ప్రసాదించడంపైయావత్ దేశ ప్రజానీకాన్ని తీవ్రఆగ్రహావేశాలకు గురిచేసిన ఘటన ప్రపంచవ్యా ప్తంగా సంచలనం సృష్టించింది. దశాబ్దానికి పైగా హంగేరియన్ రాజకీయ రంగంలో ఆధిపత్యాన్ని చెలాయిస్తున్న సంప్రదాయవాద ప్రధాన మంత్రి విక్టర్ ఓర్బన్‌కు సన్ని హిత మిత్రురాలు అయిన హంగేరీ అధ్యక్షురాలు కటాలిన్ నోవాక్ ఆ రకంగా క్షమాభిక్షను ప్రసాదించడంపైప్రజలు ఏకంగా అధ్యక్షురాలి భవనం ముందే నిరసన జ్వా లలు రగిలించారు. ఈ వివాదం కుటుంబ - స్నేహపూర్వక విధానాలపైప్రచారం చేసిన హంగేరీ ప్రధాన మంత్రి విక్టర్ ఓర్బన్‌కు సవాలుగా మారి రాజకీయ విపరిణామాలను తెచ్చి పెట్టిన దరిమిలా అంతిమంగా అధ్యక్షురాలు తన పదవిని కోల్పోవడం 'ప్రజాశక్తివిజయం'గా అభివర్ణించవచ్చు. ఈ రకంగా ఓర్బన్ ప్రభుత్వం దేశ అధ్యక్షురాలు కటాలిన్ నోవాక్ క్షమాపణపై ప్రజల ఎదురుదెబ్బను ఎదుర్కొన్నందున రాజకీయ నష్టాన్ని అరికట్టే దిశలో భాగంగా జూన్లో జరిగే యూరోపియన్ పార్లమెంట్ ఎన్ని కల ప్రచారాన్ని ప్రారంభించిన ఫిడెజ్ పార్టీ ఇకమీదట 'బాలలపై నేరాలకు పాల్పడిన వ్యక్తులను క్షమింపజేసే అధికారాలను అధ్యక్షుడికి కల్పించకూడదు' అనే రాజ్యాంగ సవరణను పార్లమెంటుకు సమర్పించడాన్ని స్పష్టంగా గమనించవచ్చు.*



ఫ్రాన్సిస్ హంగేరీ పర్యటనలో భాగంగా గత సంవత్సరం ఏప్రిల్ నెలలో హంగరీ అధ్యక్షురాలు కటాలిన్ నోవాక్ చేత క్షమాభిక్ష ప్రసాదింపబడిన 25 మందిపేర్లు హంగేరియన్ మీడియా ద్వారా వెలుగులోకి రావడాన్ని గమనించవచ్చు . ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే బాలల గృహంలోని పిల్లలను బలవంతం చేసినందుకు జైలు శిక్ష అనుభవించిన వ్యక్తికి హంగరీ అధ్యక్షురాలు కటాలిన్ నోవాక్ క్షమాభిక్ష ప్రసాదించారని గత వారం ప్రాంతీయ వార్తా సైట్ కథనాన్ని వెల్లడించడంతో భారీ వివాదం చెలరేగి దేశవ్యాప్తంగా నిరసనలతో హోరెత్తించడం సంచలనం సృష్టించింది. గత శుక్రవారం నిరసనకారులంతా కలిసి 'బాలల దోషికి క్షమాభిక్షని ప్రసాదించిన దేశ అధ్యక్షురాలు కటాలిన్ నోవాక్ పదవికి రాజీనామా చేయాలి' అని ఆ అధ్యక్షురాలు నివాసం ముందు ధర్నా కు దిగడం, ప్రధానితో పాటూ అధికార పక్షం మొత్తం ఈ ఘటనకు బాధ్యత వహించాలని డిమాండ్ చేయడం, అలాగే పతిప్రక్షా ల నుంచి కూడ తీవ్రస్థాయిలో విమర్శలు వెలువెత్తాయి. తత్ఫలితంగా గత శనివారం నాడు దేశ అధ్యక్షురాలు కటాలిన్ నోవాక్ తన పదవికి రాజీనామా చేయాల్సిన విషమ పరిస్థితి నెలకొనడం గమనార్హం. "దోషితాను పర్యవేక్షించిన పిల్లల దుర్బలత్వాన్ని దుర్వినియోగం చేయలేదు అని నమ్మి నేను గత ఏప్రిల్ నెలలో క్షమాపణ ఇవ్వా లని నిర్ణయించుకున్నా ను. ఆ క్షమాపణ చాలామంది వ్యక్తులలో అయోమయం మరియు అశాంతికి కారణమైంది. దోషికి క్షమాభిక్షని ప్రసాదించే విషయంలో నేను తప్పు డు నిర్ణయాన్ని తీసుకున్నా ను. నేను ముమ్మా టికితప్పు చేశానని అంగీకరిస్తున్నాను. బాధితులందరికి క్షమాపణలు కోరుతున్నాను. నేను పిల్లల కుటుంబాలను రక్షించడానికి అనుకూలంగా ఉంటాను. నేను బాధితులందరికి అండగా నిలుస్తాను. పార్లమెంటు సభ్యురాలిగాను మరియు యూరోపియన్ పార్లమెంట్ జాబితా నాయకత్వం నుండి నేను వైదొలగుతున్నాను. మీరు నన్ను అధ్యక్షురాలిగా సంబోధించేచివరిఈ రోజు ఈ క్షణం వరకు మాత్రమే ఉంటుంది. అంతిమంగా నేను ప్రజా జీవితం నుండి వైదొలుగుతున్నాను" అని వ్యాఖ్యానిస్తూ దేశ అధ్యక్షురాలు కటాలిన్ నోవాక్ ఈ ఫిబ్రవరి 10 నాడు తన అధ్యక్ష పదవికి రాజీనామాను చేయడాన్ని స్పష్టంగా గమనించవచ్చు. కటాలిన్ నోవాక్ 2020 అక్టోబర్ నుండి2021 వరకు నాల్గవ ఓర్బన్ ప్రభుత్వంలో కుటుంబ వ్యవహారాల మంత్రిగా కూడా పనిచేసిమార్చి 2022లో హంగరీకి అధ్యక్షురాలు అయ్యారు. 44 సంవత్సరాల వయస్సు లో అధ్యక్షురాలుగా ఎన్నికైన ఆమె ఆ పదవిని నిర్వహించిన మొదటి మహిళ మరియు అతి పిన్న వయస్కు రాలుగా చరిత్రను సృష్టించారు. హంగేరియన్ ప్రజా జీవితంలో అత్యంత ప్రభావవంతమైన మహిళగా ఫోర్బ్స్ మ్యాగజైన్ లోను ఆమె స్థానాన్ని పొందడాన్ని ప్రత్యేకంగా గమనించవచ్చు. కటాలిన్ నోవాక్ హంగేరియన్ అధ్యక్షురాలిగా ఎక్కువగా ఆచార వ్యవహారాలను నిర్వహించిన మొదటిమహిళగా గుర్తింపు పొందితనను తాను కుటుంబ - కేంద్రీకృత క్రిస్టియన్ సంప్రదాయవాద రాజకీయవేత్తగా ముద్రవేసుకున్నారు. తాను తీసుకున్న తప్పుడు క్షమాభిక్ష నిర్ణయం కారణంగా ప్రజాభీష్టం ఆందోళన మేరకు ఆమె తన అధ్యక్షురాలు పదవికి రాజీనామా చేయడం తద్వారా 'తప్పు చేసిన వారు పదవులలో కొనసాగడం నైతికంగా ఏమాత్రం సరైనదికాదు' అనే సందేశాన్ని స్పష్టంగా వెల్లడించారు అని తప్పకుండా చెప్పవచ్చు. కాని నేడు ప్రజాసేవ అంటే ఏమిటో తెలియని వారు 'మేము ప్రజాసేవ చేయడానికి రాజకీయాలలోకి వచ్చాము' అని ప్రగల్భాలు పలుకుతూ తీరా గెలిచాక అసలు ప్రజా సేవను విస్మరిస్తూ పలు కుంభకోణాలతో పాలుపంచుకుంటూ అడ్డంగా దొరికిపోవడాన్ని ప్రజలు సునిశితంగా గమనిస్తూనే ఉన్నారు. అంతిమంగా 'ప్రజా చెమట చుక్కల కష్టార్జిత వేల, లక్షల కోట్ల ధనాన్ని ఉన్నపళంగా దోచుకుంటున్న నేతలకు ప్రజాప్రతినిధులుగా కొనసాగే నైతిక హక్కు ఏమాత్రం లేదు' అని ఘంటాపథంగా చెప్పవచ్చు. ప్రజా సంక్షేమం పట్టని పాలకులు కటాలిన్ నోవాక్ మాదిరిగా స్వచ్ఛంధంగా రాజీనామాలు చేయాల్సిన అవసరం తప్పకుండా ఉందిఅని చెప్పడంలో ఏమాత్రం సందేహం లేదు. ఈ విధంగా హాంగేరీ దేశ అధ్యక్షురాలు కటాలిన్ నోవాక్ రాజీనామా 'రాజకీయాలకు రాచబాట'గా నిలవాల్సిన అవసరాన్ని నొక్కి చెప్తుంది అని నిస్సందేహంగా చెప్పవచ్చు.



జేజేసీపీ బాబూరావు
రీసెర్చ్ స్కాలర్,
9493319690

# కంది పంటకు భౌగోళిక గుర్తింపు పొందిన ఫలితం లేదు



- ప్రభుత్వం దృష్టి సారించి రాయల్టీ, గనుల లీజు విషయంలో వ్యాపారులకు కార్మికులకు అండగా ఉండాలి
- జుంటుపల్లి, కోట్ పల్లి ప్రాజెక్టులకు అధిక మొత్తంలో నిధులు కేటాయించాలి
- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి

**తాండూరు ఫిబ్రవరి 16(జనంసాక్షి)**

కంది పంటకు భౌగోళిక గుర్తింపు పొందిన రైతులకు సరైన ఫలితం దక్కడం లేదని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. తెలంగాణ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా శుక్రవారం తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి తాండూర్ ఎమ్మెల్యేగా మొదటి సారి తాండూర్ సమస్యల పై మాట్లాడుతూ తాండూర్ పరిసర ప్రాంతాల్లో విస్తారమైన ఖనిజ సంపద నిలయంగా తాండూర్ నియోజకవర్గం ఉందని ఇక్కడ లభించే సుద్ద,నాపరాతితో అనుసంధానంగా చాలా వరకు పరిశ్రమలు పరిసర ప్రాంతాల్లో ఉండటంతో సుమారు 15వేల మంది కి ఉపాధి లభిస్తుందని ప్రస్తావించారు. అయితే సుద్ద భూముల లీజల విషయం రాయల్టీ చెల్లింపు లో కాని పొరుగు రాష్ట్రం కర్ణాటక తో పోలిస్తే ఇక్కడ అధిక మొత్తంలో ఖర్చు అవ్వడంతో వ్యాపారస్తులకు భారంగా మారి వ్యాపారులు చేయలేకపో తున్నారు.కాబట్టి ఈ ప్రాంతంలో ఉపాధి పొందుతున్న చాలా మంది కార్మికులకు ఇబ్బందిగా మారిందని అన్నారు.ప్రభుత్వం దృష్టి సారించి రాయల్టీ మరియు గనుల లీజు విషయంలో వ్యాపారస్తులకు కార్మికులకు అండగా ఉండాల్సిన అవసరం ఉందని సభా దృష్టికి తీసుకెళ్లడం జరిగింది అలాగే నియోజకవర్గంలో సాగు నీటి ప్రాజెక్టులు అయిన జుంటుపల్లి, కోట్ పల్లి ప్రాజెక్టులకు అధిక మొత్తంలో నిధులు కేటాయింపు చేసి త్వరగా పనులు పూర్తి చేసే విధంగా చూడాలని ప్రస్థావించడం జరిగింది, విద్యారంగానికి సంబంధించిన తాండూర్‌లో ఐటిఐ కళాశాల మౌలిక సదుపాయాలతో పాటు మైనింగ్ కళాశాల ఏర్పాటు చేసే విధంగా చూడాలని బషీరాబాద్ లో కేవలం జీవోలకే పరిమితం అయిన జూనియర్ కళాశాలను వచ్చే విద్యా సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభమయ్యే విధంగా చూడాలని.తాండూర్ ప్రాంతంలో పండే కంది పంటకు భౌగోళిక గుర్తింపు పొందిన ఇక్కడ ఉన్న రైతులకు మేలు జరగాలంటే కంది బోర్డు తో పాటు వాళ్ళని ఆర్థరైజ్డ్ యూజర్స్ గా గుర్తించాలని సభ లో ప్రస్తావించడం జరిగింది.వెంబడే రాష్ట్ర రోడ్లు భవనాలు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ తాండూర్ నియోజకవర్గంలో చాలా సమస్యలు ఉన్నాయని ముఖ్యమంత్రి దృష్టికీ తీసుకెళ్ళి దశాల వారిగా సమస్యలు పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు.

# ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకంపై ప్రజలకు సంపూర్ణ అవగాహన కల్పించాలి



## కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**నారాయణపేట జిల్లా బ్యూరో (జనం సాక్షి):**

సంప్రదాయ చేతి వృత్తుల వారిని, హస్తకళాకారులను అన్నివిధాలుగా ప్రోత్సహిస్తూ, వారి యొక్క నైపుణ్యాలను పెంపొందిస్తూ ఆర్థికంగా బలోపేతం చేయాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన(పథకం)పై ప్రజల్లో అవగాహన పెంపొందించాలని నారాయణపేట జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సూచించారు. పీఎం విశ్వకర్మ పథకంపై అవగాహన కల్పించేందుకు నారాయణపేట జిల్లా కేంద్రంలోని షీలా గార్డెన్‌లో శుక్రవారం ఎంఎస్ఎంఈ(మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్ప్రైజెస్) అభివృద్ధి కార్యాలయం, హైదరాబాద్, జిల్లా పరిశ్రమల కేంద్రం, నారాయణపేట సహకారంతో జిల్లా స్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సదస్సును కలెక్టర్ కోయశ్రీ హర్ష, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మాయంక్ మిత్తల్ కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామీణ, పట్టణ ప్రాంతానికి చెందిన అర్హులైన ప్రతి ఒక్కరు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ పథకం ఉద్దేశ్యాలు, ప్రయోజనాలను వివరిస్తూ, అర్హులైన వారందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆన్ లైన్లో ఎలా దరఖాస్తు చేసుకోవాలనే దానిపై అవగాహన కల్పించారు. ఈ సదస్సులో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మయాంక్ మిత్తల్ మాట్లాడుతూ.కమ్మరులు, స్వర్ణకారులు, కమ్మరులు, వడ్రంగులు, శిల్పులు, చేతి వృత్తుల వారు, హస్తకళాకారులు వంటి 18 కేటగిరీలలో పని చేస్తున్న వారు ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందవచ్చున్నారు. వడ్రంగులు, పడవల తయారీదారులు, కమ్మరులు, తాళాల తయారీదారులు, బంగారం/వెండి ఆభరణాల పని చేసేవారు, శిల్పులు, చర్మకారులు, తాపీ పనివారు, చీపురు తయారీదారులు, రజకులు, దుస్తులు కుట్టే దర్జీలు, చేపల వలలు తయారుచేసే వారు ఈ పథకం కింద దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఇతరులపై ఆధారపడకుండా సొంతంగా స్వయం ఉపాధి ఏర్పర్చుకోవాలనుకునే చేతివృత్తిదారులు, హస్త కళాకారులకు ఈ పథకం ఎంతో ఉపయుక్తంగా నిలుస్తుందన్నారు. చేతివృత్తులపై ఆధారపడి జీవిస్తున్న ఏ కులానికి సంబంధించిన వారైనా సరే,ఈ పథకానికి అర్హులని ఆయన స్పష్టం చేశారు. పీ.ఎం విశ్వకర్మ యోజన కింద దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన వారిని ఎంపిక చేసి నైపుణ్యం మెరుగుదల కోసం 5 రోజుల పాటు అడ్వాన్సు శిక్షణ అందించడం జరుగుతుందని, శిక్షణ కాలంలో రోజుకు 500 రూపాయల చొప్పున స్టైఫండ్ చెల్లిస్తారని వివరించారు. విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ధ్రువీకరణ పత్రం, గుర్తింపు కార్డు జారీ చేయబడుతుందన్నారు. అంతేకాకుండా వృత్తి పరికరాలు సమకూర్చుకునేందుకు వీలుగా టూల్ కిట్ కోసం 15 వేల రూపాయల ఆర్థిక సహాయం అందిస్తారని తెలిపారు. లబ్దిదారులు నామమాత్రంగా కేవలం ఐదు శాతం వడ్డీపై రుణ సదుపాయం పొందవచ్చని ఆయన చెప్పారు. విశ్వకర్మలు తయారుచేసే వస్తువులకు సరైన మార్కెటింగ్ వసతి లభించేలా ఎంఎస్ఎంఈ కృషి చేస్తుందని అన్నారు. ఇలా అనేక ప్రయోజనాలతో కూడుకుని ఉన్న పీ.ఎం విశ్వకర్మ పథకం గురించి గ్రామగ్రామాన విస్తృత ప్రచారం నిర్వహిస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరు ప్రయోజనం పొందేలా చొరవ చూపాలని ఎంపీడీవోలు, ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులు,కామన్ సర్వీస్ సెంటర్ (సి.ఎస్.సి) ఆపరేటర్లు, విశ్వకర్మలకు అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఈ సదస్సులో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ రామ సుబ్బారెడ్డి,ఎం.ఎస్.ఎం.ఈ అధికారి శ్రీనివాస్ రావు, బీసీ సంక్షేమ శాఖ అధికారి కృష్ణమాచారి, డి ఎల్ పి ఓ సుధాకర్ రెడ్డి, లీడ్ బ్యాంకు అధికారి విజయ్ కుమార్, డొమైన్ ఎక్స్ పర్ట్ లు పగుడాకుల శ్రీనివాస్, కావలి వెంకటయ్య, జిల్లాకు చెందిన ఎంపీడీవోలు, ఎంపీ ఓలు, పంచాయతీ కార్యదర్శులు, విశ్వకర్మలు తదితరులు పాల్గొన్నారు

# పేట డిఎస్పీగా బాధ్యతలు తీసుకున్న లింగయ్య

**నారాయణపేట జిల్లా బ్యూరో(జనం సాక్షి):**

నారాయణపేట సబ్ డివిజనల్ పోలీస్ అధికారిగా లింగయ్య శుక్రవారం సాయంత్రం పదవి బాధ్యతలు తీసుకొన్నారు ఇతను ఇంతకు ముందు సిఐడి డిఎస్పీగా హైదరాబాద్‌లో విధులు నిర్వర్తించి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇంతకుముందు డీఎస్పీగా విధులు నిర్వహించిన కే. సత్యనారాయణ జోగులాంబ గద్వాల జిల్లా డిఎస్పీగా బదిలీ అయ్యారు.అనంతరం నూతన డీస్పిగా జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో పుల మొక్క అందించి మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఎస్పీ ఆయనకు శుభాకాంక్షలు తెలిపి జిల్లా పరిధిలో శాంతి భద్రతలు పరిరక్షించాలని సూచించారు. ఈ సందర్భంగా నూతన డిఎస్పీ లింగయ్య మాట్లాడుతూ జిల్లా పరిధిలో ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ శాంతి భద్రతలు పరిరక్షించడానికి కృషి చేస్తానని అలాగే జిల్లా ప్రజలంతా సహకరించాలని కోరారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహించే వారిపై చట్టరీత్యా కఠినంగా వ్యవహరించడం జరుగుతుందని డిఎస్పీ తెలిపారు.

# స్టేట్ ఫైనాన్స్ కమీషన్ మెంబర్‌గా రమేష్ మహరాజ్



**తాండూరు, ఫిబ్రవరి 16 (జనం సాక్షి)**

తెలంగాణ స్టేట్ ఫైనాన్స్ కమిషన్‌లో కాంగ్రెస్ పార్టీ టీపీసీసీ ఉపాధ్యక్షులు ఎం.రమేష్ మహరాజ్‌కు మెంబర్‌గా అవకాశం వరించింది. గతంలో బీఆర్ఎస్ నియమించిన కమీషన్ పదవులకు నాయకులకు రాజీనామ చేయడంతో ఖాళీలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం కమీషన్ పోస్టు భర్తికి ప్రతిపాదనకు పంపింది. చైర్మన్‌గా సీనియర్ నేత, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, మరో ముగ్గురిని బోర్డు సభ్యుల పేర్లతో ఇచ్చిన ప్రతిపాదనను తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళసై ఆమోదం తెలిపారు. దీంతో స్టేట్ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌గా రాజయ్యతో పాటు బోర్డు సభ్యులుగా తాండూరుకు చెందిన టీపీసీసీ ఉపాధ్యక్షులు ఎం.రమేష్ మహారాజ్, సంకేపల్లీ సుధీర్ రెడ్డి, నెహ్రూ నాయక్ మల్సోత్ నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమీషన్ పదవీ కాలం రెండు సంవత్సరాల పాటు ఉంటుందని స్పష్టం చేశారు. అయితే రాష్ట్ర ఫైనాన్స్ కమీషనర్ మెంబర్‌గా ఎం.రమేష్ మహరాజ్ నియామకం కావడం పట్ల తాండూరుకు నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ. ఎం.రమేష్ మహరాజ్ కు అభినందనలు తెలిపారు.

# తెలంగాణ అభివృద్ధిని శోధించి సాధించింది కేసీఆర్

- బిఆర్ఎస్ ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ
- గత పదేళ్ల ప్రభుత్వ పాలనలో శేరిలింగంపల్లికి దేశంలో అగ్ర తాంబూలం
- ప్రజల ఆశీర్వాదంతో రానున్న రోజుల్లో బంగారు తెలంగాణ రాష్ట్రం ఆవిష్కరించి తీరుతాం



**శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 16 (జనంసాక్షి) :**

తెలంగాణ రాష్ట్రంలో తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రజల ఆశీర్వాదంతో బిఆర్ఎస్ ప్రభుత్వం ఆవిష్కృతమై ప్రజాహితమైన సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెట్టి అమలు చేసిందని... రాష్ట్ర ప్రజల అవసరాలు, భవిష్యత్తును నిజాయితీగా శోధించి సాధించిన ఘనత తమ ప్రభుత్వానికి దక్కిందని, అది చరిత్రలో ఆచంద్రార్కమని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఆరున్నర దశాబ్దాల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం దేశంలో, రాష్ట్రంలో ప్రజలకు ఓరగబెట్టిందేమీ లేదని... మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో కేవలం బిఆర్ఎస్ పార్టీని ఆడిపోసుకోవడమే ఎన్నికల ఎజెండాగా పెట్టుకొని ప్రజలను మభ్యపెట్టి దొడ్డిదారిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, లేదంటే తప్పకుండా బిఆర్ఎస్ పార్టీనే హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేసేదని ఆయన అభిప్రాయపడ్డారు. తెలంగాణ రాష్ట్ర సాధకుడుగా ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సాధించడం ఒక ఎత్తైతే... గడచిన తొమ్మిదిన్నర సంవత్సరాలలో బిఆర్ఎస్ ప్రభుత్వం సాధించిన ప్రగతి మరో ఎత్తని అరికెపూడి తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పరిపాలనలో 'తెలంగాణ ప్రాంతం' అడుగడుగునా అణిచివేతకు గురై అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచిన వాస్తవాలను తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా ఆనాడే కెసిఆర్ గుర్తించి ప్రాంతీయ అభివృద్ధే పరమావధిగా భావించి ప్రత్యేక ఉద్యమం ద్వారా తెలంగాణ రాష్ట్ర స్వప్నం సాక్షాత్కారం అయ్యేలా అవిశ్రాంత పోరాటం నిర్వహించారన్నారు. రాష్ట్రంతోనే సరిపెట్టుకో కుండా కేవలం దశాబ్ద కాలంలో తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధిలో ఎన్నో దశాబ్దాల ముందుకి తీసుకెళ్లడం జరిగిందన్నారు. 2014కు ముందున్న శేరిలింగంపల్లి నియోజకవర్గం... ప్రస్తుత శేరిలింగంపల్లి ప్రాంతం ఇటు సామాన్యుడు అటు మేధావుల ఆలోచనలను సైతం అందుకోలేన ంత వేగంగా అభివృద్ధిని సాధించిందని గుర్తు చేశారు. రాష్ట్రానికి అవసరమైన మౌలిక సదుపా యాలలో విద్య, వైద్యం, పారిశ్రామికీకరణ, ఉపాధి, విద్యుత్తు, రక్షిత మంచినీరు తదితర ఏ విభాగాన్ని తట్టిచూసినా గత ఆరున్నర దశాబ్దాల కాలంలో సాధ్యం కాని అభివృద్ధి కళ్ళముందే సాక్షాత్కరిస్తుందని ఎమ్మెల్యే అరికపూడి అన్నారు. ఇతర రాజకీయ పార్టీలలాగా తప్పుడు ఉపన్యాసాలు, కట్టు కథలు, పార్టీ ఫిరాయింపులు, పారాషూట్ రాజకీయాలు కేసీఆర్ నేతృత్వంలోని బిఆర్ఎస్ పార్టీ నైజం కాదని పరోక్షంగా కాంగ్రెస్ ప్రభుత్వం, విపక్షాలనుగూర్చి గాంధీ ఎద్దేవా చేశారు. తన రాజకీయ ప్రస్థానంలో ఎన్నో మలుపులను, ఎన్నో ఎత్తుపల్లాలను చవిచూసానని.. శేరిలింగంపల్లి నియోజకవర్గం ప్రజల అభివృద్ధి, సంక్షేమం అనే లక్ష్యాల ముందు అవతలి వ్యక్తుల ఆరోపణలు గాలి మాటలేనని అన్నారు. ఇంతకుముందు రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్, ఐటి, పురపాలక శాఖ మంత్రి కెటిఆర్ రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలనుగూర్చి తాను పెద్దగా అవసరం లేదని, ప్రస్తుత పాలకులు ఏం చెప్పుకున్నా.. ఎవరు అవునన్నా కాదన్నా తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ముద్ర ఎప్పటికీ చెరిగిపోనిదన్నారు. 2014 కు ముందు ప్రభుత్వం ఇచ్చిన హామీలలో నూటికి నూరు శాతం అమలు చేసిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్, ఐటి, పురపాలక శాఖామంత్రి కెటిఆర్ సారథ్యానికే దక్కుతుందని, అనేక సంక్షేమ కార్యక్రమాలను సైతం ప్రవేశపెట్టి అమలు చేసిన దార్శనికత తమ ప్రభుత్వానిదేనన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, 24 గంటల ఉచిత విద్యుత్తు, దళిత బంధు, సిఎం రిలీఫ్ ఫండ్, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, వివిధ వర్గాలకు పింఛన్లు వంటి విప్లవాత్మక అభివృద్ధి, సంక్షేమ నిర్ణయాలవల్ల రాష్ట్రం శరవేగంగా అభివృద్ధి రేటును సాధించి గణనీయమైన ఉపాధి అవకాశాలు పుష్కలంగా పెరగడంతో దేశం నలుమూలల నుండి తెలంగాణ రాష్ట్రానికి ప్రజలు క్యూ కట్టారని, ఇప్పుడు ప్రజా వ్యతిరేక విధానాల వల్ల రాష్ట్ర అభివృద్ధి తిరోగమనంలో కొనసాగుతుందని ఎద్దేవా చేశారు. రాష్ట్ర అభివృద్ధి విషయంలో చిన్న చిన్న విషయాలనుసైతం పరిగణలోకి తీసుకొని ప్రతి విషయాన్ని ఒక సవాల్ గా స్వీకరించి తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకున్న ఘనత తమ ప్రభుత్వానికిమాత్రమే దక్కుతుందన్నారు. ప్రభుత్వం పారిశ్రామిక రంగానికి ప్రత్యేక రాయితీలతోకూడిన ప్రణాళికల ఫలితంగా రియల్ ఎస్టేట్ రంగం శరవేగంగా పుంజుకుని 30 కిలోమీటర్ల పరిధిని దాటని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నేడు కనీసం 100 కిలోమీటర్ల పరిధిని అందుకుందంటే దాని వెనక బిఆర్ఎస్ ప్రభుత్వ కృషి ఎంతుందనేది విపక్షాలే ప్రజలకు వివరించాలని అరికెపూడి గాంధీ పునరుద్ఘాటించారు. ముఖ్యమంత్రి కెసిఆర్ కీలకంగా అమలుపరిచిన నిర్ణయాలవల్ల దశాబ్దం క్రితం నెలకొని ఉన్న అప్పటి తెలంగాణ ప్రాంతం... ప్రత్యేక రాష్ట్రంగా రూపాంతరం చెంది అభివృద్ధిలో దేశంలోని ఇతర రాష్ట్రాలను పక్కనపెట్టి అగ్రతాంబూలం అందుకోవడం మామూలు విషయం కాదన్నారు. నేడు రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ 70వ వసంతంలోకి అడుగుపెడుతున్నందున తెలంగాణ రాష్ట్ర ప్రజలు కెసిఆర్ సంక్షేమం కోసం, ప్రభుత్వ పరిపాలనకోసం వీలైనన్ని కార్యక్రమాలు చేపడితే బాగుంటుందని ఎమ్మెల్యే అరికెపూడి ఆశాభావం వ్యక్తం చేశారు.




# కుల గణనతో అన్నివర్గాలకు సమన్యాయం

## మేడ్చల్ కాంగ్రెస్ ఇంచార్జ్ తోటకూర వజ్రెష్ యాదవ్

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 16 (జనం సాక్షి)**

తెలంగాణలోని అన్నివర్గాలకు సమ న్యాయం జరిగేలా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న కుల గణన నిర్ణయం అన్ని వర్గాలకు సమ న్యాయం చేస్తుందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్ మల్కాజిగిరి ఇంచార్జ్ తోటకూర వజ్రెష్ యాదవ్ అన్నారు. శుక్రవారం తెలంగాణ శాసన సభలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ అధ్వర్యంలో తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమైన నిర్ణయమని అన్నారు. కుల గణనతో తెలంగాణ రాష్ట్రంలోని అన్ని వర్గాలకు సముచిత న్యాయం జరుగుతుందని, గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా రేవంత్ రెడ్డి ఇచ్చిన వాగ్దానం మేరకు ఈ రోజు శాసన సభలో బిల్లు పాస్ చేయడంతో కాంగ్రెస్ పార్టీపై ప్రజలకు సంపూర్ణ నమ్మకం పెరిగిందని అన్నారు.




# ఇబ్రహీంపట్నం మున్సిపల్ వీగిపోయిన అవిశ్వాసం

## అవిశ్వాసంపై చర్చకు కౌన్సిలర్ల గైర్హాజరు

**ఇబ్రహీంపట్నం ఫిబ్రవరి16(జనం సాక్షి):**

నెల రోజుల ఉత్కంఠకు ఎట్టకేలకు తెర పడింది. ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్ పర్సన్‌పై బీఆర్ఎస్, బీజేపీ కౌన్సిలర్‌లు ప్రవేశ పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. అవిశ్వాసంపై చర్చకు చైర్ పర్సన్‌తో పాటు అధికార పార్టీ కౌన్సిలర్ లు, బీఆర్ఎస్, బీజేపీ కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. దీంతో చైర్ పర్సన్ పై పెట్టిన అవిశ్వాసం వీగిపోయింది. గత నెల 15న ఫామ్ 1 ప్రకారం జిల్లా కలెక్టర్ కు అవిశ్వాసంపై నోటీసులు ఇచ్చారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అవిశ్వాసంపై ఉదయం 10:30 గంటలకు ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రవీందర్ సాగర్ ల సమక్షంలో చర్చకు ముహూర్తం ఖరారు కాగా బలనిరూపణకు గంట సమయం ఇచ్చారు. కౌన్సిలర్ లు రాకపోవడంతో ఆర్డీఓ మరో అర్ధ గంట సమయం ఇచ్చారు. అప్పటికి కౌన్సిలర్ లు హాజరు కాకపోవడంతో అవిశ్వాసం వీగిపోయినట్లు ఆర్డీఓ అనంత రెడ్డి ప్రకటించారు. మొత్తం 24 మది పాలకవర్గ సభ్యులు ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఎక్స్ అఫిషియో సభ్యునితో మొత్తం 25 మంది సభ్యులకు ఫామ్ 2 ప్రకారం ప్రత్యేక సమావేశానికి హాజరుకావాలని నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. వారిలో ఒక్కరు కూడా హాజరు కాకపోవడంతో అవిశ్వాసం వీగిపోయినట్లు చెప్పారు. అవిశ్వాసం విగిపోయిన విషయంపై జిల్లా కలెక్టర్ కు నివేదిక అందిస్తామని తెలిపారు.

# ఉపాధి హామీ పథకంలో అంజూరైన సిసి రోడ్లను మంగళవారం లోపు గ్రౌండింగ్ పూర్తిచేయాలి

## జిల్లా కలెక్టర్ జి. రవి నాయక్

**మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి)**

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన సి.సి.రోడ్లను మంగళవారం నాటికి గ్రౌండింగ్ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రవి నాయక్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పంచాయతీరాజ్ డి.ఈ.లు, ఏఈ లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో సిసి రోడ్ల గ్రౌండింగ్ పై జిల్లా కలెక్టర్ సమీసించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 2023-24 సంవత్సరం లో 17 కోట్ల 80 లక్షల 50 వేల రూపాయల అంచనాతో 397 సిసి. రోడ్లు మంజూరు కాగా ఇందులో 140 సిసి రోడ్లు ఇప్పటివరకు గ్రౌండ్ చేసినట్లు ఆయన తెలిపారు. మండలాల వారీగా జిల్లా కలెక్టర్ గ్రౌండింగ్ పై సమీక్షించారు. ఇంకా గ్రౌండింగ్ చేయని సిసి రోడ్లను మంగళవారం లోగా గ్రౌండ్ చేయాలని ఆయన ఆదేశించారు మంజూరైన సీసీ రోడ్లను 293 జి పి లలో తీర్మానాలు పూర్తి చేసినట్లు, మిగతా జి పిలలో జిపి తీర్మానాలు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, మండల ప్రత్యేక అధికారులతో సమన్వయం తో పూర్తి చేయాలని అన్నారు. ఇసుక సమస్య వుంటే అదనపు కలెక్టర్ (రెవెన్యూ) తహశీల్దార్ లతో మాట్లాడి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివెంద్ర ప్రతాప్, అదనపు కలెక్టర్( రెవెన్యూ) మోహన్ రావు, పంచాయతీ రాజ్ ఈ ఈ నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్‌లో 'పట్నం' దంపతుల చేరిక

- రంగారెడ్డి జిల్లాను మరింత బలోపేతం చేస్తుంది
- శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇంచార్జ్ వాలిదాసు

**శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 16 (జనం సాక్షి) :**

గత పది సంవత్సరాలుగా తెలంగాణ రాష్ట్రంలో బిఆర్ఎస్ ప్రభుత్వం కొనసాగించిన అరాచకత్వాన్ని ప్రజలు ఇప్పుడిప్పుడే గమనిస్తున్నారని పట్నం మహేందర్ రెడ్డి, వికారాబాద్ జిల్లా జడ్పీ చైర్ పర్సన్ పట్నం సునీతామహేందర్రెడ్డి లాంటివారు సైతం వాస్తవాలను గుర్తిస్తూ ప్రజా పాలన కొనసాగిస్తున్న కాంగ్రెస్ పార్టీలో చేరిపోవడం సంతోషించదగ్గ విషయమని, వారు చేరడంతో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీకి మరింత మేలు చేకూరుతుందని శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వాలిదాసు జగదీశ్వర్ గౌడ్ అన్నారు. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన 'పట్నం' దంపతులను శుక్రవారం జగదీశ్వర్ గౌడ్ కలుసుకొని ప్రత్యేక శుభాకాంక్షలు తెలపడంతో పాటు పార్టీలోకి సాదర ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రతి నిరుపేదకు కాంగ్రెస్ ప్రభుత్వ ఫలాలు అందాలని, తెలంగాణ రాష్ట్రంలో ప్రతి నిరుపేద బడుగు బలహీన వర్గాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వ ఫలాలు అందాలని..వారి అభ్యున్నతికి కృషి చేసేది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని వాలిదాసు జగదీశ్వర్ గౌడ్ స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ రాజ్య స్థాపనే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారని జగదీశ్వర్ గౌడ్ పేర్కొన్నారు. ప్రజాపాలనకు నిదర్శనంగా, పేదల సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో పరిపాలనను సాగిస్తుందని, ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజలకు అన్ని విధాలుగా అందేలా చూస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఆయా డివిజన్ల కాంగ్రెస్ నేతలు, మహిళా నాయకురాళ్ల, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మత రాజకీయాలతో ముందుకొస్తున్న మోడీ

- కార్పొరేట్ శక్తులకు మేలు చేసేందుకే కార్మిక చట్టాల మార్పు, పని గంటల పెంపు
- మోడీ పాలనలో ప్రజలపై గుదిబండగా మారిన నిత్యావసర వస్తువుల ధరలు
- దేశాన్ని లూటీ చేసే కార్పొరేట్ అదిపతులపైనే మోడీకి ప్రేమ
- సీఐటియూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు
- దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా జిల్లా కేంద్రంలో భారీ బైక్ ర్యాలీ, కలెక్టరేట్ ఎదుట ధర్నా




**సంగారెడ్డి టౌన్ జనం సాక్షి:**
పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలకు చెప్పేదేమీ లేకే మత రాజకీయాలతో ముందుకొస్తున్న మోడీ ప్రభుత్వాన్ని ఓడించాలి. 2024 సార్వత్రిక ఎన్నికలలో గెలవడానికి చెప్పుకోదగ్గ అభివృద్ధి ఏమీ లేకపోవడంతో మరోసారి అధికారం కోసం మత విభజన పేరుతో ప్రజల ముందుకు వస్తుందని, మోడీ పాలనలో ప్రజలపై గుది బండగా ధరలు పెరిగాయని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు అన్నారు. దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా శుక్రవారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించి అనంతరం పి.ఎస్.ఆర్ గార్డెన్‌లో సభ ఏర్పాటు చేయడం జరిగింది. సభ అనంతరం ర్యాలీగా కలెక్టరేట్ వరకు బయలుదేరి అన్ని సంఘాలతో కలిసి ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా చుక్క రాములు మాట్లాడుతూ దేశాన్ని లూటీ చేస్తున్న కార్పొరేట్ అదిపతులపై మాత్రమే మోడీ కి ప్రేమ ఉందన్నారు. కార్పొరేట్ శక్తులకు మేలు చేసేందుకే కార్మిక చట్టాలను మారుస్తూ.. పని గంటలు పెంచుతున్నారని విమర్శించారు. ప్రజలెదుర్కొంటున్న సమస్యలపై నోరెత్తితే దేశ ద్రోహం కేసులు నమోదు చేస్తున్నారని ధ్వజమెత్తారు. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తున్నారు. విలువైన గనులను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు ఇష్టారీతిగా దోపిడీకి పాల్పడుతున్నారు. రాజ్యాంగాన్ని, లౌకికతత్వాన్ని తుంగలో తొక్కుతున్నారు. మతపిచ్చి ప్రజలకు ఎక్కించి శాశ్వతంగా అధికారంలోకి ఉండాలని మోడీకోరుకుంటున్నారన్నారు. దీన్ని దేశ ప్రజలు అంగీకరించరన్న సంగతి మోడీ గ్రహించాలని హితవు పలికారు. మూడవ సారి అధికారంలోకి వస్తే రాజ్యాంగం లేకుండా చేసి మనుస్మృతినీ తీసుకు వస్తారని అన్నారు. పేదలు, కార్మికులు, రైతు కూలీలకు కనీస వేతనాలు ఎందుకు పెంచడం లేదన్నారు. రైతులు బాగుంటేనే దేశం బాగుంటుందన్నారు. ఢిల్లీలో రైతులపై నిర్బంధాన్ని మోపడం సరికాదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు శివకుమార్, రాష్ట్ర కార్యదర్శి ఈశ్వర్ ప్రసాద్,ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్, అధ్యక్షులు నరసింప రెడ్డి, జిల్లా అధ్యక్షులు బీరం మల్లేషంలు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వాన్ని నిలువరించకపోతే ప్రస్తుతం ఉన్న కార్మిక చట్టాలు నిర్వీర్యం అవుతాయని, కార్మిక హక్కులు కాల రాయబడతాయని ఇందుకు మోడీని గద్దె దించడం ఒక్కటే మార్గమని అన్నారు. ఈ సమ్మెకు కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శితో పాజి అనంత కిషన్, సిపిఎం జిల్లా కార్యదర్శి జయరాజ్, టీజేఎస్ జిల్లా అధ్యక్షులు తుల్జా రెడ్డి తదితరులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో వివిధ కంపెనీల సిఐటియు నాయకులు బాగా రెడ్డి, యాదగిరి, ప్రసన్న రామదాసు, కొండల్ రెడ్డి, రమేష్, సురేష్ దయానంద్, ప్రవీణ్, వరలక్ష్మి, సువర్ణ, జరీనా, వెంకట్ రెడ్డి, శ్రీరాములు, శశికళ, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.



## అసంక్రమిత వ్యాధుల నిర్దారణ మూడవ విడత కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.కె. సుధాకర్ లాల్**

**నాగర్ కర్నూల్ ఆర్సీ ఫిబ్రవరి 16(జనం సాక్షి):**
నాగర్ కర్నూల్ అసంక్రమిత వ్యాదుల మూడవ విడత స్క్రీనింగ్ పరీక్షలు త్వరలో ప్రారంభిస్తున్నామని అందులో భాగంగా నాగర్ కర్నూలు డివిజన్ పరిధిలోని పల్లె దవాఖాన వైద్య అధికారులకు, స్టాఫ్ నర్సలకు, పర్యవేక్షణ అధికారులకు అవగాహన కార్యక్రమాన్ని జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి కార్యలయంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డా కె సుధాకర్ లాల్ మాట్లాడుతూ, అసంక్రమిత వ్యాధుల స్క్రీనింగ్‌ను గత రెండు విడతలుగా విజయవంతంగా నిర్వహించామని మళ్ళీ ఇప్పుడు మూడవ విడత ఎన్.సి.డి. స్క్రీనింగ్ పరీక్షలు ప్రతి ఇంటి వద్దకు వెళ్లి ఆశాలు, ఏ.ఎన్.ఎమ్.లు నిర్వహించేలా ప్రతి ఒక్కరికి ట్రైనింగ్ అందించడం జరుగుతుందని ఈ శిక్షణాను సద్వినియోగ పరుచుకొని మన జిల్లాను ఎన్.సి.డి. స్క్రీనింగ్‌లో ఉన్నత స్థానంలో ఉంచాలన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ కన్సల్టెంట్ డా. అబ్దుల్ వశి అసంక్రమిత వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డా. వెంకట్ దాస్, ఎన్సిడి ప్రొగ్రాం అధికారి కృష్ణ మోహన్, జిల్లా ఇమ్మునైజెషన్ అధికారి డా. రవి కుమార్ నాయక్,డా. తారసింగ్, డా. ప్రదీప్, వైద్య అధికారులు, పర్యవేక్షణ అధికారులు, ఏ.ఎన్.ఎమ్.లు పాల్గొన్నారు.

## వన్ డిస్ట్రిక్ట్..వన్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్

- శిల్పారామంలో 30 మంది ఆవిష్కర్తల ఆవిష్కరణల ప్రదర్శన
- గ్రామీణ వ్యవసాయ రంగం, రైతులకు ఆవిష్కరణల ఉపయోగం



**మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి)**
రైతులకు ఆవిష్కరణల ఆవిష్కర్తలు , రైతులు మధ్య సంబంధాలను పెంపొందించుకోవడానికి 'వన్ డిస్ట్రిక్ట్ వన్ ఎగ్జిబిషన్' కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని జిల్లా కలెక్టర్ జి.రవి నాయక్ తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రం లోని శిల్పారామం లో తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్, నాబార్డ్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'వన్ డిస్ట్రిక్ట్.. వన్ ఎగ్జిబిషన్' కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టి.ఎస్.ఐ.సి, నాబార్డు సంయుక్తంగా ఏర్పాటు చేసిన "వన్ డిస్ట్రిక్ట్ ..వన్ ఎగ్జిబిషన్' విజయవంతంగా నిర్వహించడం పట్ల ఆయన అభినందించారు. క్షేత్ర స్థాయి ఆవిష్కరణల ప్రదర్శన నిర్వహించినట్లు , రైతులకు అండగా నిలిచే ప్రత్యేక కార్యక్రమమని చెప్పారు. వ్యవసాయం, నీటి వ్యవస్థలు, వ్యర్థాల నిర్వహణ, పాడి పరిశ్రమ మరియు గ్రామీణ సంఘాలను మెరుగుపరచడానికి మార్గాలను కనుగొన్న 30 మంది ఆవిష్కర్తల నుండి వారి కొత్త ఆలోచనలను ప్రదర్శనలను వీక్షించినట్లు ఆయన తెలిపారు. ఈ ఆలోచనలు రైతులకు మార్పును కలిగిస్తాయన్నారు. సంచలనాత్మక పరిష్కారాల అమలు, వినియోగాలను సులభతరం చేస్తుందని చెప్పారు. గ్రామీణ స్థాయి ఆవిష్కరణలకు మార్కెట్‌ను ఏర్పాటు చేయడంలో ఒక ముఖ్యమైన పురోగతిని సూచిస్తుందని చెప్పారు. గ్రామీణ స్థాయి ఆవిష్కరణల కోసం మార్కెట్‌ను సృష్టించడం లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ ప్రదర్శనలు ఆవిష్కర్తలు మరియు లబ్ధిదారుల మధ్య విలువైన సంబంధాలను సులభతరం చేయటమే కాక, రైతులు, స్థానిక సంఘాలు ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడానికి వినూత్న పరిష్కారాలను స్వీకరించి అమలు చేయడంపై చర్యలను ప్రోత్సహిస్తాయని కలెక్టర్ తెలిపారు. వ్యవసాయం, గ్రామీణాభివృద్ధిలో వినూత్న పరిష్కారాల విస్తరణ, రైతులు మరియు స్థానిక కార్మికులకు శారీరక శ్రమను తగ్గించడం, తక్కువ ధర స్థిరమైన పరిష్కారాలపై అవగాహన పెరగడం, 30 మంది భాగస్వామ్య ఆవిష్కర్తలకు కొత్త మార్కెట్ యాక్సెస్ మరియు వ్యాపార అవకాశాలు వంటివి ఈ కార్యక్రమం నిర్వహణ ద్వారా ఫలితాలు సాధనకు ఉపయోగ పడతాయన్నారు. టిఎస్ఐసి, నాబార్డ్ సంయుక్తంగా ఏర్పాటుచేసిన వన్ డిస్ట్రిక్ వన్ ఎగ్జిబిషన్ విజయవంతంగా నిర్వహించడం పట్ల వారిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమానికి 750 మందికి పైగా రైతులు, ప్రజలు, ఆసక్తి కలగిన వ్యక్తులు హాజరయ్యారు. ఈ ఎగ్జిబిషన్లో స్టాల్స్‌ను జిల్లా కలెక్టర్ జి. రవి నాయక్, అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ లతోపాటు అధికారులు రైతులు పరిశీలించారు.

## క్రీడలలో రాణిస్తున్న జంగిలి మల్లేశం



- డబ్ల్యూ పీసీలో రాష్ట్రస్థాయి ప్రధాన స్థానం
- ప్రభుత్వం ప్రోత్సహిస్తే జాతీయ స్థాయిలో రాణిస్తానంటున్న మల్లేశం

**చేర్యాల ఫిబ్రవరి 16 (జనం సాక్షి) :**
సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం మర్మాముల శివారు బంజేరు గ్రామానికి చెందిన జంగిలి మల్లేశం తెలంగాణ రాష్ట్రంలో క్రీడలలో రాణిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. ఆయనను ప్రభుత్వం ప్రోత్సహిస్తే మరింత ముందుకు పోత అంటున్నారు. జంగిలి మల్లేశం 2024 జనవరి 26న హైదరాబాదులో జరిగిన రాష్ట్రస్థాయి ఛాంపియన్షిప్ డబ్ల్యూ పీసీ తరఫున పోటీలో పాల్గొని మాస్టర్ కేటగిరీలో పాల్గొని బెంచ్ ప్రెస్ లో 65 నుండి 70 కిలోలు లేపి 100 కిలోల డెడ్ లిఫ్ట్ చేసి మాస్టర్ కేటగిరీలో ప్రధాన స్థానంలో నిలిచారు. మద్దూరు మండలంలోని మారుమూల పల్లెటూరులో జన్మించి వృత్తిరీత్యా హైదరాబాద్ లోని లేజర్ సేవింగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో ఉద్యోగం చేస్తూ ఈ స్థాయికి రావడం పట్ల ఆయనను శుక్రవారం చేర్యాల బీరప్ప దేవాలయం వద్ద కురుమ సంఘం నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. సన్మానించిన వారిలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందే అశోక్, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కార్యదర్శి అందె బీరయ్య, కురుమ సంఘం నియోజకవర్గ అధ్యక్షులు ఓరుగంటి శంకర్, ప్రధాన కార్యదర్శిలు అందె నాని బాబు, కార్యదర్శి జంగిలి యాదగిరి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఈరి భూమయ్య, యాదవ సంఘం జిల్లా నాయకుడు కర్రె నర్సింహులు, కురుమ సంఘం మండల నాయకుడు సూర్ణ శ్రీకాంత్, మేక యాదగిరి, బండారి అంజయ్య, రైతు సంఘం మండల కార్యదర్శి కత్తుల భాస్కర్ రెడ్డి, పాల్గొన్నారు.

## అసెంబ్లీ తొలి సమావేశాల్లోనే మఖ్తల్ సమస్యలపై గళం విప్పిన ఎమ్మెల్యే

- గతంలో స్థానికేతర ఎమ్మెల్యే పట్టించుకోని వైనం
- పర్యాటక ప్రాంతంగా సంగంబండ రిజర్వాయర్
- ప్రెస్ మీట్‌లో కాంగ్రెస్ నేత బాలక్రిష్ణారెడ్డి



**మఖ్తల్ ఫిబ్రవరి 16 (జనం సాక్షి)**
మఖ్తల్ గళం విప్పిన తొలి ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అని, ఎమ్మెల్యేగా ఎన్నికైన రెండు నెలల్లోనే తొలి అసెంబ్లీ సమావేశాల్లోనే మఖ్తల్ అంటే ఏమిటి, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో ఎక్కడుందనేలా చాటిచెప్పిన తొలి వ్యక్తి వాకిటి శ్రీహరి అని, అలాంటి ఎమ్మెల్యే ఉండటం మఖ్తల్ ప్రాంతవాసులకు గర్వకారణమని కాంగ్రెస్ రాష్ట్రనాయకులు, బీకేఆర్ ఫౌండేషన్ అధినేత గవినోళ్ల బాలక్రిష్ణారెడ్డి అన్నారు. మఖ్తల్ పట్టణంలోని సంగంబండ రోడ్ లో మాజీ జడ్పీటీసీ లక్ష్మారెడ్డి నివాసంలో జరిగిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొని మాట్లాడారు. బాలక్రిష్ణారెడ్డి మాట్లాడుతూ, గతంలో ఉన్న ఎమ్మెల్యేకూ, ప్రస్తుత ఎమ్మెల్యేకు తేడా స్పష్టంగా తెలుస్తోందని, గత ఎమ్మెల్యే దాదాపు పదేళ్ల కాలంలో ఎన్నడూ చిన్నాచితకా సమస్యలపైన తప్ప, పెద్దగా ఈ ప్రాంత మెజారిటీ సమస్యలపైన దృష్టి సారించలేదన్నారు. మఖ్తల్ ప్రాంతవాసి, నియోజకవర్గ సమస్యలపైన పూర్తి అవగాహన ఉన్న వాకిటి శ్రీహరి పూర్తి పరిణతితో, అసెంబ్లీలో తనకు ఇచ్చిన సమయాన్ని సద్వినియోగం చేసుకుని, దాదాపుగా అన్ని సమస్యలను శాసనసభ దృష్టికి తొలి సమావేశంలోనే తీసుకురావడం నిజంగా గొప్ప విషయమని అన్నారు. సమస్యల ప్రస్తావనే కాకుండా, అక్కడే మంత్రులను తరచుగా కలుస్తూ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. సంగంబండ రిజర్వాయర్ ను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు పర్యాటక మంత్రి జూపల్లి చర్యలు చేపట్టారని, ఇందులోభాగంగా ప్రాజెక్ట్ వద్ద సర్వే సైతం చేశారని అన్నారు. ఇక పునరావాసంలో భాగంగా సంగంబండ, ఉజ్జెల్లి, గార్లపల్లి వాసులకు రావాల్సిన నిధులను అతి త్వరలో ఇప్పించేందుకు ఎమ్మెల్యే చర్యలు చేపడుతున్నారని తెలిపారు. ఇతర కాంగ్రెస్ నేతలు లక్ష్మారెడ్డి, సూర్యనారాయణగుప్తా, చంద్రకాంత్ గౌడ్, గవినోళ్ల గోపాల్ రెడ్డి, గణేశ్ కుమార్, రవికుమార్ యాదవ్, కట్టా సురేశ్ గుప్తా మాట్లాడుతూ... సంగంబండ పునరావాస సమస్యను గత 18 ఏళ్లలో మాజీ ఎమ్మెల్యే ఏనాడూ పట్టించుకోలేదని, ప్రస్తుత ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి కేవలం రెండునెలల్లోనే పునరావాస నిధులు అందించేందుకు కృషి చేస్తున్నారని అన్నారు. స్థానికేతర ఎమ్మెల్యే ఉన్నపుడు మఖ్తల్ ప్రాంత సమస్యలు పట్టించుకోలేదని, ప్రస్తుతం స్థానిక ఎమ్మెల్యే అందుబాటులో ఉండటంతో మఖ్తల్ ప్రాంతంలో పూర్తి అవగాహన, చిత్తశుద్ధితో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కోళ్ల వెంకటేష్, నీలప్ప ముదిరాజ్, కావలి శ్రీహరి, కావలి తాయప్ప, పారేవుల విష్ణువర్ధన్ రెడ్డి, శ్రీనివాస్, మామిళ్ల ఆంజనేయులు, కేశవరెడ్డి, చందాపురం రాములు, పసుల రంజిత్ రెడ్డి, సంతోష్ రెడ్డి, వెంకట్ రెడ్డి, క్రిష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాల అమలుకు సమన్వయంతో కృషి చేయాలి

**జిల్లా పరిషత్ చైర్ పర్సన్ వనజమ్మ**

**నారాయణపేట జిల్లా బ్యూరో (జనం సాక్షి):**
ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయడంలో అధికారులు సమన్వయంతో కృషి చేయాలని నారాయణపేట జిల్లా పరిషత్ చైర్ పర్సన్ వనజమ్మ అన్నారు.శుక్రవారం జిల్లా కేంద్రానికి సమీపంలోని సింగారం మలుపు దారిలో గల వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రంలో జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. జెడ్పి చైర్ పర్సన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి నారాయణపేట జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష హాజరయ్యారు.ఈ సందర్భంగా జెడ్పీ చైర్ పర్సన్ వనజమ్మ మాట్లాడుతూ. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూడాలన్నారు. సమావేశంలో పలువురు జడ్పీటీసీలు, ఎంపీపీలు తమ తమ మండలాల పరిధిలోని సమస్యలను ప్రస్తావించారు. ఉట్కూరు జెడ్పిటిసి సభ్యులు అశోక్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో ఇంకా కొంతమంది రైతులకు రైతుబంధు నగదు జమ కాలేదని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జాన్ సుధాకర్ ను ప్రశ్నించగా.ఈ నెలాఖరు వరకు రైతుబంధు సాయం రైతుల ఖాతాల్లో జమ అవుతుందని జాన్ సుధాకర్ తెలిపారు. రైతు బంధు సాయం ఎన్ని ఎకరాల వరకు కట్ చేసే అవకాశం ఉందని కో ఆప్షన్ సభ్యులు తాజుద్దీన్ అడగగా ప్రభుత్వం రైతు భరోసా పథకానికి సంబంధించి నిర్దిష్టమైన ప్రణాళికను రూపొందిస్తుందని, ప్రస్తుతానికి గత సీజన్లో మాదిరిగానే రైతులకు నగదు సాయాన్ని ప్రభుత్వం వారి ఖాతాలో జమ చేస్తుందని జాన్ సుధాకర్ తెలిపారు.దామరగిద్ద ఎంపీపీ బక్క నరసప్ప మాట్లాడుతూ దామరగిద్ద లో రోడ్డుకు ఇరువైపులా విద్యుత్ తీగల కింద మొక్కలు నాటుతున్నారని, తీగల కింద కాకుండా వాటి పక్కలో మొక్కలు నాటాలని కోరారు. సమావేశంలో విద్యుత్ శాఖ అధికారి మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు



చేయబోయే గృహ జ్యోతి పథకానికి 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించే ఏదైనా రేషన్ కార్డు కలిగిన వినియోగదారులు అర్హులని, ఇప్పటికే లక్ష మందిలో 65 వేల మంది కి గృహ జ్యోతి పథకం అమలు కోసం లింకప్ చేయడం జరిగిందని, మిగతా వారికి కూడా లింక్ ఆఫ్ చేస్తామని చెప్పారు. గృహ జ్యోతి పథకాన్ని ప్రతి ఒక్కరికి అమలు చేయాలని జెడ్పిటిసి సభ్యులు అశోక్ కోరారు.రేషన్ కార్డు లేని వాళ్ళు గృహ జ్యోతి పథకానికి అర్హులు కారా అని మాగనూరు జడ్పిటిసి వెంకటయ్య ప్రశ్నించగా, స్పందించిన విద్యుత్ శాఖ అధికారి గైడెన్స్ ప్రకారం రేషన్ కార్డు తప్పనిసరి అని, రేషన్ కార్డు లేని వాళు ్ల కొత్త రేషన్ కార్డు తీసుకున్న తర్వాత గృహ జ్యోతి పథకానికి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో నర్వ జడ్పిటిసి సునీత మాట్లాడుతూ.. ఇటీవల చిన్నపిల్లలో గుండెపోటు మరణాలు సంభవిస్తున్నాయని, మండలాల వారిగా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గుండెపోటు నివారణపై అవగాహన కార్యక్రమాలు, ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని కోరారు. దామరగిద్దలో కలెక్టర్ కోయ శ్రీ హర్ష ప్రత్యేక చొరవ తీసుకొని నిర్మింప చేసిన ఆసుపత్రిలో 24 గంటల వైద్య సేవలను కొనసాగించాలన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు అందుబాటులో ఉండటం లేదని, రోగులకు వైద్య సేవలు సమయానికి అందడం లేదని, చిన్న రక్త గాయంతో ఆస్పత్రికి వెళ్తే మహబూబ్ నగర్‌కు రెఫర్ చేస్తున్నారని సభ దృష్టికి తీసుకురాగా, స్పందించిన జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.రంజిత్ కుమార్ వైద్య సేవలు అందిస్తున్నందుకే జిల్లా ఆసుపత్రి పనితీరు (ఫర్ఫామెన్స్) రాష్ట్రస్థాయిలో రెండో స్థానంలో నిలిచిందని తెలిపారు. ఆస్పత్రిలో తాము మెరుగైన సేవలు అందిస్తున్నామని చెప్పారు. సమావేశంలో ఊట్కూరు, మక్తల్, మాగనూరు ఎంపీపీలు తమ మండలాల పరిధిలో తాగునీటి సమస్య నెలకొందని, వేసవికాలంలో సమస్య మరింత జఠలమయ్యే ప్రమాదం ఉందని, అధికారులు వెంటనే స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. మద్దూర్ జెడ్పిటిసి రఘుపతి రెడ్డి మాట్లాడుతూ గ్రామపంచాయతీ,మండల పరిషత్, జిల్లా పరిషత్ స్థాయిలో బోర్లు వేసేందుకు జిల్లా కలెక్టర్ అనుమతి ఇవ్వాలని కోరారు.ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ..ఎంపీపీలు, జడ్పిటిసిలు తమ ఈ పదవి కాలంలో అభివృద్ధి పనుల విషయంలో జిల్లా అధికారులకు సహకరించారని, జిల్లా అధికారుల తరపున అందరికీ శుభాభినందనలు తెలిపారు.ఇక తాగునీటి సమస్య పరిష్కారానికి గ్రామపంచాయతీ వారిగా మిషన్ భగీరథ ఎంట్రా సిబ్బందితో పనులు చేయించు కోవచ్చని తెలిపారు.అనంతరం మధ్యాహ్నం జరిగిన రెండో దఫా సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ, షెడ్యూల్ కులాల అభివృద్ధి, మైనార్టీ సంక్షేమ శాఖ, జిల్లా పరిశ్రమల శాఖ, జిల్లా ముఖ్య ప్రణాళిక, గనులు భూగర్భ శాఖ, చేనేత జోలి శాఖ, ఉద్యాన పట్టు పరిశ్రమల శాఖ, పౌర సరఫరాల శాఖ, దేవాదాయ శాఖ, వెనక బడిన తరగతులు సంక్షేమ శాఖ, జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారులు తమ తమ పరిధిలోని ప్రగతి నివేదికలను సమావేశంలో చదివి వినిపించారు. ఈ సమావేశంలో జెడ్పి సీఈవో శైలజ, డిప్యూటీ సీఈఓ జ్యోతి పాల్గొన్నారు.

## ఈ నెలాఖరులోగా ఆహార భద్రత కార్డుల ఈ కేవైసీ నమోదు చేయాలి

**అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మోహన్ రావు**

**మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి)**
జిల్లాలో ఆహార భద్రత కార్డుల ఈ కేవైసీ యూనిట్ల నమోదు ఈ నెలాఖరులోగా నమోదు చేయాలని అదనపు కలెక్టర్(రెవెన్యూ) మోహన్ రావు ఆదేశించారు. శుక్రవారం జిల్లాలో ఆహార భద్రత కార్డుల ఈ కేవైసీ యూనిట్ల సేకరణపై సమావేశాన్ని చౌక ధర దుకాణాల డీలర్ ల ప్రతినిధులతో,పౌర సరఫరాల అధికారులతో ఐడిఓసిలో అదనపు కలెక్టర్ సమీక్షించారు. ప్రస్తుతానికి, ఈ కేవైసీ నమోదులో రాష్ట్ర సగటు 75 శాతానికంటే తక్కువగా, జిల్లాలో పిఓపిఎస్‌లో ఆహార భద్రతా కార్డ్ యూనిట్ల ఈ కేవైసీ 65% నమోదు పూర్తయిందని తెలిపారు. చౌక ధర దుకాణాల డీలర్లు ఈ కేవైసీ పెండింగ్‌లో ఉన్న యూనిట్‌లను గ్రామాల్లో టామ్-టామ్ వేయించి, బీట్ ద్వారా కార్డ్ దారులకు తెలియచేయాలని అన్నారు . ఈ నెల 29 లోగా కార్డ్ దారుల యూనిట్ల బ్యాలెన్స్ ఈ కేవైసీ నమోదును నిర్ధారించుకోవాలని సూచించారు. చౌక ధర దుకాణం డీలర్లు ఫిర్యాదులకు ఎటువంటి అవకాశం ఇవ్వకుండా సాధారణ దుకాణ పనితీరు సమయాలను నిర్వహించాలని ఆయన ఆదేశించారు. కార్డు ధారులకు ఏటువంటి ఇబ్బంది కలుగకుండా చూడాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## మెడికల్ కాలేజీ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలి

**జిల్లా కలెక్టర్ కోయశ్రీ హర్ష**

**నారాయణపేట జిల్లా బ్యూరో (జనం సాక్షి):**
మెడికల్ కాలేజీ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని జిల్లాలో కలెక్టర్ కోయశ్రీ హర్ష అధికారులను ఆదేశించారు. నారాయణపేట జిల్లా మెడికల్ కళాశాల మంజూరు అయినందున త్వరలో తరగతులు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నారాయణపేట లో అప్పంపల్లి లో మెడికల్ కళాశాల విద్యార్థుల కొరకు ప్రారంభించే తరగతుల గదులు ఇతర ఎర్పాట్లు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ త్వరలో మెడికల్ కళాశాల విద్యార్థులు తరగతులు ఈ అకాడమిక్ ఇయర్ లో ప్రారంభం కానున్నాయని అందుకు అన్ని ఏర్పాటు పూర్తి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నల్లమల్ల టైగర్ రిజర్వ్ గ్రామ తరలింపు పునరావాసాన్ని ఓ మోడల్‌గా తీర్చిదిద్దాలి

**కలెక్టర్ పి ఉదయ్ కుమార్**

**నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో,**
**ఫిబ్రవరి 16(జనం సాక్షి):**
నల్లమల్ల అమ్రాబాద్ టైగర్ రిజర్వు ప్రాంతాల్లోని సార్లపల్లి గ్రామ తరలింపు ప్రక్రియకు ఎలాంటి ఒత్తిడి లేకుండా గ్రామ సభలో తీర్మానించి ,సుముఖతం వ్యక్తం చేసిన 186 కుటుంబాల పునరావాసానికి నిర్ణీత షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ పి ఉదయ్ కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టరేట్ సమావేశం మందిరంలో జిల్లా కలెక్టర్ ఉదయ్ కుమార్ అధ్యక్షతన అదనపు కలెక్టర్లు కుమార్ దీపక్, కె సీతారామారావు, జిల్లా అటవీ శాఖ అధికారి రోహిత్ గోపిడి, అమ్రాబాద్ కోర్ ఏరియాలో నివసించే గ్రామ వాసుల కోసం స్వచ్ఛంద గ్రామ పునరావాసం కోసం జిల్లా కలెక్టర్ వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..టైగర్



రిజర్వ్ ప్రాంతం నుండి స్వచ్ఛందంగా తరలి వెళ్లేందుకు ముందుకొచ్చి ప్రతిపాదించిన సార్లపల్లి గ్రామ పునరావాసం ఒక మోడల్‌గా ఉండాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. అన్ని శాఖలతో సమన్వయం చేసుకొంటూ పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులకు జిల్లా కలెక్టర్ సూచించారు. టైగర్ రిజర్వ్ నుంచి గ్రామ తరలింపు పురోగతి పనులపై అధికారులతో అడిగి తెలుసుకున్నారు. సార్లపల్లి గ్రామంలో 186 కుటుంబాలను గుర్తించగా అందులో 85 కుటుంబాలు 15 లక్షల పరిహారం తీసుకోనున్నట్లు వారు గ్రామసభలో వెల్లడించారని, మిగిలిన 101 కుటుంబాలకు బాకారం సమీపంలో ఒక్కో కుటుంబానికి 220 గజాల ఇంటి నిర్మాణానికి స్థల కేటాయింపుతో పాటు వ్యవసాయ జీవనోపాధికై ప్రతి కుటుంబానికి 5 ఎకరాల వ్యవసాయ భూమిని ఇవ్వనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఇంటి స్థలం కోసం కేటాయించిన ప్రాంతా అభివృద్ధికి సంబంధిత శాఖల అధికారులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. అందుకు కావలసిన నిధులు అటవీ శాఖ వద్ద అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పునరావాసం కోసం కేటాయించిన ప్రాంతంలో సీసీ రోడ్డు నిర్మాణం త్రాగునీరు విద్యుత్ సౌకర్యం, అంగన్వాడి కేంద్రం ,ప్రాథమిక పాఠశాల, గ్రామ పంచాయతీ భవనం నిర్మాణాలకై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు కుమార్ దీపక్, కె సీతారామారావు, జిల్లా అటవీ శాఖ అధికారి రోహిత్ గోపిడి, గిరిజన సంక్షేమ శాఖ అధికారి కమలాకర్ రెడ్డి వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## బిఆర్‌ఎస్ దెబ్బకు ప్రజాభవన్‌కు సిఎం

### ఎమ్మెల్యే హరీష్ రావు వెల్లడి

**హైదరాబాద్, ఫిబ్రవరి 16 (జనంసాక్షి):**
బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నా ఎప్పుడు ప్రజల పక్షాన్నే పోరాడు తుందని మరోసారి రుజువైందని మంత్రి హరీస్ రావు అన్నారు. అందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఉన్న ఫలంగా ప్రజా భవన్‌కు పరుగులు పెట్టడమే తాజా నిదర్శనం అన్నారు. అసెంబ్లీలో బీఆర్‌ఎస్ దెబ్బకు సీఎం రేవంత్‌రెడ్డి నేడు ప్రజాభవన్ కు వెళ్లాల్సి వచ్చిందని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా శుక్రవారం ఆయన మీడియాతో కొద్దిసేపు చిట్‌చాట్ చేశారు. ప్రతి రోజు ప్రజాభవన్‌కు వెళ్తానని ప్రగల్భాలు పలికిన సీఎం అధికారంలోకి వచ్చాక తొలిరోజు మాత్రమే వెళ్లారన్నారు. ఇదే విషయంపై బీఆర్‌ఎస్ ఆధారాలతో నిలదీశామన్నారు.య దీంతో ఈ రోజు హడావుడిగా కేవలం అరగంట ముందు సమాచారం ఇచ్చి వెళు _న్నారన్నారు. ఇదే విషయం నిన్ననే ప్రజలకు సమాచారమిస్తే చాలా మంది తమ బాధలు చెప్పుకునేందుకు వచ్చేవారని హరీశ్ రావు తెలిపారు. బీఆర్‌ఎస్ పార్టీ ప్రతిపక్ష పార్టీ పాత్రను హుందాగా పోషిస్తుందన్నారు. ప్రజా సమస్యలపై గళమెత్తుతూ పేదల పక్షాన నిలుస్తామన్నారు.

## మేడారం జాతర కంట్రోల్ రూమ్‌ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

**టోల్ ఫ్రీ 1800-425-0620**



**ములుగు ప్రతినిధి,తాడ్వాయి - మేడారం,ఫిబ్రవరి16(జనం సాక్షి):**
శుక్రవారం మేడారం ఐటీడీఏ క్యాంప్ కార్యాలయం లో ఏర్పాటు చేసిన మేడారం జాతర కంట్రోల్ రూమ్ ను జిల్లా కలెక్టర్ , అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.శ్రీజ తో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మేడారం జాతరకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశాం అని భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తిన కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నంబర్ (1800-425-0620) ను సంప్రదించవచ్చు అని ఈ టోల్ ఫ్రీ నంబర్ 19 వ తేదీ నుంచి భక్తులకు అందుబాటులో ఉంటుందని అన్నారు.జాతర లో మొత్తం 382 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేస్తున్నాం అని మూడు ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్స్ అందుబాటులో ఉంటాయని జాతర లో ఎనిమిది జోన్లుగా 42 సెక్టార్స్ గా విభజించి ప్రతి జోన్ లో నోడల్ అధికారి , జోనల్ అధికారి సెక్టోరల్ అధికారి విధులలో ఉంటారని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.శ్రీజ,అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వేణు గోపాల్,జిల్లా ఈ-డిస్ట్రిక్ మేనేజర్ దేవేందర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

## మేడారం మంత్రుల పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ములుగు ప్రతినిధి,ఫిబ్రవరి16(జనంసాక్షి):**
శనివారం మేడారం లో రెవెన్యూ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి,దేవాదాయ ధర్మాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ,రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పంచాయతీ రాజ్ స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క పర్యటించనున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అమ్మవార్ల గద్దేల ప్రాంగణం,మీడియా పాయింట్,హరిత హెూటల్, ఆర్టీసీ బస్టాండ్,పరిసర ప్రాంతాల్లో జరుగుతున్నా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వేణు గోపాల్,ఆర్డీఓ సత్యపాల్ రెడ్డి,డిపిఓ వెంకయ్య, ఎమ్మార్వో రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## బెల్లంపల్లి నియోజకవర్గం సమస్యలు ప్రస్తావించిన ఎమ్మెల్యే

బెల్లంపల్లి, ఫిబ్రవరి 16, (జనంసాక్షి) :
అసెంబ్లీ సమావేశాల్లో శుక్రవారం బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ బెల్లంపల్లి నియోజకవర్గ సమస్యలను ప్రస్తావించారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం త్రాగడానికి స్వచ్ఛమైన గోదావరి నీరు కూడా బెల్లంపల్లి నియోజకవర్గ ప్రజలకు అందించలేక పోయిందని అన్నారు. బెల్లంపల్లి పట్టణంలో 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి కేవలం బీఆర్‌ఎస్ ప్రభుత్వం కాంట్రాక్టు కమిషన్ల కోసమే నిర్మించారని ఆరోపించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఏ విధమైన చికిత్సకు సంబంధించిన పరికరాలు కానీ, డాక్టర్లు గాని, సిబ్బంది గాని లేరని అన్నారు. బెల్లంపల్లి నియోజకవర్గ పరిధిలో ఏ గ్రామానికి వెళ్లినా, వార్డుకు వెళ్లినా బీఆర్‌ఎస్ ప్రభుత్వ హాయంలో కాలువలు , రోడ్లు కానీ ఎక్కడ కూడా అభివృద్ధి జరగలేదన్నారు. నాడు 2004లో కాంగ్రెస్ ప్రభుత్వం వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న హాయాంలో తాను మంత్రిగా ఉన్న సమయంలో బెల్లంపల్లి నియోజకవర్గానికి ముల్కాల నుండి గోదావరి నీరు సప్లై చేపించడం జరిగిందన్నారు. నేడు మళ్ళీ అదే ముల్కల నుండి స్వచ్ఛమైన గోదావరి నీరు బెల్లంపల్లి నియోజకవర్గా ప్రజలకు అందుబాటులోకి తేవాలని అసెంబ్లీలో కోరారు. బీఆర్‌ఎస్ హయాంలో బెల్లంపల్లి నియోజకవర్గం అభివృద్ధి 10 సంవత్సరాలు వెనుకబడిన పోయిందన్నారు. రాబోయే రోజుల్లో అన్ని విధాలుగా అభివృద్ధి పరచి బెల్లంపల్లి నియోజకవర్గ ప్రజల రుణాన్ని తీర్చుకుంటా అని ఎమ్మెల్యే వినోద్ పునరుద్ఘటించారు.

# బీజేపీతోనే తెలంగాణ అభివృద్ధి

- కాంగ్రెస్, బీఆర్‌ఎస్ దొందు దొందే..
- ఈ రెండు అవినీతి, కుటుంబ పార్టీలే
- ఈ రెండు పార్టీలు మజ్లిస్ పంచన చేరుతాయి
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



**హైదరాబాద్, ఫిబ్రవరి 16 (జనంసాక్షి):**
ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం పక్కన పెట్టిన కాంగ్రెస్ పార్టీ ఢిల్లీకి సూట్ కేసులు మోస్తున్నదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలో ప్రభుత్వంలో ఉన్న కాంగ్రెస్ రాహుల్ గాంధీ కోసం కాంట్రాక్టర్లను, బిల్డర్లను, కంపెనీలను బెదిరిస్తూ డబ్బులు వసూలు చేస్తోందని ఆయన ఆరోపణలు చేశారు. అన్నారు. మొన్నటి తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు కర్నాటక నుంచి సూట్ కేసులు వస్తే.. ఇప్పుడు తెలంగాణ నుంచి ఢిల్లీకి వెళ్తున్నాయని విమర్శించారు. ఈ మేరకు బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో వైసీపీ నాయకులు వెల్లల రామ్మోహన్ తన అనుచరులతో కలిసి బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు దొందు దొందే అని కిషన్ రెడ్డి విమర్శించారు. "ఈ రెండు అవినీతి, కుటుంబ పార్టీలే. ఈ రెండు పార్టీలు మజ్లిస్ పంచన చేరుతాయి. బుజ్జగింపు రాజకీయాలు చేస్తాయి. బీఆర్‌ఎస్ పార్టీ, కేసీఆర్ మీద దర్యాప్తు చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వానికి ధైర్యం లేదు. ఎందుకంటే కాంగ్రెస్ పార్టీ కూడా అవినీతి పార్టీ కాబట్టి. సీబీఐతో విచారణ జరిపించాలని మేము డిమాండ్ చేస్తే.. విజిలెన్స్ పేరుతో కాలయాపన చేస్తున్నది. విజిలెన్స్‌తో అయ్యేది లేదు.. పోయేది లేదు. కాంగ్రెస్ చెయ్యి బస్మాసుర హస్తం.. చెయ్యి గుర్తుకు ఓటేస్తే.. అదే చెయ్యిని ప్రజల తలపై పెట్టి మోసం చేస్తుంది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కాంట్రాక్టర్లకు నిధులు ఇవ్వక వారు జీహెచ్‌ఎంసీ ముందు ధర్నా చేసే దుర్మార్గ స్థితికి తీసుకువస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని మరింత దిగజార్చనుంది. హైదరాబాద్ నుంచి రాష్ట్రానికి పెద్ద మొత్తంలో ఆదాయం వస్తున్నా.. జీహెచ్‌ఎంసీకి నిధులు ఇవ్వడం లేదు"అని కిషన్? రెడ్డి మండి పడ్డారు.గత తొమ్మిదన్నరేండ్లలో మోదీ ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధి కోసం పెద్ద ఎత్తున నిధులు ఇస్తున్నదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. "రూ.400 కోట్లతో చర్లపల్లి, రూ.720 కోట్లతో సికింద్రాబాద్ స్టేషన్, రూ. 450 కోట్లతో కాచిగూడ, రూ. 350 కోట్లతో నాంపల్లి రైల్వే స్టేషన్లను మోదీ ప్రభుత్వం. ఎయిర్ పోర్టు తరహాలో సికింద్రాబాద్ స్టేషన్ డెవలప్ కానుంది. తెలంగాణ అభివృద్ధి జరగాలంటే, పెట్టు బడులు, ఉద్యోగాలు రావాలంటే మోదీ నాయకత్వం.. బీజేపీ నాయకత్వం అవసరం. భద్రాద్రి అభివృద్ధికి రూ.50 కోట్లు ఇచ్చారు. వరంగల్ రామప్ప దేవాలయానికి మోదీ కృషితో యునెస్కో గుర్తింపు వచ్చింది. జోగిలాంబ దేవాలయంలో అభివృద్ధి కార్యక్రమాలు జరుగు తున్నాయి. తెలంగాణలో లక్షా 20 వేల కోట్ల రూపాయల విలువైన రహదారుల నిర్మాణం జరిగింది. హైదరాబాద్ చుట్టూ రూ.26 వేల కోట్ల ట్రిపుల్‌ఆర్ రోడ్డును మోదీ మంజూరు చేశారు. తెలంగాణ అభివృద్ధిలో ఇది గేమ్ చేంజర్ కానుంది. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్ కల్పించిన ఘనత మోదీది"అని పేర్కొన్నారు. దేశంలో ఉగ్రవాదంపై మోదీ ప్రభుత్వం ఉక్కుపాదం మోపిందిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. "నిత్యం ఉగ్రవాదుల బాంబులతో రావణకాష్ఠంలా మండే కశ్మీర్‌లో 370 ఆర్టికల్ ఎత్తేసి.. అక్కడ శాంతి నెలకొల్పిన ఘనత నరేంద్ర మోదీ ప్రభుత్వానిది. దేశంలో శాంతి భద్రతలు మెరుగయ్యాయి. హైదరాబాద్ లో ఒకప్పుడు బాంబు పేలుళ్లు, ఉగ్రవాదుల చేతిలో పలువురి హత్యలు జరిగేవి. మోదీ వచ్చిన తర్వాత ఐఎస్‌ఐ ఉగ్రవాదాన్ని ఉక్కుపాదంతో అణచివేశారు. పాక్ లో ఇండియన్ కరెన్సీ ముద్రించి భారత్ లో చెలామణి చేసేవారు. ఇప్పుడు అది ఆగింది. ప్రపంచం దృష్టిలో పాక్ ను దోషిగా నిలబెట్టిన ఘనత మోదీ ప్రభుత్వానిది. రొట్టె ముక్క కోసం ఇప్పుడు పాకిస్తాన్‌లో ప్రజలు కొట్టుకుంటున్నారు. ఒకప్పుడు ఉగ్రవాదులు దేశంలో దాడులు చేస్తే.. ప్రభుత్వాలు మౌనంగా ఉండేవి. కానీ మోదీ అలా కాదు.. దేశంలో దాడులు జరిపిన టెర్రరిస్టులను గుర్తించి సర్జికల్ స్ట్రైక్ లు, ఎయిర్ స్ట్రైక్ లు చేసి వారిని మట్టుబెట్టారు. కాంగ్రెస్ హయాంలో ఎంపీలు, మంత్రులు అవినీతి ఆరోపణలతో, కుంభకోణాలతో జైలుకు వెళ్లారు. తొమ్మిన్నర ఏండ్ల మోదీ పాలనలో ఒక్క రూపాయి అవినీతి జరగలేదు. వచ్చే 25 ఏండ్లలో ప్రపంచ దేశాలకు విశ్వగురువుగా భారత్ ను నిలబెట్టాలని ప్రధాని పిలుపునిచ్చారు. అందులో భాగస్వామ్యం అయ్యేందుకు మనం సిద్ధమవ్వాలి"అని కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు.

## జిల్లా అభివృద్ధి దిశగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలి :జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్



**మంచిర్యాల ప్రతినిధి, ఫిబ్రవరి 16, (జనంసాక్షి) :**
జిల్లా అభివృద్ధి దిశగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శు క్రవారం జిల్లా కేంద్రంలోని జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా పరిషత్ చైర్పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశానికి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. రాహుల్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి గణపతితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో పని చేయాలని అన్నారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు ధాన్యం, పత్తికి మద్దతు ధర అందించడం జరుగుతుందని, పురపాలక సంఘాలు, గ్రామపంచాయతీలలో చేపట్టే ప్రభుత్వ కార్యక్రమాలకు స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం అందించడం జరుగుతుందని తెలిపారు. మార్క్‌ఫెడ్ ద్వారా కూరగాయలు, పూలతోటల పెంపకానికి అవసరమైన ఎరువులను సొసైటీల ద్వారా పంపిణీ చేయడం జరుగుతుందని, అంతర పంటల సాగుపై రైతుల కొరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. గొర్రెల పంపిణీ పథకంలో డి.డి.లు కట్టిన వారికి ప్రభుత్వ పాలసీ ప్రకారం యూనిట్స్ కాని, నగదు కాని ఇవ్వడం జరుగుతుందని, ఉద్యానవన శాఖ, కృషి విజ్ఞాన కేంద్రం సహకారంతో ఆయిల్పామ్ సాగుతో పాటు ఇతర ఉద్యానవన పంటల సాగుపై తీసుకోవలసిన జాగ్రత్తలు, మెళకువలపై రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లాలో సంక్షేమ గురుకుల పాఠశాలల్లోని విద్యార్థులు ఐ.ఐ.టి., జె.ఈ.ఈ.లలో ఉత్తమ ప్రతిభ కనబర్చడమే కాకుండా రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబర్చడంలో ఉపాధ్యాయులు, శిక్షకుల కృషి అభినందనీయమని అన్నారు. వార్షిక పరీక్షలలో విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించే దిశగా కృషి చేయడం జరుగుతుందని, పాఠశాలల్లో నిర్వహించే కార్యక్రమాలకు పేరెంట్ కమిటీ ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం అందించడం జరుగుతుందని తెలిపారు. నీటి పారుదల శాఖ ద్వారా జిల్లాలోని ప్రాజెక్టులు, చెరువులు క్రింద పూర్తి ఆయకట్టు వరకు సాగు నీరు అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో వరిధాన్యం కొనుగోలు ప్రక్రియలో అవసరమైన గన్నీ సంచులను అందుబాటులో ఉంచడంతో పాటు రైతులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా సదుపాయాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా పరిధిలో అక్రమంగా ఏర్పాటు చేసిన, చేస్తున్న లే అవుట్లపై సమగ్ర విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. వివిధ అంశాలపై ప్రజాపరిషత్ సభ్యులు తెలిపిన వివరాలను పరిశీలించి పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## అధికారులు సిద్దంగా ఉండాలి : ఐటిడిఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ అంకిత్

- ముగిసిన సెక్టోరల్ అధికారుల రెండవ లెవల్ శిక్షణ కార్యక్రమం
- 19 తేదీన విధులు నిర్వహించే అధికారులు రిపోర్ట్ చేయాలి



**ములుగు ప్రతినిధి,ఫిబ్రవరి16(జనంసాక్షి):**
మేడారం మహా జాతరకు వచ్చే సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిబద్ధత, అంకితభావంతో పనిచేసి, మేడారం జాతరను విజయవంతం చేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్ అంకిత్ అన్నారు. శుక్రవారం మేడారం ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో జాతర విధులకు కేటాయించబడిన సెక్టోరల్ అధికారులు, సిబ్బందికి రెండవ విడత శిక్షణా కార్యక్రమాన్ని ఐటిడిఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రాజెక్ట్ ఆఫీసర్ మాట్లాడుతూ,జాతరలో విధులు నిర్వహించే అధికారులకు శిక్షణా నేటితో ముగిసింది అని అధికారులు జాతర విధులలో పాల్గొనడానికి సిద్దంగా ఉండాలి అని అన్నారు.జాతర విజయ వంతానికి అధికారులు కృషి చేయాలని భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా చూడాలని తెలిపారు.జంపన్నవాగు వద్ద విధులు నిర్వర్తించే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఏ మాత్రం విధులలో ఏమరుపాటు గా వ్యవహరించరాదని తెలిపారు.జాతర పరిసరాల్లో భక్తులకు అర్థమయ్యేలా ఆర్&బి శాఖవారు సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. జన సమూహంలో పారిశుద్ధ్య నిర్వహణ నిరం తరం 24గంటలు చేయాలన్నారు. దుర్వాసన రాకుండా ఎప్పటి కప్పుడు గల్ఫర్ తో శుభ్రం చేస్తుండాలన్నారు. జాతర చుట్టూ 5 కి.మీ. పరిధిలో అన్ని ఏర్పాట్లు చేయాలని, పారిశుద్ధ్యాన్ని పకడ్బందీగా చేపట్టాలని అన్నా రు. పారిశుద్ధ్య సిబ్బందికి యూనిఫాం, గ్లౌజ్ లు, మాస్కులు ఇవ్వాలన్నారు. అన్ని పనులు సకాలంలో పూర్తి చేయా లన్నారు. ఆరోగ్య పరంగా మందులు అందుబాటులో పెట్టుకొని సర్వ సన్నద్ధంగా ఉండాలని వైద్య సిబ్బందికి సూచించారు.ఆలయ అలంకరణ, లైటింగ్,పరిసరాలు గిరిజన సంస్కృతి, సాంప్రదాయాల ప్రకారం జాతర నిర్వహించాలని అన్నారు.ఇంజనీరింగ్, పారిశుద్ధ్య సిబ్బంది సమర్ధ వంతంగా పనిచేయా లన్నారు. శాఖల వారు సెక్టార్లను అంతర్గతంగా విభ జించి, సిబ్బందికి షిఫ్టులవారీగా విధులు అప్పజెప్పాలన్నారు. ప్లాస్టిక్ నిషేధాన్ని ఖచ్చితంగా అమలుచేయాలని అన్నారు. జాతరలో పేపర్, క్లాత్, జూట్ సంచులను వాడాల న్నారు.మహా జాతర ప్లాస్టిక్ ఫ్రీ జాతరగా జరుపు కోవాలనే సందేశం ప్రతి ఒక్కరికీ తెలియాలి.గద్దెల వద్ద విధులు నిర్వర్తించే వారు సహనం కోల్పోకుండా భక్తులకు సేవాలందించా లన్నారు. జాతర నిర్వహణ ప్రతిసారి ఒక ఛాలెంజ్ గా తీసుకోవాలని,గతం కంటే మెరుగైన సేవలు అందించాలని, సెక్టార్ అధికారులది జాతర నిర్వహణలో కీలకమైన పాత్ర అని, నిరంతరం అప్రమత్తంగా ఉండాలని అన్నారు.అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రతి సెక్టార్ లో త్రాగునీరు, టాయిలెట్లు తదితర కనీస సౌకర్యాలు వుండేలా,సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అధికారులు,సిబ్బంది తమ తమ విధుల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు.అనంతరం అధికారులకు జాతర విధులకు సంబంధించి ప్రత్యేక గుర్తింపు కార్డ్స్ అందించడం జరిగింది.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) వేణు గోపాల్,ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ వెంకన్న,జిల్లా వైద్య అధికారి అల్లం అప్పయ్య,అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ వసంతరావు,ఇతర సెక్టోరల్ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్నికలు విధులు పకడ్బంధీగా నిర్వహించాలి : జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్



**మంచిర్యాల ప్రతినిధి, ఫిబ్రవరి 16, (జనంసాక్షి) :**
వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో విధులు కేటాయించబడిన అధికారులు, సిబ్బంది తమ విధులను పకడ్బంధీగా నిర్వహించా లని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సబావత్ మోతిలాల్తో కలిసి జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయ సిబ్బందితో ఎన్నికల విధుల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలలో విధులు కేటాయించబడిన అధికారులు, సిబ్బంది తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. గత శాసనసభ ఎన్నికలలో విధులు నిర్వహించిన అనుభవం దృష్ట్యా అధికారులు సమన్వయంతో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా విధులు నిర్వహించాలని, ఈ.వి.ఎం., పోస్టల్ బ్యాలెట్, వెబ్ కాస్టింగ్ ఇతర వివిధ విభాగాలలో అధికారులకు విధులు కేటాయించడం జరుగుతుందని, విధి నిర్వహణలో ఏమైనా సందేహాలుంటే ఉన్నతాధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని తెలిపారు. ఎన్నికల నియమ, నిబంధనలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఐ.టి. సంబంధిత అంశాలపై పూర్తి అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం, అలసత్వం వహిస్తే భారత ఎన్నికల సంఘం నిబంధనల మేరకు కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్‌ఎస్‌లో ఎన్డీఏ చేరడం అబద్దం

### రాజకీయం కోసం కెసిఆర్ దుష్ప్రచారం
### బిఆర్‌ఎస్ 8మంది ఎమ్మెల్యేలు మాతో టచ్‌లో ఉన్నారు
### బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 16 (జనంసాక్షి):**
8 మంది బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, 5మంది బీఆర్‌ఎస్ ఎంపీలు బీజేపీతో టచ్‌లో ఉన్నారని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ అన్నారు. బీఆర్‌ఎస్ ఎన్డీఏలో చేరుతోందని ఢిల్లీ నుంచి జరుగుతున్న ప్రచారాన్ని ఖండించారు. ఎట్టి పరిస్థితుల్లో బీఆర్‌ఎస్‌తో పొత్తు ఉండదని.. ఇదంతా కేసీఆర్ ఆడుతున్న నాటకమని ఆయన అన్నారు. సాక్షాత్తు ప్రధాని మోడీనే వారి అవినీతిపై మాట్లాడారని బండి సంజయ్ పేర్కొన్నారు. అధికారంలో ఉన్నప్పుడే కేసీఆర్‌ను ఎన్డీఏలో చేరుతామనీ అడిగితేనే చేర్చుకోలేదన్నారు. తెలంగాణలో మేము 17కి 17సీట్లు గెలుస్తామని.. దేశవ్యాప్తంగా 400 సీట్లు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ ఒక్కటి కూడా గెలిచే అవకాశం లేదన్నారు.
బీఆర్‌ఎస్‌కు ఎంపీ అభ్యర్థులు లేరని, ఉన్న వాళ్లు పక్క చూపులు చూస్తున్నారన్నారు. ఎంపీకి పోటీ చేయమని అభ్యర్థులను కేసీఆర్ బతిమలాడుతున్నారన్నారు. కేసీఆర్ అవినీతిని వ్యతిరేకించి ఎవరు హరీష్ రావుతో సహ బీజేపీలోకి వస్తామని అంటే ఆహ్వానిస్తామన్నారు. బీఆర్‌ఎస్ కాంగ్రెస్‌కు అవగాహన ఒప్పందం ఉందన్నారు. అందుకే బీఆర్‌ఎస్ ఇన్ని స్కాంలు బయటపడుతున్న చర్యలు కాంగ్రెస్ చర్యలు తీసుకోవట్లేదని మండిపడ్డారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడి ఉంటే కేటీఆర్, కేసీఆర్ ఇప్పటికే జైలులో ఉండేవాళ్లన్నారు. గ్రౌండ్ లెవెల్‌లో కాంగ్రెస్‌పై వ్యతిరేకత వచ్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసినందుకు ప్రజలు బాధపడుతున్నారన్నారు. కర్ణాటకలోనే కాదు.. తెలంగాణలో సైతం గ్యారంటీల పేరుతో మోసం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్‌కి ఎన్ని సీట్లు వస్తాయనేది ఆ పార్టీ నేతలే చెప్పాలన్నారు. కేఏ పాల్ కూడా 17సీట్లు గెలుస్తాం అనే ధీమాతో ఉన్నారన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో రాముడు మోడీ ఒక్కవైపు , రజాకార్లు, ఎంఐఎం, బీఆర్‌ఎస్ ఒక వైపు ఉన్నాయన్నారు. దేవుడిని రాముడిని నమ్మే వాళ్లు బీజేపీకి ఓటేస్తారన్నారు. బీఆర్‌ఎస్ అవినీతి అంతా కాగ్ రిపోర్ట్ ద్వారా బయట పడిందని బండి సంజయ్ చెప్పారు. కాళేశ్వరంపై సెంట్రల్ కమిటీ చాలా స్పష్టంగా నివేదిక ఇచ్చిందని తెలిపారు. కాళేశ్వరం పనికి రాదని చెప్పిందని అన్నారు. ప్రజా సమస్యలు ఏమీ లేనట్లు ఒక నది జలాల విషయం పట్టుకుని బీఆర్‌ఎస్, కాంగ్రెస్ విమర్శలు చేసుకుంటున్నాయని చెప్పారు. అయోధ్య రాముని ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాన్ని బహిష్కరించిన పార్టీని ప్రజలే బహిష్కరిస్తారన్నారు. ఏ ప్రభుత్వం అయిన ఐదు ఏళ్లు ఉండాలని కోరుకుంటామన్నారు. ఇచ్చిన వాగ్దానాలు పూర్తి చేయకుంటే ప్రజలే కాంగ్రెస్‌కి బుద్ధి చెప్తారని బండి సంజయ్ వెల్లడించారు. రేవంత్ రెడ్డి ఇంతకు ముందు కూడా బీజేపీ, బీఆర్‌ఎస్ ఒకటేనని ఆరోపించారు? అప్పుడు కూడా కాళేశ్వరంపై సీబీఐ విచారణ డిమాండ్ చేశారు? అప్పుడెందుకు సీబీఐ ఎంక్వైరీ అడిగారు ? ఇప్పుడెందుకు వెనక్కి తగ్గుతున్నారని ప్రశ్నించారు. తాము హైదరాబాద్ పార్లమెంట్ సీటుపై కూడా దృష్టి పెట్టామని తెలిపారు. కేసీఆర్ అవినీతిని వ్యతిరేకించి వస్తే హరీశ్ రావును బీజేపీలోకి తీసుకుంటామని చెప్పారు.

## తెలంగాణలో బిసి కులగణన

### అసెంబ్లీలో తీర్మానం ప్రవేశ పెట్టిన మంత్రి పొన్నం
### స్వాగతించిన విపక్షసభ్యుడు కడియం శ్రీహరి

**హైదరాబాద్, ఫిబ్రవరి 16 (జనంసాక్షి):**
తెలంగాణ అసెంబ్లీలో బీసీ కులగణన తీర్మానాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం ప్రవేశపెట్టారు. దీనిపై మాట్లాడిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం.. కుల గణన చేస్తున్నామని చెప్పారు. ప్రతి ఇంటిని, కులాన్ని సర్వే చేసి.. ప్రజల ఆర్థిక స్థితి గతులు తెలుసుకుంటామని అన్నారు. సర్వేలో అన్ని వివరాలు పొందు పరుస్తామని.. సర్వ రోగ నివారిణిలా సర్వే ఉంటుందని పేర్కొన్నారు. కాగా, కులగణనను తాము ఆహ్వానిస్తున్నట్లు బీఆర్‌ఎస్ నేత కడియం తెలిపారు. 'అసెంబ్లీలో బీసీ కులగణన తీర్మానం ప్రవేశపెట్టడం దేశ చరిత్రలోనే చారిత్రాత్మకం. దేశంలోని సంపద, రాజ్యాధికారం జనాభా దామాషా ప్రకారం దక్కాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. అందు కోసమే ఎన్నికల్లో హామీ ఇచ్చి అధికారంలోకి రాగానే కుల గణన చేస్తామని చెప్పాం. రాష్ట్రవ్యాప్తంగా కులగణనతో పాటు సోషల్, ఎకానమిక్, ఎడ్యుకేషన్, పొలిటికల్, ఎంఎ÷-లాయిమెంట్ అంశాలపై సర్వే చేస్తాం. రాష్ట్రంలో ఉన్న ప్రతి ఇంటిని, అన్ని కులాలు, ఆర్థిక స్థితిగతలపై సర్వే నిర్వహిస్తాం. ఈ సర్వే ద్వారా సంపదను అన్ని వర్గాలకు జనాభా దమాషా ప్రకారం ఎలా పంచాలన్న దానిపై ప్రణాళికలు తయారు చేస్తాం. సామాజిక ఆర్థిక రాజకీయ మార్పునకు పునాదిగా తెలంగాణ మారబోతుంది.' అని భట్టి తెలిపారు.అసెంబ్లీలో కులగణన తీర్మానాన్ని తాము స్వాగతిస్తున్నామని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. కానీ, ప్రభుత్వం ప్రవేశపెట్టిన తీర్మానంలో స్పష్టత లేదని.. దీనిపై క్లారిటీ ఇవ్వాలని అన్నారు. 'జనం, కులం అంటూ ద్వంద్వ వైఖరి కనిపిస్తోంది. జనగణన చేసే హక్కు రాష్ట్రాలకు లేదు. కులగణన మాత్రమే చేసే హక్కు ఉంటుంది. తీర్మానానికి చట్ట బద్ధత అయినా కల్పించాలి. లేదా న్యాయపరంగా అయినా ముందుకు వెళ్లాలి. ఎలాంటి చట్ట బద్ధత లేకుండా తీర్మానం పెడితే లాభం ఉండదు. కులగణన చేపట్టిన ఆయా రాష్ట్రాలు న్యాయపరంగా ఇబ్బందులు ఎదుర్కొన్నాయి.' అని పేర్కొన్నారు.

## ఏడోరోజు అసెంబ్లీ సమావేశాలు

### వాయిదా తీర్మానం తిరస్కరణ

**హైదరాబాద్, ఫిబ్రవరి 16 (జనంసాక్షి):**
తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ఏడవ రోజు ప్రారంభమయ్యాయి. సభ మొదలవగానే స్పీకర్ గడ్డం ప్రసాద్ జీరో అవర్‌ను మొదలుపెట్టారు. కాగా.. పదేళ్ల కేసీఆర్ పాలనలో జరిగిన అవినీతి, అక్రమాలపై అసెంబ్లీలో చర్చ జరపాలని, రాష్ట్ర ప్రభుత్వం సీబీఐ విచారణకు కేంద్రానికి లేఖ రాయాలని బీజేపీ వాయిదా తీర్మానం ఇచ్చింది. మరోవైపు ఈరోజు సభలో బీసీ కుల గణనపై ప్రభుత్వం తీర్మానం ప్రవేశ పెట్టింది. అలాగే అసెంబ్లీలో ఇరిగేషన్‌పై సర్కార్ శ్వేత పత్రం విడుదల చేయనుంది. ఈరోజు ఇరిగేషన్‌పై స్వల్ప కాలిక చర్చ జరుగనుంది. ఇరిగేషన్‌పై అధికార ప్రతిపక్షాల మధ్య వాడివేడిగా చర్చ జరిగే అవకాశం ఉంది. నిన్న సభలో కాగ్ రిపోర్టును ప్రభుత్వం ప్రవేశపెట్టగా.. కాగ్ రిపోర్టులో కూడా కాళేశ్వరంపై అనేక ఆరోపణలు గుప్పించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అనేక అవకతవకలు జరిగినట్లు కాగ్ ప్రస్తావించింది. ఈరోజు ఇరిగేషన్ చర్చలో కాగ్ రిపోర్ట్ ప్రధాన అస్త్రంగా మారనుంది. మేడిగడ్డ కుంగిన విధానంపై ప్రభుత్వం సభలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేయనుంది.



జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
17 ఫిబ్రవరి 2024

# వెయ్యేళ్ల చరిత్రకు సజీవ సాక్ష్యం మన "ఖమ్మం ఖిల్లా" !



## ఔరా! అనిపించేలా పది ద్వారాల పరిష్టమైన దుర్గం

**రాజులు పోయారు.. రాజ్యాలు పోయాయి.. కానీ మన గతమెంత ఘనమో కళ్లకు కడుతూ మన పూర్వ వైభవానికి అద్దం పడుతోంది. "ఖమ్మం ఖిల్లా" మన చరిత్రకు సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది ఈ ఖిల్లా. రాతితో నిర్మించిన బురుజులు.. ప్రాకారాలు అలనాటి రాజుల వైభవానికి ప్రతీకలు. కాకతీయుల కళా నైపుణ్యం ఈ కోటలో కొట్టొచ్చినట్లు కనిపిస్తూ ఉంటుంది. కాకతీయులే కాదు. రెడ్డి రాజులు, సాళువ వంశీ యులు, మహమనీ సుల్తాన్లు, అసఫ్ జాహీ వంశస్తులు దశల వారీగా ఏలిన ఖమ్మం ఖిల్లాకు వెయ్యేళ్ల చరిత్ర ఉంటుందంటే ఆశ్చర్యంగానే అనిపిస్తుంది. ఖమ్మం పేరెత్తగానే రాష్ట్ర వ్యాప్తంగా ఎవరికైనా గుర్తుకొచ్చే 'ఖిల్లా' కబుర్ల గురించి తెలుసుకోవాలని ఎవరికి మాత్రం ఉండదు. అయితే ఇదిగో ఈ ప్రత్యేక కథనం మీ కోసమే.**

**ఖమ్మంజిల్లా బ్యూరో / భవాని సింగ్ (జనంసాక్షి)**
రాచరిక వైభవానికి సాక్షాలుగా మన ఖిల్లాపై ఎన్నో ఆనవాళ్లు కనిపిస్తాయి. ఈ కోటపై కనిపించే శాసనాలు, రాతి కట్టడాలు, బురుజులు, ఫిరంగులతో పాటు అన్ని కాలాల్లోనూ పుష్కలంగా నీరుండే కోనేరు వంటివన్నీ వాటి సుదీర్ఘ చారిత్రిక రాచరిక వైభవానికి సజీవ సాక్ష్యాలే. ఇక ఖిల్లా నేపథ్యాన్ని విశ్లేషించుకుంటే. క్రీ. శ.950లో వెలుగుమాట్ల గ్రామానికి చెందిన లక్ష్మారెడ్డి, రంగారెడ్డి, వేమారెడ్డి అనే రైతులు తమ వ్యవసాయ భూములను సేద్యం చేసుకుంటున్నారు. ఈక్రమంలో అమితమైన నిధులు, నిక్షేపాలు పొలంలో లభించాయి. కాగా ఈ విషయం ఆనోటా ఈనోటా పడి కాకతీయ రాజు చెవిన పడింది. దీంతో ఆయన ఆదేశానుసారం వారి ఆధ్వర్యంలోనే ఖిల్లా నిర్మాణాన్ని చేపట్టారని చరిత్ర చెబుతోంది. మొదట ఖమ్మం ఖిల్లా మట్టి కోటగానే ఉండేదట. ఆ తర్వాత సుదీర్ఘ కాలంపాటు శ్రమించి పటుతరమైన నిర్మాణంతో గట్టి ఖిల్లాకు రూపమిచ్చారు. సుమారు క్రీ.శ 997లో గజపతులతో పాటు ఖమ్మం వచ్చిన కొండాపురానికి చెందిన అక్కిరెడ్డి, అస్కారెడ్డి అనే వ్యక్తులు కోట నిర్మాణాన్ని పట్టుదలతో కొనసాగించారు. క్రీ.శ. 1006లో ఈ నిర్మాణం పూర్తయింది. దీన్ని బట్టి ఇప్పుడు ఖిల్లా వయసు 1009 సంవత్సరాలుగా స్పష్టమవుతోంది. ఖమ్మం 300 ఏళ్లపాటు రెడ్డి వంశీయుల పాలనలో ఉంది. తర్వాత ఈ ప్రాంతాన్ని వెలమరాజులు చేజిక్కించుకున్నారు. అనంతరం నందవాణి, కాళ్లూరు, గుడ్లూరు వంశాల చేతుల్లోకి వెళ్లిపోయింది. 1531లో సుల్తాన్ కులీ కుత్బుల్ ముల్క్ అప్పటి ఖమ్మం పాలకుడైన సితాబ్ ఖాన్ (సీతాపతి రాజు)లను ఓడించి ఖమ్మం కోటను స్వాధీనపరుచుకున్నాడు. అప్పటి నుంచి ఈ దుర్గం కుతుబ్ షాహీల పాలనలోకి వెళ్లింది. 17వ శతాబ్దంలో తెలంగాణ ప్రాంతంతో పాటు ఇది ఆసఫ్ జాహీల ఆధీనంలోకి పోయింది. కాకతీయుల ఏలుబడిలో ఉన్న ప్రదేశం కావడంతో పాటు అప్పటికే శత్రు సైన్యాలు అనేక దఫాలుగా దాడులు చేయడంతో వాటిని ఎదుర్కొనేందుకు కాకతీయ రాజు తనకు దొరికిన నిధి, నిక్షేపాలతో ఈ ఖిల్లా నిర్మాణాన్ని మరింత కట్టుదిట్టం చేసేందుకు పూనుకున్నట్లు కథనం ఉంది. దీంతో పాటు వరంగల్ నుంచి రాజు ఆదేశాల మేరకు ఖమ్మం వచ్చి ఖిల్లా దుర్గాన్ని, దాని పక్కన చెరువును నిర్మించారని.. అందుకే లక్ష్మారెడ్డి పేరుతో "లకారం చెరువు" నిర్మితమైందని మరో కథనం. అలా ఖిల్లా నిర్మాణం పూర్తయిన తర్వాత రెడ్డి రాజులు, వెలమరాజులు ఈ కోటను మరింతగా మెరుగుపరిచారు.

**పది ద్వారాల దుర్గం...**
ఖిల్లా వైశాల్యం 4 చదరపు మైళ్లు. కోటను ఒక ఎత్తైన రాతి కొండపై నిర్మించారు. దీనికి మొత్తం 10 బురుజులు నిర్మించారు. శత్రుసైన్యం దాడులను తట్టుకునేలా ఒకదాని వెంట మరోటి అన్నట్లుగా రెండేసి చొప్పున గోడలను నిర్మించారు. పెద్ద పెద్ద రాళ్లను కోట నిర్మాణం కోసం ఉపయోగించారు. వాటిని నిలువుగా పేర్చి తాటికొయ్య ప్రమాణంలో నిర్మాణం చేపట్టారు. విచిత్రమేమిటంటే రాళ్లు ఒకదానికి ఒకటి అంటుకుని ఉండేందుకు ఎలాంటి సున్నము వాడకపోవడం. వాటి చుట్టూ లోతైన కందకాన్ని తీశారు. దీనికి ఉన్న ప్రహరీ గోడ ఎత్తు 40 నుంచి 80 అరుగులు. వెడల్పు 15 నుంచి 20 అడుగులు. కోట ప్రహరీ లోపలకు వెళ్లడానికి మొత్తం 10 ద్వారాలను ఏర్పాటు చేసినట్లు చరిత్రకారులు చెబుతున్నారు. పశ్చిమం వైపున దిగువ కోటకు ప్రధాన ద్వారంగా ఉంది. తూర్పు వైపు ద్వారాన్ని 'రాతి దర్వాజ' లేక 'పోత దర్వాజ' అని పిలుస్తారు. అయితే ఖిల్లాలోకి ప్రవేశించడానికి మాత్రం రెండు ముఖ ద్వారాలు ఉన్నాయి. లోపలి సింహద్వారం చతురస్రాకారంలో ఉండి 30 అడుగుల ఎత్తులో పెద్ద పెద్ద రాళ్లతో నిర్మితమై ఉంది. సింహ ద్వారం సమీపంలో ఆరు అడుగుల ఫిరంగి ఉంది. ఈ రాతికట్టడానికి ఫిరంగి గుండు తగిలినా చెక్కుచెదరనంత పటుత్వంగా ఉంటుంది. అలాగే కోట గోడలపై ఉన్న చిన్న చిన్న గోడలను జాఫర్ దౌలా (ధంసా) నిర్మించారు. ఈ నిర్మాణాన్ని ఇటుకలు, సున్నంతో చేపట్టారు.



**60 ఫిరంగులు మోహరించే వీలు..**
కోట చుట్టూ 60 ఫిరంగులను మోహరించే వీలుంది. కోట లోపల జాఫర్ దౌలా కాలంలోనే నిర్మితమైన ఒక పాత మసీదు, మహల్ ఉన్నాయి. విశాలమైన ఈ కోట లోపల 60 అడుగుల పొడవు, 20 అడుగుల వెడల్పు ఉన్న జాఫర్ బౌలి(బావి) ఉంది. కోటపై ముట్టడి జరిగినప్పుడు తప్పించుకునేందుకు ఒక రహస్య సొరంగం కూడా ఇక్కడ ఉన్నట్లు చారిత్రక ఆధారాలు ఉన్నాయి. వర్షపు నీటిని నిల్వ చేసేందుకు కాల్వలు కూడా కోటపై ఏర్పాటై ఉన్నాయి. ప్రతి బురుజు పైభాగంలో 45 అడుగుల వెడల్పుతో కిందికి దిగడానికి మెట్లు కనపడతాయి. అలాగే ప్రతి బురుజుపైనా రెండు ఫిరంగులు, ఒక నీటి కుంట ఏర్పాటయ్యాయి. ఖిల్లాలో ఒక పెద్ద దిగుడు బావి 80 అడుగుల వెడల్పుతో నిర్మితమై ఉంది. బావి లోపలికి దిగడానికి రాతిమెట్లు సైతం ఏర్పాటై ఉన్నాయి. కోట సింహ ద్వారం దాటి కొద్ది దూరం లోపలికి వెళితే అక్కడే అసలు దుర్గం కనిపిస్తుంది. దీన్ని ఎక్కడానికి వీలుగా చిన్న మెట్లు ఉన్నాయి. ఈ మార్గంలో చిన్న చిన్న రాతి గోడలతో ఒక ఆవరణ, దానికి పలు ద్వారాలు ఉన్నాయి. దీన్ని 'దాలోహిస్వారు' అని పిలుస్తారు. కాగా కాకతీయుల పట్టణం ఓరుగల్లు నుంచి ఖమ్మం ఖిల్లా కోటకు సొరంగ మార్గం ఉందని.. అప్పట్లో దాని గుండానే రహస్య రాకపోకలు సాగేవని పెద్దలు చెబుతుంటారు.

**కాకతీయులకు రెండో రాజధాని..**
మొదట కాకతీయుల సామ్రాజ్యంలో అంతర్భాగంగా ఉన్న ఖమ్మం ఖిల్లా అనంతరం స్వాతంత్ర్య మండలి రాజ్యాంగంగా రూపొందింది. కాకతీయుల సామ్రాజ్యం నశించిన తర్వాత తెలుగు నేలను ఏకం చేయాలనే లక్ష్యంతో 74 మంది సామంత రాజులు ఏకమయ్యారు. ఖమ్మం సమీపంలో ఉన్న మూసురూలి నాయకత్వంలో పదేళ్లపాటు వీరోచితంగా పోరాటం జరిపారు. ఆ తర్వాత సీతాపతి కాలంలో ఖమ్మం ఖిల్లాయే తెలంగాణకు ముఖ్య కేంద్రంగా ఉండేది. సీతాపతి.. బహ్మనీ సుల్తాన్ల సహాయంతో వరంగల్ కు రాజప్రతినిధిగా ఎన్నికయ్యారు. పెద్దయ్యామాత్యుని సహాయంతో తెలంగాణలో తిరిగి తెలుగు సామ్రాజ్యాన్ని విస్తరింపజేశారు. పరిపాలనా సౌలభ్యం కోసం ఖమ్మాన్ని తన సామ్రాజ్యానికి రెండో రాజధానిగా ఆయన ప్రకటించారు. ఈ సమయంలో కులీకుతుబ్ షా.. సీతాపతిని ఓడించి ఖమ్మాన్ని కేంద్రంగా చేసుకుని ఈ ప్రాంతానికి రాజుగా ప్రకటించుకున్నాడు. అతని అధీనంలో ఉన్న ధనరాసులను గోల్కొండకు తరలించారు. క్రీ.శ.1615లో శ్రీకృష్ణదేవరాయలు.. కులీకుతుబ్ షాను ఓడించి ఖమ్మం దుర్గాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చరిత్ర చెబుతోంది. ఆంధ్రభోజుడైన ఆయన తన దిగ్విజయ యాత్రలో భాగంగానే దీన్ని జయించినట్లు చరిత్రకారులు చెబుతున్నారు. "గంభము మెట్టు గ్రక్కున గదల్చి.. రాజపుత్రుడే శ్రీకృష్ణదేవరాయ విభుడు" అంటూ ముక్కు తిమ్మన తన 'పారిజాతాపహరణం' ప్రబంధంలో వర్ణించడం గమనార్హం. ఆ తర్వాత గోల్కొండ నవాబు ఇబ్రహీం కుతుబ్ ముల్కీ ఈ రాజ్యాన్ని ఆక్రమించారు. 1687 వరకు ఐదుగురు నవాబులు ఖమ్మం గిరిని పాలించినట్లు చారిత్రక ఆధారాలున్నాయి. వారిలో ఆఖరివాడు అబ్దుల్ హసన్ కుతుబ్ షా. 1658%--%1687 వరకు పాలించాడు. ఈయనను తానీషా అని పిలుస్తారు. 1687 ప్రాంతంలో గోల్కొండపై దండెత్తిన ఔరంగజేబు ఈ దుర్గాన్ని వశపరుచుకున్నాడు. 1761 నుంచి 1803 వరకు జాఫర్ దౌల్ అనే తహశీల్దారు పర్యవేక్షణలో ఖమ్మం ఖిల్లా కొనసాగింది. ఇతని కాలంలో ఈ కోట మరింతగా మెరుగులు దిద్దుకుంది. 1768లో రెండో జాఫరుద్దౌల తహశీల్దారుగా నియమితులయ్యారు. ఈయన అన్న పేరుతోనే ధంసలాపురం గ్రామం స్థాపితమైంది. ఎట్టకేలకు 1937లో నిజాం ప్రభుత్వం ఈ బిల్లును స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. మొత్తంమీద శతాబ్దాల సుదీర్ఘ చరిత్ర కలిగిన ఖమ్మం ఖిల్లాపై పురావస్తు శాఖ దృష్టి నిలిపి ఇంకా ఆధునీకీకరించి ప్రాచుర్యం కల్పించాల్సిన అవసరం ఉంది.

# గ్రామాలభివృద్ధే నా లక్ష్యం

**● సీసీ రోడ్లకు నిధులు మంజూరు ● ఎంపి నామ నాగేశ్వరరావు వెల్లడి**



**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 16 (జనంసాక్షి):**
ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని మారుమూల గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా తన ఎంపీ నిధులను పెద్ద ఎత్తున ఖర్చు చేసినట్లు బీఆర్ఎస్ లోక్‌సభా పక్ష నేత,ఖమ్మం పార్లమెంట్ సభ్యులు నామ నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తాజాగా భద్రాద్రి జిల్లా అభివృద్ధికి తన ఎంపీ నిధుల నుంచి రూ. 1,17,50,500 లను మంజూరు చేసినట్లు నామ వెల్లడించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని మారుమూల గ్రామాల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని,స్థానిక ప్రజా ప్రతినిధులు, బడుగు,బలహీన వర్గాలు, పేద ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిగణలోకి తీసుకుని, ఈ నిధులను కేటాయించినట్లు చెప్పారు. జిల్లాలోని అశ్వారావుపేట, చంద్రుగొండ, దమ్మపేట, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, పాల్వంచ మండలాలకు చెందిన గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, కల్వర్టులు, అంగన్‌వాడీ కేంద్రాలు, స్కూళ్ల ప్రహరీగోడల నిర్మాణాలకు గాను ఈ నిధులు మంజూరు చేశామని తెలిపారు. అశ్వారావుపేట మండలం వినాయ కపురం, దురదపాడు, గుమ్మడివల్లి, మల్లాయి గూడెం, చంద్రుగొండ మండలం మద్దుకూరు, పోకలగూడెం, తిప్పనపల్లి , రావికంపాడు, దమ్మపేట మండలం ఆర్లపెంట, పట్వారిగూడెం, అంకంపాలెం, చుంచుపల్లి మండలం విద్యానగర్, త్రీ ఇంక్లయిన్, పెనగడప, లక్ష్మీదేవిపల్లి మండలం సంజయ్ నగర్, శ్రీనగర్‌కాలనీ తదితర గ్రామాల్లో తన ఎంపీ నిధులతో పనులు చేపట్టనున్నట్లు నామ చెప్పారు. అతి త్వరలోనే ఈ పనులన్నింటికి శంకుస్థాపనలు చేసి, పనులు ప్రారంభించడం జరుగుతుందని చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు భద్రాద్రి జిల్లాలోని గ్రామాలభివృద్ధికి తన ఎంపీ నిధులను పెద్ద ఎత్తున కేటాయించి, ఖర్చు చేయడం జరుగుతుందని నామ నాగేశ్వరరావు చెప్పారు.

# 28 నుంచి ఇంటర్ పబ్లిక్ పరీక్షలు

- ఒక నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదు
- టేకులపల్లి పరీక్షా కేంద్రంలో పరీక్ష రాయనున్న 278 మంగి విద్యార్థులు...
- పరీక్ష రాయనున్న టేకులపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు 214
- ప్రశాంతంగా ముగిసిన ప్రాక్టికల్ పరీక్షలు..
- ఈనెల 19న మొదటి సంవత్సరం విద్యార్థులకు పర్యావరణ పరీక్ష...
- వివరాలు వెల్లడించిన టేకులపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ కల్పన



**టేకులపల్లి,ఫిబ్రవరి16( జనంసాక్షి):**
ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ఫిబ్రవరి 28 నుంచి మార్చి 14 వరకు జరుగుతాయని టేకులపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. కల్పన తెలిపారు. ఈ మేరకు శుక్రవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. టేకులపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన పరీక్షా కేంద్రంలో మొదటి సంవత్సరం విద్యార్థులు157 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు121 మంది, మొత్తం 278 మంది విద్యార్థిని,విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరుగుతుందని, అర్థగంట ముందే విద్యార్థిని, విద్యార్థులు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని,ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి అనుమతి ఉండదని పేర్కొన్నారు. టేకులపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న ప్రథమ 122, ద్వితీయ 92 మొత్తం 214 మంది విద్యార్థిని, విద్యార్థులు పబ్లిక్ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నారని తెలిపారు. ఇప్పటికే ఈనెల 9 నుండి 12వ తేదీ వరకు ప్రాక్టికల్ పరీక్షలు పూర్తయ్యాయని, శుక్రవారం ఇంగ్లీష్ ప్రాక్టికల్ ప్రశాంతంగా నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు. ఈనెల 19న ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థినీ,విద్యార్థులకు పర్యావరణ సబ్జెక్టుపై పరీక్ష ఉంటుందని విద్యార్థినీ, విద్యార్థులు తప్పకుండా హాజరుకావాలని స్పష్టం చేశారు. విద్యార్థిని, విద్యార్థులు ఎలాంటి భయాందోళనలకు, ప్రలోభాలకు లోను కాకుండా కష్టపడి ఇష్టంగా చదువుకుని అన్ని పరీక్షలు నిర్భయంగా రాయాలని, పరీక్ష కేంద్రానికి వచ్చేటప్పుడు ప్యాడ్, పెన్నులు, స్కేలు, హాల్ టికెట్ తప్పనిసరిగా తీసుకుని రావాలని, మొబైల్ ఫోన్, ఇతర ఎలక్ట్రానిక్, బోడు డిజిటల్ వస్తువులు పరీక్షా కేంద్రానికి తీసుకురావద్దని సూచించారు.

## "ఎన్నికల బాండ్లు" రాజ్యాంగ విరుద్ధం
# సుప్రీం సంచలన తీర్పు

**హర్షం వ్యక్తం చేసిన సిపిఐ (ఎం) ఖమ్మం జిల్లా కమిటి**

**ఖమ్మంటౌన్, ఫిబ్రవరి 16 (జనంసాక్షి):**
రాజకీయ పార్టీలకు నిధులు సమకూర్చేందుకు తీసుకొచ్చిన ఎన్నికల బాండ్లు చెల్లుబాటుపైన గురువారం సుప్రీం కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఈ తీర్పును సిపిఎం రాష్ట్ర కమిటి సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, యర్రా శ్రీకాంత్‌లు హర్షం వ్యక్తం చేసి స్వాగతించారు. ఈ ఎన్నికల బాండ్లు రాజ్యాంగ విరుద్ధమని స్పష్టం చేసిన నేపథ్యంలో ఎన్నికల బాండ్ల జారీని బ్యాంకులు తక్షణమే నిలుపు చేయాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. ఎన్నికల బాండ్లను వ్యతిరేకిస్తూ సిపిఎం ఆలిండియా కార్యదర్శి సీతారాం ఏచూరితో పాటు యితర ప్రముఖులు సుప్రీం కోర్టులో పిటిషన్ వేశారు. ఈ తీర్పును సిపిఎం పార్టీ స్వాగతిస్తున్నది. కేంద్రంలోని బిజెపి మోడీ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు విదేశాలలో వున్న నల్ల ధనాన్ని తీసుకొచ్చి దేశంలో వున్న ప్రజల జన్‌ధన్ ఖాతాలలో 15 లక్షలు వేస్తానని వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చి వెయ్యకపోగా, ఎన్నికల్లో డబ్బులు ఖర్చు పెట్టటానికి ఎన్నికల బాండ్లను తీసుకొచ్చారని విమర్శించారు. ఈ పథకం రాజ్యాంగ విరుద్ధమని సర్వోన్నత న్యాయస్థానం తీర్పు యివ్వటం బిజెపి ప్రభుత్వానికి, మోడీకి చెంప పెట్టు లాంటిదని అన్నారు. బాండ్లు తీసుకురావడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు.

## తెలంగాణ ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్‌గా సిరిసిల్ల రాజయ్య



**హైదరాబాద్, ఫిబ్రవరి 16 (జనంసాక్షి):**
తెలంగాణ ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్‌గా మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్యను సర్కారు నియమించింది. రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యులుగా ఎం.రమేశ్, సంకేపల్లి సుధీర్‌రెడ్డి, నెహ్రూ నాయక్ మాలోత్‌ను నియమిస్తూ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ శుక్రవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. వీరంతా రెండేళ్లపాటు పదవిలో కొనసాగనున్నారు. సిరిసిల్ల రాజయ్య వరంగల్ (ఎస్సీ) పార్లమెంట్ స్థానం నుంచి 15వ లోక్‌సభకు కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసి గెలుపొందారు.

# కల్లూరు పోలీస్ స్టేషన్ను సందర్శించి, తనిఖీ చేసిన
## పోలీస్ కమిషనర్ సునీల్ దత్

**కల్లూరు ఫిబ్రవరి 16 (జనంసాక్షి):**
ప్రజలకు అందుబాటులో ఉంటూ ఫిర్యాదులపై తక్షణమే స్పందించి న్యాయం జరిగేలా కృషి చేయాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ స్పష్టం చేశారు. శుక్రవారం కల్లూరు పోలీస్ స్టేషన్ ను సందర్శించిన పోలీస్ కమిషనర్ రికార్డులు తనిఖీ చేశారు. స్టేషన్ నిర్వహణ, పోలీసుల పనితీరు, పరిసరాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో శాంతి భద్రతలు చాలా ముఖ్యమని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదన్నారు. చట్ట వ్యతిరేక కార్యక లాపాలపై నిఘా పెట్టాలని సూచించారు.సామజిక మాధ్యమాలలో వచ్చే వదంతులు, అసత్య ప్రచారాలపై గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సైబర్ నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. అలాగే డ్రగ్స్ నియంత్రించేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని చెప్పారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఏ తరహా నేరాలు ఎక్కువ నమోద వుతున్నాయో వాటి నియంత్రణకై దృష్టి పెట్టాలన్నారు. రాత్రి పెట్రోలింగ్ అధికారులు ముమ్మరం చేయాలని, పాత నేరస్తులను తనిఖీ చేయాలని తెలిపారు. కేసుల నమోదు విషయంలో తత్సారం చేయవద్దన్నారు. అదేవిధంగా విధి నిర్వహణలో రోల్ క్లారిటీ వుండాలని, అప్పగించిన భాధ్యతలు సక్రమంగా నిర్వహిస్తూ పోలీసు వ్యవస్థపై మరింత నమ్మకాన్ని పెంచాలన్నారు. ఈకార్యక్రమంలో కల్లూరు ఏసీపీ అని శెట్టి రఘు, రూరల్ సీఐ వెంకటేష్ స్థానిక ఎస్సై ఎస్.కె షాకీర్ పాల్గొన్నారు.




# ఎన్నికల ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలి

## జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వి.పి.గౌతమ్

**ఖమ్మంజిల్లా బ్యూరో, ఫిబ్రవరి 16 (జనంసాక్షి) :**
ఎన్నికల ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వి.పి. గౌతమ్ తెలిపారు. శుక్రవారం కలెక్టర్ ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్ లోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలను పోలీస్ కమీషనర్ సునీల్ దత్ తో కలిసి సందర్శించి, రాబోయే పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్, స్ట్రాంగ్ రూంలు, రిషిప్షన్ కేంద్ర ఏర్పాట్లపై క్షేత్ర పరిశీలనలు చేశారు. భద్రతా, పార్కింగ్ ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు. అనంతరం అధికారులతో కళాశాల ప్రిన్సిపాల్ ఛాంబర్ లో సమావేశం ఏర్పాటు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ, ఎన్నికల నిర్వహణ సజావుగా జరిగేలా అన్ని చర్యలు చేపట్టాలన్నారు. ఎండాకాలం దృష్ట్యా విద్యుత్ ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో వాడిన ఫెన్సింగ్ ను తిరిగి ఉపయోగించాలన్నారు. 7 అసెంబ్లీ సెగ్మెంట్లు, పోస్టల్ బ్యాలెట్ లకు గదులు సిద్ధం చేయాలన్నారు. 25 అగ్నిమాపక పరికరాలు ఇప్పటికి ఇక్కడే ఉన్నట్లు, అదనంగా కావాల్సిన వాటిఏర్పాటు, స్ట్రాంగ్ రూమ్ లకు అలారం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. రిషిప్షన్ కేంద్రాల బాధ్యుల ఉత్తర్వులు సిద్ధం చేయాలన్నారు. పోలింగ్, రిషిప్షన్ కి వేరు వేరు సిబ్బందిని నియమించాలన్నారు. డిస్ట్రిబ్యూషన్, రిషిప్షన్ కేంద్రాల సిబ్బందికి తగు శిక్షణా ఏర్పాటు చేయాలన్నారు. ఎంపిడివో లను తమ తమ మండల పరిధిలో ఎన్నికల సంబంధ అన్ని ఏర్పాట్లపై బాధ్యత పెట్టాలన్నారు. ఈసారి కేంద్రీకృత రిషిప్షన్ కేంద్రం వుండనునట్లు ఆయన తెలిపారు. ఎన్నికల సంబంధ భత్యం ముందుగానే అందజేయాలన్నారు. పెద్ద సమూహాన్ని హ్యాండిల్ చేసే టాస్క్ జాగ్రత్తగా చేపట్టాలన్నారు. ఇవిఎం ల రవాణా పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కమీషనిం గ్ సందర్భంగా, స్ట్రాంగ్ రూంకి తరలింపు సందర్భంగా కారిడార్ రూఫ్ వుండేలా చూడాలని, రిషిప్షన్ కేంద్రం లో రెయిన్ ప్రూఫ్ టెంట్ ఏర్పాటు చేయాలని అన్నారు. ఒకే భవనంలో 7 సెగ్మెంట్లకు సంబంధించి కౌంటింగ్ జరగనున్నం దున, ఏ సెగ్మెంట్ కు సంబంధించిన ఇవిఎం లు ఆ సెగ్మెంట్ కు వెళ్లేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇవిఎం తరలింపు సిబ్బందికి సెగ్మెంట్ ల వారిగా కలర్ కోడ్ తో టీ షర్టులు ఇవ్వాలని, సెగ్మెంట్ల పేరు వాటిపై ప్రింట్ చేయించాలని అన్నారు. సెగ్మెంట్లకు సంబంధించి, నామ సూచికలు, బ్యానర్లు, స్టిక్కర్లు, రూట్ మ్యాప్ లు తదితర అన్నిటిపై ఆయా సెగ్మెంట్ కి కేటాయించిన రంగునే వాడేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఏ సెగ్మెంట్ కి వెళ్లే వారిని ఆ సెగ్మెంట్ కి వెళ్లేలా ప్రవేశం దగ్గర బాధ్యత గల అధికారిని ఉంచి, మార్గదర్శనం చేసేలా చూడాలన్నారు. పోలైన ఇవిఎం, బ్యాలెట్ లు సీఆర్పీఎఫ్ రక్షణతోనే తరలించాలన్నారు. సెక్టార్ అధికారులకు అవగాహన కల్పించాలన్నారు. శిక్షణా కార్యక్రమాలు పకడ్బందీగా చేపట్టాలన్నారు. శిక్షణ కు సంబంధించి పిపిటి ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ప్రతి పోలింగ్ కేంద్రంలో సీసీటీవీ కెమెరా ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా, సెగ్మెంట్ కేంద్రాల్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేసి, ఎన్నికల సరళిని నిరంతరం పరిశీలిస్తూ, సమస్యలు వెంటనే పరిష్కరించాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్, ఎస్ఎస్ టి, సెక్టార్ అధికారుల నియామకం చేయాలన్నారు. పోలింగ్ సిబ్బంది డాటా నమోదు చేయాలన్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమీషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ, పార్కింగ్ ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేయాలని, ప్రవేశం, నిష్క్రమణ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇవిఎం ల రవాణా సందర్భంలో భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. రిషిప్షన్, కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు చర్యలు చేయాలని పోలీస్ కమీషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం నగరపాలక సంస్థ కమీషనర్ ఆదర్శ్ సురభి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. సత్యప్రసాద్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం అదనపు కలెక్టర్లు డి. మధుసూదన్ నాయక్, రాంబాబు, ఖమ్మం, కల్లూరు, కొత్తగూడెం ఆర్డీవోలు జి. గణేష్, అశోక్ చక్రవర్తి, మధు, ఎస్డీసి ఎం. రాజేశ్వరి, ఆర్ అండ్ బి ఎస్ఇ శ్యామ్ ప్రసాద్, జిల్లా సంక్షేమ అధికారి రాంగోపాల్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి హరికిషన్, ఎడి సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాసులు, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ శ్రీలత, జిల్లా అగ్నిమాపక అధికారి జయ ప్రకాష్, రూరల్ ఏసీపీ బస్వారెడ్డి, మిషన్ భగీరథ ఇఇ లు పుష్పలత, వాణిశ్రీ, ఖమ్మం రూరల్ తహసీల్దార్ రామకృష్ణ, ఎన్నికల సూపరింటెండెంట్ రాంబాబు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# జనరిక్ ఔషధ పరిశ్రమలకు భరోసా

## ఐరోపా ఎఫ్‌టీఏలో 'డేటా ఎక్స్‌క్లూజివిటీ' నిబంధనను తిరస్కరించిన భారత్



స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల్లో (ఎఫ్‌టీఏ) 'డేటా ఎక్స్‌క్లూజివిటీ' నిబంధన పొందుపరచాలని 4 ఐరోపా దేశాలతో కూడిన ఐరోపా ఎఫ్‌టీఏ (యూరోపియన్ ఫ్రీ ట్రేడ్ అసోసియేషన్) బ్లాక్ చేసిన డిమాండ్‌ను భారత ప్రభుత్వం తిరస్కరించింది. తద్వారా దేశీయ జనరిక్ ఔషధ పరిశ్రమకు మేలు చేసినట్లు అవుతోంది. ఈ నిబంధనను ఆమోదిస్తే మనదేశానికి చెందిన ఫార్మా కంపెనీలకు, తద్వారా ఔషధ రంగానికి నష్టం వాటిల్లుతుందని ప్రభుత్వం అభిప్రాయపడింది. దేశీయ జనరిక్ ఔషధ పరిశ్రమకు నష్టం చేసే ప్రతిపాదనలను ప్రభుత్వం వ్యతిరేకిస్తుందని వాణిజ్య శాఖ కార్యదర్శి సునీల్ బరత్వాల్ స్పష్టం చేశారు. ఐరోపా ఎఫ్‌టీఏ బ్లాక్‌లో ఐస్‌ల్యాండ్, లీఛెన్‌స్టీన్, నార్వే, స్విట్జర్లాండ్ దేశాలున్నాయి. ఈ బృందం మనదేశంతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకోవడానికి సంప్రదింపులు సాగిస్తోంది. 'డేటా ఎక్స్‌క్లూజివిటీ నిబంధన చేర్చాలని ఈ దేశాలు కోరగా, మేం తిరస్కరించామ'ని సునీల్ పేర్కొన్నారు. మనదేశం నుంచి పెద్దఎత్తున ఎగుమతులు నమోదు చేస్తున్న ఔషధ పరిశ్రమలను కాపాడాల్సిన అవసరం ఉందని వివరించారు.

### అంగీకరిస్తే ఏమవుతుందంటే..

'డేటా ఎక్స్‌క్లూజివిటీ' నిబంధన అమల్లో ఉంటే.. కొత్త ఔషధాలకు సంబంధించిన క్లినికల్ పరీక్షల సమాచారంపై, ఆ మందులను ఆవిష్కరించిన కంపెనీలకు పూర్తిస్థాయి హక్కులు లభిస్తాయి. దానివల్ల ఇతర ఫార్మా కంపెనీలకు ఆ మందులపై మార్కెటింగ్ లైసెన్స్‌లు లభించవు. జనరిక్ ఔషధాలను సైతం ఆవిష్కరించలేవు. అప్పుడు మనదేశ ఫార్మా కంపెనీలు, ఇతర దేశాలకు జనరిక్ ఔషధాలను ఎగుమతి చేయలేవు. ఐరోపా ఎఫ్‌టీఏ బ్లాక్‌లోని స్విట్జర్లాండ్‌లో నొవార్టిస్, రోష్.. వంటి అతిపెద్ద ఫార్మా కంపెనీలు న్నాయి. ఇవి మనదేశంలోనూ కార్యకలాపాలు సాగిస్తున్నాయి.

### రూ.2 లక్షల కోట్లకు పైగా టర్నోవర్

మనదేశం జనరిక్ ఔషధాల తయారీలో అగ్రగామిగా ఉంది. దాదాపు 25 బిలియన్ డాలర్ల (సుమారు రూ.2.08 లక్షల కోట్ల) విలువైన జనరిక్ ఔషధాలను మనదేశం ఏటా ఉత్పత్తి చేస్తుండగా, ఇందులో సగం మేర ఎగుమతి చేస్తోంది. 'డేటా ఎక్స్‌క్లూజివిటీ' నిబంధన ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ) ఒప్పందంలోని ట్రిప్స్ (ట్రేడ్ రిలేటెడ్ యాస్పెక్ట్స్ ఆఫ్ ఇంటలెక్చువల్ ప్రోపర్టీ రైట్స్) నిబంధనకు వ్యతిరేకం కూడా కావటం గమనార్హం.

### 2008 నుంచి యత్నాలు

ట్రేడ్ అండ్ ఎకనామిక్ పార్టనర్‌షిప్ అగ్రిమెంట్ (టీఈపీఏ) అనే పేరు మీద మనదేశంతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకోవడానికి ఐరోపా ఎఫ్‌టీఏ, 2008 నుంచి సంప్రదింపులు సాగిస్తోంది. టీఈపీఏ 21వ సమావేశం గత నెలలో జరిగింది. ఐపీఆర్ (ఇంటలెక్చువల్ ప్రోపర్టీ రైట్స్) సహా వివిధ వర్తక సంబంధ అంశాలను ఈ సమావేశంలో చర్చించారు. ఈ సంప్రదింపులు దాదాపుగా తుది దశకు చేరుకున్నట్లు సమాచారం. ఐరోపా ఎఫ్‌టీఏ ఇప్పటికే 40 దేశాలతో 29 స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకుంది. ఈ దేశాల్లో కెనడా, చిలీ, చైనా, మెక్సికో, కొరియా.. తదితర దేశాలున్నాయి. ఐరోపా ఎఫ్‌టీఏ, ఐరోపా సమాఖ్యలో భాగంగా లేదు. ఇదొక స్వతంత్ర వాణిజ్య బృందంగా వ్యవహరిస్తోంది. ఐరోపా సమాఖ్యలో చేరడానికి ఇష్టం లేని దేశాలే ఐరోపా ఎఫ్‌టీఏలో సభ్యులుగా ఉన్నాయి. ఐరోపా ఎఫ్‌టీఏ సభ్య దేశాలకు 2022-23లో మనదేశం 1.92 బిలియన్ డాలర్ల (సుమారు రూ.16,000 కోట్ల) విలువైన ఎగుమతులు నమోదు చేసింది. అదే సమయంలో ఆ దేశాల నుంచి దిగుమతులు 16 బిలియన్ డాలర్లకు పైగా ఉండటం గమనార్హం.

# ద్రవ్యోల్బణానికి సవాళ్లున్నాయ్

## భౌగోళిక రాజకీయ అనిశ్చితులే కారణంఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్

**ముంబయి జనం సాక్షి:**



ద్రవ్యోల్బణాన్ని అదుపులో పెట్టడానికి అంతర్జాతీయ భౌగోళిక, రాజకీయ అనిశ్చితుల రూపంలో సవాళ్లు ఎదురవుతున్నాయని ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ పేర్కొన్నారు. ఇదే సమయంలో అవకాశాలూ ఉన్నాయని గురువారమిక్కడ జరిగిన ఒక సదస్సులో పేర్కొన్నారు. 'లక్ష్యాన్ని చేరేంత వరకు మేం అప్రమత్తంగా ఉండదలచాం. స్థిర, పరిమిత ద్రవ్యోల్బణమే దీర్ఘకాల ఆర్థిక వృద్ధికి పునాది అని నమ్ముతున్నామ'ని దాస్ అన్నారు. భారత్ ఇప్పటిదాకా పలు సవాళ్లను విజయవంతంగా అధిగమించి వేగవంత ఆర్థిక వ్యవస్థగా నిలిచిందని గుర్తు చేశారు. బలమైన పరపతి, ద్రవ్య విధానాల వల్ల అది సాధ్యమైందని అన్నారు. 2024-25లో భారత ఆర్థిక వృద్ధి 7 శాతంగా నమోదు కాగలదని ఆర్‌బీఐ అంచనా వేసింది. అంటే వరుసగా నాలుగో ఏడాదీ 7 శాతం ఎగువన వృద్ధి నమోదు అవుతోందని ఆయన గుర్తు చేశారు. 2022 వేసవిలోని అధిక స్థాయిల నుంచి ద్రవ్యోల్బణం కిందకు దిగివచ్చిందని అన్నారు. జనవరిలో రిటైల్ ద్రవ్యోల్బణం 5.1 శాతంగా నమోదై.. ద్రవ్యోల్బణ లక్ష్యమైన 4 శాతానికి చేరువగా వచ్చింది. మరో వైపు, భారతీయ యూపీఐ, వేగవంతమైన చెల్లింపుల వ్యవస్థలు ఒక అంతర్జాతీయ మోడల్‌గా నిలిచాయని ఆయన అన్నారు.



## నైకీలో 2 శాతం ఉద్యోగుల తొలగింపు

**వాషింగ్టన్ జనం సాక్షి:**

ప్రముఖ స్పోర్ట్స్‌వేర్ తయారీ సంస్థ నైకీ ఉద్యోగుల తొలగింపునకు సిద్ధమైంది. ప్రపంచవ్యాప్తంగా తమ కంపెనీలో పనిచేస్తున్న వారిలో రెండు శాతం సిబ్బందిని తీసివేయనున్నట్లు ప్రకటించింది. సంస్థలో 83,700 మంది పనిచేస్తున్నట్లు సమాచారం. వ్యయ నియంత్రణలో భాగంగా ఉద్యోగుల తొలగింపు తప్పట్లేదని నైకీ తెలిపింది. భవిష్యత్ విక్రయాల అంచనాలు నిరాశాజనకంగా ఉన్న నేపథ్యంలో కార్యకలాపాలను క్రమబద్ధీకరించాల్సిన ఆవశ్యకత ఏర్పడిందని పేర్కొంది. వృద్ధి అవకాశాలను మెరుగుపర్చడానికి కఠిన నిర్ణయాలు తప్పడం లేదని చెప్పింది. దాదాపు రెండు బిలియన్ డాలర్ల ఖర్చులను ఆదా చేయాలనుకుంటున్నట్లు కంపెనీ డిసెంబర్‌లోనే ప్రకటించడం గమనార్హం. అప్పటి నుంచి దాని షేర్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు రెండు శాతం నష్టపోయాయి. ఉద్యోగుల తొలగింపులను రెండు దశల్లో చేపట్టనున్నట్లు ఆ సంస్థ తెలిపింది. తొలి దశ శుక్రవారం నుంచి ప్రారంభమవుతుందని వెల్లడించింది. రెండో విడత తొలగింపులు నాలుగో త్రైమాసికం చివరి నుంచి ఉంటాయని పేర్కొంది.

## ఇస్రో 'యువ విజ్ఞాని'కి దరఖాస్తుల ఆహ్వానం

**బెంగళూరు జనం సాక్షి:**

భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో).. పాఠశాల విద్యార్థుల కోసం నిర్వహించే 'యువ విజ్ఞాని' (యువిక) కార్యక్రమానికి దరఖాస్తులు ఆహ్వానించింది. ఈ నెల 20 నుంచి దరఖాస్తు చేసుకోవచ్చని 'ఎక్స్'లో తెలిపింది. 'క్యాచ్ దెమ్ యంగ్' పేరిట రెండు వారాల పాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో అంతరిక్ష సాంకేతికత, విజ్ఞానం, అప్లికేషన్లపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తారు. 2024 జనవరి 1 నాటికి 9వ తరగతి చదువుతున్న వారు అర్హులు. విద్యార్థి దశలోనే విజ్ఞానం, సాంకేతికత, ఇంజినీరింగ్, మ్యాథమేటిక్స్ (స్టెమ్) అంశాలపై అవగాహన కల్పించి, తద్వారా వారిని పరిశోధనల వైపు దృష్టి మళ్లించటమే లక్ష్యమని ఇస్రో వెల్లడించింది.

## బైక్ ట్యాక్సీలు చెల్లుబాటవుతాయి

**దిల్లీ జనం సాక్షి:**

నగర జీవనంలో బైక్ ట్యాక్సీలూ భాగమైపోయాయి. అటు ప్రయాణికులకే కాదు.. వీటివల్ల కొందరికి ఉపాధి అవకాశాలూ లభిస్తున్నాయి. అయితే కొన్ని రాష్ట్రాల్లో బైక్ ట్యాక్సీలపై ఆంక్షలు అమలవుతున్నాయి. ఈనేపథ్యంలో వీటి చెల్లుబాటుపై కేంద్ర రవాణా మంత్రిత్వశాఖ స్పష్టతనిచ్చింది. మోటారు వాహనాల చట్టం-1988 ప్రకారం.. మోటారు సైకిళ్లు కాంట్రాక్టు క్యారేజీ పర్మిట్ కలిగి ఉంటాయని పేర్కొంది. ఈ ఒప్పందం అద్దె ప్రాతిపదికన ప్రయాణికులను ఎక్కించుకునే వెసులుబాటును కల్పిస్తోందని తెలిపింది. ఈ మేరకు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు అడ్వైజరీని జారీ చేసింది.

# లాభాల్లో మార్కెట్ సూచీలు

## 22,000 చేరువకు నిఫ్టీ

**ముంబయి జనం సాక్షి:**




దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు శుక్రవారం లాభాలతో ప్రారంభమయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్లలోని సానుకూల సంకేతాలు సూచీలకు దన్నుగా నిలుస్తున్నాయి. ఉదయం 9:22 గంటల సమయంలో సెన్సెక్స్ 257 పాయింట్లు లాభపడి 72,308 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ 83 పాయింట్లు పుంజుకొని 21,994 దగ్గర కొనసాగుతోంది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ రూ.83.02 వద్ద ప్రారంభమైంది. సెన్సెక్స్-30 సూచీలో టాటా మోటార్స్, ఇన్ఫోసిస్, ఎం అండ్ ఎం, విప్రో, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, టాటా స్టీల్, మారుతీ, అల్ట్రాటెక్ సిమెంట్, ఎన్‌టీపీసీ, హెచ్‌యూఎల్ షేర్లు లాభాల్లో ఉన్నాయి. పవర్‌గ్రిడ్, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌సీఎల్ టెక్, సన్‌ఫార్మా, రిలయన్స్, ఏషియన్ పెయింట్స్, ఐటీసీ షేర్లు నష్టాల్లో కొనసాగుతున్నాయి. అమెరికా మార్కెట్లు గురువారం లాభాలతో ముగిశాయి. నేడు ఆసియా పసిఫిక్ ప్రధాన సూచీలూ సానుకూలంగా ట్రేడవుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారెల్ బ్రెంట్ చమురు ధర గత 24 గంటల్లో స్వల్పంగా తగ్గి 82.78 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. 'విదేశీ సంస్థాగత మదుపర్లు' గురువారం నికరంగా రూ.3,064.15 కోట్ల విలువ చేసే షేర్లను విక్రయించారు. 'దేశీయ సంస్థాగత మదుపర్లు' రూ.2,276.93 కోట్ల విలువ చేసే షేర్లను కొన్నారు. జనవరిలో మన దేశ ఎగుమతులు 3.12% వృద్ధి చెంది 3 నెలల గరిష్ఠమైన 36.92 బిలియన్ డాలర్లకు చేరాయి. వాణిజ్యలోటు 17.03 బిలియన్ డాలర్లకు చేరింది.

# పేటీఎంకు మరో షాక్

## ఫాస్టాగ్ జారీ నిలిపివేత!

**దిల్లీ జనం సాక్షి:**




పేటీఎంకు కష్టాలు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ తరఫున టోల్ రుసుము వసూలు చేసే భారతీయ రహదారుల నిర్వహణ కంపెనీ ఫాస్టాగ్ జారీ చేసే అధీకృత బ్యాంకుల జాబితా నుంచి పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌ను తొలగించింది. ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రయాణం కొనసాగించటం కోసం తాము పేర్కొన్న బ్యాంకుల నుంచే ఫాస్టాగ్‌లు కొనుగోలు చేయాలని యూజర్లకు సూచించింది.

### ఫాస్టాగ్ కేవైసీ గడువు పొడిగించిన ఎన్‌హెచ్ఏఐ

ఐహెచ్‌ఎంసీఎల్ పేర్కొన్న జాబితాలో ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్, అలహాబాద్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, ఐడీబీఐ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, ఎస్‌బీఐ, యెస్ బ్యాంక్ సహా మొత్తం 32 బ్యాంకులు ఉన్నాయి. దాంట్లో పీపీబీఎల్ మాత్రం లేదు. ఫిబ్రవరి 29 తర్వాత వినియోగదారుల ఖాతాలు, వ్యాలెట్లు, ఫాస్టాగ్‌లలో డిపాజిట్లు, టాప్-అప్‌లు స్వీకరించొద్దని పీపీబీఎల్‌ను ఆర్‌బీఐ ఆదేశించిన విషయం తెలిసిందే. అయితే, ఆయా ఖాతాల్లో ఇప్పటి వరకు ఉన్న సొమ్మును మాత్రం అది అయిపోయేంత వరకు ఉపయోగించుకోవచ్చని స్పష్టం చేసింది. ఆర్‌బీఐ ఆంక్షల నేపథ్యంలోనే ఐహెచ్‌ఎంసీఎల్ తాజా మార్పులు చేసినట్లు తెలుస్తోంది. మరోవైపు ఫాస్టాగ్ యూజర్లంతా ఆర్‌బీఐ మార్గదర్శకాల ప్రకారం.. తమ కేవైసీ ప్రక్రియను పూర్తి చేయాలని ఐహెచ్‌ఎంసీఎల్ సూచించింది.

# గల్వాన్ ఘర్షణ తర్వాత భారత సైన్యానికి ప్రత్యేక శిక్షణ..!



గల్వాన్ ఘర్షణ తర్వాత నుంచి భారత సైన్యం శిక్షణలో మార్పులు చేసినట్లు తెలిసింది. ఆయా రెజిమెంట్లలో సైనికులకు రోజువారీ ఫిట్‌నెస్ శిక్షణతో పాటు.. వివిధ మార్షల్ ఆర్ట్స్‌ను కూడా భాగం చేసినట్లు సైనిక వర్గాలు వెల్లడించాయని ఓ ఆంగ్లపత్రిక కథనంలో పేర్కొంది. పంజాబ్ రెజిమెంట్‌లోని వారికి ఘాతక్, గూరా? రెజిమెంట్‌కు కుక్రీ డ్యాన్స్, మద్రాస్ రెజిమెంట్‌కు కలిరిపయట్టు వంటివి నేర్పిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే పంజాబ్ రెజిమెంట్‌కు చెందిన సైనికులను అరుణాచల్ ప్రదేశ్‌లోని కిబితు ప్రాంతంలో మోహరించారు. వారు ఇటీవల కొందరు జర్నలిస్టుల ముందు మార్షల్ ఆర్ట్స్‌ను ప్రదర్శించి చూపారు. ఆ యూనిట్‌కు చెందిన మేజర్ కార్తికేయ జైస్వాల్ మాట్లాడుతూ.. స్థానిక భౌగోళిక స్వరూపం, గస్తీ సమయంలో ఎదురయ్యే సవాళ్లు భిన్నమైనవన్నారు. "వేగంగా ప్రవహించే నదులు, ముళ్లు, వర్షాలు, త్వరగా మారిపోయే వాతావరణం, ఎత్తైన శిఖరాల వంటివి ఇక్కడ ఉంటాయి. దీంతో నిత్యం శిక్షణ తప్పనిసరి. వీటిల్లో మార్షల్ ఆర్ట్స్ కూడా ఒకటి" అని వెల్లడించారు. ఇలాంటి అభిప్రాయాన్నే ఆ యూనిట్ కమాండింగ్ అధికారి కర్నల్ ప్రిన్స్ రోహిత్ వ్యక్తం చేశారు. గల్వాన్ ఘర్షణ తర్వాత ఉధంపుర్‌లోని నార్తర్న్ కమాండ్ ఇజ్రాయెల్‌కు చెందిన క్రావ్ మాగా అనే మార్షల్ ఆర్ట్స్‌ను సైనిక శిక్షణలో ప్రవేశపెట్టింది. ఈ మేరకు ఆయా యూనిట్లకు లేఖలు రాసింది. ఆ తర్వాత అవి తమకు అనుబంధంగా అవసరమైన యుద్ధ విద్యను ఎంపిక చేసుకున్నాయి. "సరిహద్దుల వెంట ఘర్షణలు జరిగినా ఆశ్చర్యపోవాల్సిన అవసరంలేదు. మనకు ఇప్పటికే ఉన్న పలు భారతీయ మార్షల్ ఆర్ట్స్ ఆ సమయంలో సరిగ్గా సరిపోతాయి" అని ఓ అధికారి వ్యాఖ్యానించారు. 45 ఏళ్ల లోపు సైనికులు శారీరకంగా, మానసికంగా ఫిట్‌గా ఉన్నామని నిరూపించుకునేందుకు ఇప్పటికే ప్రతి త్రైమాసికంలో బీపీఏటీను పూర్తి చేయాల్సి ఉంటుంది. దీనిలో 30 ఏళ్ల లోపు వారు 5 కిలోమీటర్ల పరుగును 25 నిమిషాల్లో ముగించాలి. 30-40 మధ్య వయస్కులకు అదనంగా మరో రెండు నిమిషాల సమయం ఇస్తారు. అధికారుల ఫిట్‌నెస్‌కు సంబంధించిన నిబంధనలను కూడా సైన్యం మార్చింది. ఇవి ఇంకా అమల్లోకి రావాల్సి ఉంది. భారత్-చైనా సైనికుల మధ్య 2020లో గల్వాన్ లోయలో ఘర్షణ జరిగింది. ఈ సమయంలో ఇరు దేశాల సైనికులు రాళ్లు, కర్రలతో తలపడ్డారు. వాస్తవాధీన రేఖ వద్ద తుపాకుల వంటి ఆయుధాలు వినియోగించకూడదని ఒప్పందం ఉన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సైన్యం శిక్షణలో మార్షల్ ఆర్ట్స్‌ను భాగం చేయడం విశేషం.

# జాతీయం అంతర్జాతీయం

## రష్యా ఉపగ్రహ విధ్వంసక ఆయుధాన్ని తయారు చేస్తోంది: అమెరికా

**వాషింగ్టన్ జనం సాక్షి:**

ఉపగ్రహ విధ్వంసక ఆయుధాన్నిరష్యా అభివృద్ధి చేస్తున్నట్లు తమకు సమాచారం ఉందని అమెరికా గురువారం ప్రకటించింది. దీన్ని తీవ్ర ఆందోళన కలిగించే అంశంగా పేర్కొంది. ఆ ఆయుధాన్ని ఇంకా ప్రయోగించలేదని తెలిపింది. ప్రస్తుతానికైతే ఎలాంటి ముప్పులేదని శ్వేతసౌధం ప్రతినిధి జాన్ కిర్బీ స్పష్టం చేశారు. రష్యా రహస్యంగా ఓ కీలక ఆయుధాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు సమాచారం అమెరికన్ ఇంటెలిజెన్స్ వద్ద ఉందని ఇటీవల వార్తలు వచ్చాయి. దీనిపై నిజాలను బయటపెట్టాలని అధ్యక్షుడు బైడెన్ యంత్రాంగాన్ని ప్రతినిధుల సభ ఇంటెలిజెన్స్ కమిటీ ఛైర్మన్ మైక్ టర్నర్ బుధవారం డిమాండ్ చేశారు. దాని పర్యవసానాలను ప్రజలకు వెల్లడించాలని కోరారు. ఈ నేపథ్యంలో ఆ వార్తల్ని శ్వేతసౌధం గురువారం ధ్రువీకరించింది. అయితే, ప్రస్తుతానికి ఇంతకు మించి సమాచారాన్ని వెల్లడించలేమని తెలిపింది.

### చంద్రుడిపైకి ప్రైవేటు ల్యాండర్

రష్యా తయారు చేస్తున్న ఉపగ్రహ విధ్వంసక ఆయుధానికి అణ్వస్త్ర సామర్థ్యం ఉందంటూ వచ్చిన వార్తలపై మాత్రం కిర్బీ స్పష్టతనివ్వలేదు. తక్షణమే దీనివల్ల ఎలాంటి ప్రమాదం లేకపోయినప్పటికీ.. భూ కక్ష్యలోని ఉపగ్రహాలకు ముప్పు పొంచి ఉంటుందని తెలిపారు. దిగువ కక్ష్యలో ఉండే వ్యోమగాములకు సైతం ఇది ప్రమాదకరమన్నారు. అంతరిక్షం నుంచి భూమిపై దాడి చేసే సామర్థ్యం ఆ ఆయుధానికి ఉందని మాత్రం చెప్పట్లేదని కిర్బీ అన్నారు. అలాగే దీని తయారీని కొన్ని నెలల క్రితమే ప్రారంభించారన్నారు. ఏళ్లుగా దీనిపై పని జరుగుతోందంటూ వస్తున్న వార్తల్ని ఆయన కొట్టిపారేశారు.

# ఎన్నికల ముందు స్తంభించిన కాంగ్రెస్ బ్యాంకు ఖాతాలు

## మాకెన్ తీవ్ర ఆరోపణలు

**దిల్లీ జనం సాక్షి:**



దేశంలో సార్వత్రిక ఎన్నికల హడావుడి నడుస్తోన్న తరుణంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. కాంగ్రెస్ పార్టీకి చెందిన పలు బ్యాంకు ఖాతాలను ఆదాయపన్ను విభాగం ఫ్రీజ్ చేసినట్లు ఆ పార్టీ నేతలు వెల్లడించారు. వాటిలో యూత్ కాంగ్రెస్ ఖాతా కూడా ఉందని తెలిపారు. ఈ ప్రకటన చేసిన గంట తర్వాత.. ఆ ఖాతాలను పునరుద్ధరించారు. దీనిపై దిల్లీలోని ఆదాయపు పన్ను అప్పిలేట్ ట్రైబ్యునల్‌లో అప్పీల్ చేయడంతో ఉపశమనం లభించింది. ఇది ప్రజాస్వామ్య ప్రక్రియకు విఘాతం కలిగించే దెబ్బ అని ఆ పార్టీ ప్రతినిధి అజయ్ మాకెన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. "విద్యుత్ బిల్లులు, సిబ్బందికి జీతాలు ఇవ్వడానికి ప్రస్తుతం మా చేతిలో ఒక్క రూపాయి కూడా లేదు. న్యాయ యాత్రతో పాటు పార్టీకి చెందిన రాజకీయ కార్యకలాపాలపై ఈ నిర్ణయం ప్రభావం చూపనుంది. మేం జారీ చేసిన చెక్కులను బ్యాంకులు అంగీకరించడం లేదని మాకు సమాచారం అందింది. కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్ బ్యాంకు ఖాతాలు ఫ్రీజ్ అయ్యాయి. క్రౌడ్ ఫండింగ్ ద్వారా వచ్చిన డబ్బు నిలిచిపోయింది" అని ఆయన తెలిపారు. ఈ నిర్ణయం రాజకీయ ప్రేరేపితమైనదని, తమ ఎన్నికల సంసిద్ధతను దెబ్బతీసేందుకే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. రూ.210 కోట్ల పన్ను రికవరీ నిమిత్తం ఆదాయపన్ను శాఖ వీటిని ఫ్రీజ్ చేసినట్లు తెలుస్తోంది. ఇది ప్రజాస్వామ్యంపై దాడి అంటూ కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆగ్రహం వ్యక్తంచేశారు. 'భాజపా సేకరించిన సొమ్మును ఎన్నికల్లో వినియోగిస్తారు. కానీ మేం క్రౌడ్ ఫండింగ్ ద్వారా సమీకరించుకున్న నిధుల్ని అడ్డుకుంటారు. అందుకే.. భవిష్యత్తులో ఎన్నికలు ఉండవని నేను చెప్పాను. దేశంలో బహుళ పార్టీ వ్యవస్థను, ప్రజాస్వామ్యాన్ని రక్షించాలని న్యాయవ్యవస్థను అభ్యర్థిస్తున్నాను' అని ఖర్గే వ్యాఖ్యానించారు. రాజకీయ పార్టీలకు విరాళాలు ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎన్నికల బాండ్ల పథకం రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం సంచలన తీర్పు వెలువరించింది. ఆ మరుసటి రోజే ఈ పరిణామాలు చోటుచేసుకోవడం గమనార్హం.



**పోలీసుల కస్టడీలో 17వ డివిజన్ కార్పొరేటర్ భర్త కోల ప్రశాంత్, 18వ డివిజన్ కార్పొరేటర్ భర్త సుదగోని కృష్ణ గౌడ్, ఏలేటి భరత్ రెడ్డిలు**

**కరీంనగర్ బ్యూరో, ఫిబ్రవరి 16 (జనంసాక్షి) :** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ లోని శివసాయినగర్ కు చెందిన గునుకుల రాజిరెడ్డికి రేకుర్తికి చెందిన భూమి యొక్క నకిలీ ధృపత్రాలు నిజమైనవిగా చూపించి, వివాదాల్లో ఉన్నటువంటి భూమిని చూపి అక్రమంగా కోటి ముప్పై ఏడు లక్షల రూపాయలు వసూలు చేసినందుకు గాను బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితులను అదుపులోకి తీసుకొని జరిపిన విచారణలో వారిపై ఆరోపణలు నిజమైనవిగా గుర్తించి ఈ నెల 9వ తేదీ శుక్రవారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా కోర్టు నిందితులు ముగ్గురికి 14 రోజుల రిమాండ్ విధించి, జైలుకు తరలించిన విషయం విధితమే ఇదిలా ఉండగా ఈ కేసులో జైలులో నిందితులుగా ఉన్న ముగ్గురైన 17వ డివిజన్ కార్పొరేటర్ భర్త కోల ప్రశాంత్, 18 వ డివిజన్ కార్పొరేటర్ భర్త సుదగోని కృష్ణ గౌడ్, ఏలేటి భరత్ రెడ్డి లను పై కేసుకు సంబంధించి మరింత కీలక సమాచారం సేకరించేం దుకు కోర్టు ద్వారా అనుమతి మేరకు శుక్రవారం రోజు ఉదయం 10 గంటల నుండి శనివారం మధ్యాహ్నం 10 గంటల వరకు కరీంనగర్ రూరల్ ఇన్స్పెక్టర్ ప్రదీప్ కుమార్ పోలీస్ కస్టడీకీ తీసుకుని విచారణలో భాగంగా పోలీస్ కస్టడీలోకి తీసుకున్న నిందితుల కరీంనగర్ లోని ముగ్గురి ఇళ్లల్లో సోదాలు జరిపినట్లు తెలిసింది. ఇట్టి సోదాల్లో నమోదైన కేసుకు సంబం ధించిన పలు కీలక డాక్యుమెంట్లు లభించాయని వాటిని కరీంనగర్ రూరల్ పోలీసులు స్వాధీన పరుచుకున్నామని తెలిపారు.

# కరీంనగర్ చేరుకున్న టీటీడీ లడ్డు ప్రసాదం



**కరీంనగర్ బ్యూరో, ఫిబ్రవరి 16 (జనం సాక్షి) :** ఈనెల 18న స్వామివారి కళ్యాణం రోజున భక్తులకు లడ్డూ ప్రసాదం అందజేయనున్న ఆలయ అధికారులు. జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్ నిర్వహణలో కొనసాగుతున్న కరీంనగర్ మార్కెట్ రోడ్ శ్రీ లక్ష్మి పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఈనెల 18న నిర్వహించనున్న స్వామి వారి కల్యాణోత్సవ కార్యక్రమానికి వీచ్చేయనున్న భక్తులకు అందజేసే తిరుమల శ్రీవారి లడ్డు ప్రసాదాన్ని తీసుకు రావడానికి 14వ తేదీన తిరుమల నుండి బయలు దేరిన బృందం నిన్న స్వామి వారిని దర్శనం చేసుకున్న అనంతరం శుక్రవారం రోజు కరీంనగర్ చేరుకోవడం జరిగింది. కరీంనగర్ కు చేరుకున్న లడ్డు ప్రసాద వాహనాన్ని ఆలయ అధికారులతో పాటు పలువురు నేతలు వైద్యుల అంజన్ కుమార్, కంకణాల అనిల్ కుమార్, తదితరుల ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు పూజా కార్యక్రమం నిర్వహించిన అనంతరం ఈవో కార్యాలయానికి తరలించినారు. ఎస్.ఆర్.కె డైరీ అధినేత బండారి మారుతి ఈ లడ్డులకు దాతగా వ్యవహరించగా వారి తరఫున విజయ్ కుమార్, రఘువీరారెడ్డి లతోపాటు కాంగ్రెస్ నాయకులు వీర దేవేందర్, దొంతి గోపి, రాజు కుమార్ తదితరులు తిరుమల వెళ్ళిన బృందంలో ఉన్నారు.

## సమాన పలికి సమాన వేతనం చెల్లించాలని కార్మికుల ర్యాలీ..

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 16 (జనంసాక్షి):** దేశ వ్యాప్తంగా సార్వత్రిక సమ్మెలో భాగంగా శుక్రవారం వేములవాడలోని అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో అమరవీరుల స్తూపం నుండి తెలుగు తల్లి విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్నటువంటి కార్మిక చట్టాల సవరణకు వ్యతిరేకంగా పోరాటం చేస్తామన్నారు. రైతు చట్టాలకు వ్యతిరేకంగా, స్కీం వర్కర్లకు గౌరవ వేతనంకు బదులు కనీస వేతనం అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వంలో పని చేస్తున్నటువంటి కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. పని భద్రత కల్పించాలని,సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని తదితర డిమాండ్లపై సమ్మె చేయడంజరిగిందన్నారు. ఈ యొక్క కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎగుమంటి ఎల్లారెడ్డి, ఏఐటీయూసీ నాయకులు కడారి రాములు, సిఐటియు నాయకులు గుర్రం అశోక్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ముక్తికాంతం అశోక్, గురజాల శ్రీధరు, జవాజి విమల,మల్యాల నరసయ్య, చిలక బాబు, అంగన్వాడిలు, ఆశ వర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు, మున్సిపల్ కార్మికులు, గ్రామపంచాయతీ కార్మికులు, బీడీ కార్మికులు, ఏఎన్ఎంలు, సెకండ్ ఏఎన్ఎంలు, హామాలి కార్మికులు పాల్గొన్నారు.



# పిఎఫ్ఆర్డిఏ చట్టాన్ని రద్దు చేయాలి..

**• ఉద్యోగుల ఆదాయపు పన్ను 10 లక్షలకు పెంచాలి • కరీంనగర్ జిల్లా టీఎన్జీవోల సంఘం.,**

**కరీంనగర్ బ్యూరో, ఫిబ్రవరి 16 (జనంసాక్షి) :** ఆల్ ఇండియా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య తెలంగాణ ఎన్జీవోల కేంద్ర సంఘం పిలుపు మేరకు శుక్రవారం రోజు దేశవ్యాప్త సమ్మెలో భాగంగా టీఎన్జీవో సంఘం, కరీంనగర్ జిల్లా సంఘం అధ్వర్యంలో మధ్యాహ్న భోజన విరామ సమయం లో ధర్నా నిర్వహించడం జరిగింది. అదేవిధంగా ఉద్యోగులందరూ నల్ల బ్యాడ్జీలతో విధులు నిర్వర్తిస్తూ వారి నిరసనను తెలిపారు. ఈ ధర్నాలో ముఖ్యమైన డిమాండ్ల సాధనకు నిర్వహించనైనది. పిఎఫ్ ఆర్డిఏ చట్టం తొలగించుట, కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం రద్దు, ఇన్కమ్ టాక్స్ పరిధి పెంపొందించుటకు, ప్రైవేటైజేషన్ ఆలోచన విరమించుకోవాలని కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలని కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని తదితర డిమాండ్ల పై శుక్రవారం రోజు స్థానిక కరీంనగర్ లోని కలెక్టరేట్ ఆవరణంలో పెద్ద ఎత్తున వివిధ శాఖల నుంచి తెలంగాణ ఎన్జీవోలు పాల్గొని దిగ్విజయం చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో దారం శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి, సంఘ్యం లక్ష్మణరావు తెలంగాణ ఎన్జీవోల కేంద్ర సంఘం




ఉపాధ్యక్షుడు నాగుల నరసింహస్వామి, రాగి శ్రీనివాస్, సర్దార్ హర్మిందర్ సింగ్, రాజేష్ భరద్వాజ్, కిషన్, శారద, విజయలక్ష్మి, హరిప్రియ,విజయలక్ష్మి, గూడ ప్రభాకర్ రెడ్డి, కేషవ రెడ్డి, పవన్ కుమార్, నగేష్ గౌడ్, శంకర్ లింగయ్య, గంగారపు రమేష్, రాజేశ్వరరావు, నర్సయ్య అభిషేక్ మన్మిత్ సింగ్, కొండయ్య, రామస్వామి నరసింహారెడ్డి, కమలాకర్, కరుణాకర్, రాజశేఖర్ రెడ్డి, ప్రణీత్, అంగన్వాడి టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు లలిత, మేరీ, రమణ, లత, జలాలుద్దీన్, అక్బర్, తిరుమల్ రావు, నారాయణ, సాత్విక్, రజనీకర్ రెడ్డి, ఉద్యోగులు



తమ సమస్య సాధనలకై మరొకసారి ఉద్యమ బాట పట్టాలని పిలుపునిచ్చారు. టీఎన్జీవోల , వివిధ శాఖల అధ్యక్ష కార్యదర్శులు ప్రాథమిక సభ్యులు పాల్గొని ధర్నా కార్యక్రమాన్ని దిగ్విజయం చేసి తమ సమస్య సాధనకై ఐక్యంగా పోరాడతామని నినాదాలు చేశారు.

## సింగరేణిలో కొత్త గనులు ప్రారంభించాలి

**కోల్ సెక్రటరీ అమృత్‌లాల్ మీనాకు ఐఎన్టీయూసీ విజ్ఞప్తి..**



**గోదావరిఖని, ఫిబ్రవరి 16, (జనంసాక్షి) :** సింగరేణి సంస్థకు కొత్త గనులను కేటాయించి సంస్థను కాపాడాలని కోల్ సెక్రటరీ అమృత్‌లాల్ మీనాకు ఐఎన్టీయూసీ ప్రధానకార్యదర్శి జి.జనక్‌ప్రసాద్ విజ్ఞప్తి చేశారు.కొత్త గనుల ఏర్పాటు ద్వారా 40వేల మంది కార్మిక కుటుంబాలను రక్షించినవారవుతారని,రాష్ట్ర,దేశ అవసరాలకు కూడా తగినంత బొగ్గును ఉత్పత్తి చేసే అవకాశం ఏర్పడుతుందని జనక్‌ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం హైదరాబాద్ సింగరేణి భవన్‌లో అధికారిక సమావేశానికి హాజరైన కోల్ సెక్రెటరీ అమృతలాల్ మీనాను ఆయన కలిసి విజ్ఞాపన పత్రం అందించారు.2030 నాటికి సింగరేణి సంస్థలో పాత గనులు మూతపడి క్లిష్ట పరిస్థితులు ఏర్పడనున్నాయని,ఈ తరుణంలో కొత్త బ్లాకులను కేటాయించి 13దశాబ్దాల చరిత్ర గల సింగరేణినీ కాపాడాలని కోరారు.దేశ బొగ్గు అవసరాలు తీర్చడంలో సింగరేణి సంస్థ ఎప్పుడు ముందుం టుందని, థర్మల్ విద్యుత్ , సోలార్ విద్యుత్తు రంగాల్లో కూడా ప్రవేశించిన సింగరేణి సంస్థ,దేశానికే ఆదర్శంగా ఉందన్నారు. సింగరేణి ఆధారిత పరిశ్రమలతో ప్రజలు కూడా అభివృద్ధి చెందే అవకాశం ఉందని ఆయన వివరించారు.దీనిపై కోల్ సెక్రెటరీ మాట్లాడుతూ సింగరేణి సంస్థను తప్పక రక్షిస్తామని,తగిన చర్యలు తీసుకుంటామని,ఆందోళన చెందాల్సిన అవసరం ఏమాత్రం లేదని హామీ ఇచ్చారు.

# సింగరేణి కొత్త గనులకు పూర్తి సహకారం..

**• కేంద్ర బొగ్గు శాఖ కార్యదర్శి అమ్రిత్‌లాల్‌మీనా..**
**• బొగ్గు ఉత్పత్తి, రవాణాలో సింగరేణి పనితీరు భేష్..**
**• సింగరేణి పనితీరుపై సింగరేణి భవన్‌లో ఉన్నతస్థాయి సమీక్ష..**




**గోదావరిఖని, ఫిబ్రవరి 16, (జనంసాక్షి) :** సింగరేణి సంస్థ పనితీరు సంతృప్తికరంగా ఉందని, సంస్థ అభివృద్ధి కోసం చేపట్టనున్న గనులకు పూర్తి సహకారం అందిస్తామని కేంద్ర బొగ్గు శాఖ కార్యదర్శి అమ్రిత్‌లాల్‌మీనా హామీ ఇచ్చారు.ఈ ఏడాది నిర్దేశించుకున్న 70 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్య సాధనలో ముందుండటంపై ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.శుక్రవారం హైదరాబాద్ సింగరేణి భవన్‌లో ఆయన సంస్థ ఛైర్మన్ మరియు ఎండి ఎన్.బలరామ్ మరియు ఇతర డైరెక్టర్లతో కంపెనీ ప్రగతిపై ప్రత్యేక సమీక్ష నిర్వహించారు.ఈ సమీక్షలో సింగరేణి ప్రస్తుత పనితీరు భవిష్యత్తు ప్రణాళికలపై ఛైర్మన్ శ్రీ ఎన్.బలరామ్ వివరించారు.సింగరేణి ప్రాంతంలోని మూడు బొగ్గు బ్లాకుల కేటాయింపు పద్ధతిలో సింగరేణి సంస్థకే కేటాయించేలా చూడాలని ఆయన విజ్ఞప్తి చేశారు.అలాగే రానున్న కాలంలో చేపట్టనున్న కొత్త గనులకు త్వరితగతిన అనుమతులు లభించేలా చూడాలన్నారు.దీనిపై కేంద్ర ప్రభుత్వ శాఖ కార్యదర్శి స్పందిస్తూ నిబంధనలకు లోబడి సింగరేణికి మేలు కలిగే విధంగా తగిన సహకారాన్ని అందిస్తామని సింగరేణి భవిష్యత్తుకు ఎటువంటి ఇబ్బందీ ఉండదని ఆయన హామీ ఇచ్చారు.అలాగే సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన సోలార్, థర్మల్ ప్రాజెక్టుల పనితీరును అడిగి తెలుసుకున్నారు. సోలార్ రంగంలో చేపట్టే ప్రాజెక్టులపై కూలంకశంగా తెలుసుకున్నారు.

సింగరేణి చేపట్టిన వ్యాపార విస్తరణ చర్యలైన థర్మల్, సోలార్, జియో థర్మల్, ఓబీ నుంచి ఇసుక ఉత్పత్తి, కమర్షియల్ ఇసుక తయారీ తదితర ప్రాజెక్టులపై అభినందనలు తెలిపారు.ఈ సమావేశంలో కేంద్ర బొగ్గు శాఖ అదనపు కార్యదర్శి రూపేందర్ బ్రార్, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ సంతోష్, సంస్థ డైరెక్టర్లు డి.సత్య నారాయణరావు (ఈ అండ్ ఎం), ఎన్వికె శ్రీనివాస్ (ఆపరేషన్స్- పర్సనల్), జి. వెంకటేశ్వర్‌రెడ్డి (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్), ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(కోల్ మూమెంట్) జె.ఆల్విన్, జీఎం(కో ఆర్డినేషన్) ఎం.సురేష్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

**రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో భేటీ**

హైదరాబాద్ సింగరేణి భవన్ లో సమీక్షా సమావేశం అనంతరం రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారిని బొగ్గు శాఖ కార్యదర్శి అమ్రిత్‌లాల్‌మీనా కలిసి పలు అంశాలపై చర్చించారు.ఆయన వెంట సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ కూడా ఉన్నారు.

## వైస్ చైర్మన్ ఎన్నిక కోసం మారుతున్న రాజకీయ సమీకరణలు

**బిఆర్ఎస్ కౌన్సిలర్ల చూపు అధికార పార్టీ వైపా..?**

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 16 (జనంసాక్షి):** వేములవాడ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక వాయిదా పడడంతో రాజకీయ సమీకరణలు రోజురోజుకు మారుతున్నాయి. ఇద్దరు కౌన్సిలర్లు వైస్ చైర్మన్ ఎన్నిక కోసం పోటీ పడగా ఈనెల 12న వైస్ చైర్మన్ ఎన్నిక జరగాల్సి ఉండగా అసెంబ్లీ సమావేశాలు నడుస్తున్న క్రమంలో వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ఆది శ్రీనివాసు తన ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవకాశం లేక పోవడంతో ఎన్నికల కమిషన్ అట్టి ఎన్నికలను వాయిదా వేసింది. ఎన్నికలు వాయిదా పడడంతో అయోమయానికి గురైన బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు అధికార కాంగ్రెస్ పార్టీలోకి చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు ప్రజల్లో చర్చలు మొదలయ్యాయి. ఇప్పటికే కొంతమంది బిఆర్ఎస్ కౌన్సిలర్లు ప్రభుత్వ విప్ ను హైదరాబాదులో కలిశారని, త్వరలోనే



బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీ లోకి వెళ్తున్నారని చర్చించుకుంటున్నారు. ఏది ఏమైనా వేములవాడ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక క్రమంలో రాజకీయ సమీకరణలు మారితే బిఆర్ఎస్ పార్టీకి గడ్డు కాలమే.

## కార్యకర్తలకు అండగా బిఆర్ఎస్ పార్టీ వుంటుంది

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి (జనంసాక్షి):** వేములవాడ అర్బన్ మండల సంకేపల్లి గ్రామానికి చెందిన కాచం ప్రభాకర్ గత సంవత్సరం రోడ్డు ప్రమాదంలో మృతి చెందడు.ఆయనకు బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వం ద్వారా మంజూరైన ఇన్సురెన్స్ చెక్కును వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు శుక్రవారం కాచం ప్రభాకర్ కూతురైన అక్షితకు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చనిపోయిన కార్యకర్త కుటుంబానికి పార్టీ ఇన్సురెన్స్ చెక్కు కొండత భరోసన్నారు. పార్టీ కార్యకర్త చనిపోతే రెండు లక్షల రూపాయల భీమా అందిస్తున్న ఏకైక పార్టీ దేశంలో భారాస ఒక్కటన్నారు. ప్రతీ కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అర్సిరావు,సెస్ డైరెక్టర్ హరి చరణ్ రావు, ప్రధాన కార్యదర్శి సిలువేని మల్లేశం, నాయకులు బూర బాబు,వేణు గోపాల్ రావు, నాగుల రాము, బండారి శ్రీనివాస్, మల్లేశం, పర్శరం, ఎల్లయ్య, శ్రీధర్ పాల్గొన్నారు.



## కార్మికులకు నల్లబ్యాడ్జీలు పెట్టి నిరసన:ఏఐటీయుసి

**సమ్మెపై జేపీసీ విచ్చిన్నానికి పాల్పడ్డ సీఐటీయూ..**

**గోదావరిఖని, ఫిబ్రవరి 16, (జనంసాక్షి) :** దేశంలో కార్మిక వర్గ సంక్షేమం కోసం ఏర్పాటు చేసుకున్న చట్టాలను కేంద్ర ప్రభుత్వం నల్ల చట్టాలుగా మార్చి కార్మికులపై, రైతులపై పెనుభారం మోపిందని, కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా సింగరేణి వ్యాప్తంగా గుర్తింపు సంఘం ఏఐటీయుసి కార్మికుల కు నల్ల బ్యాడ్జీలు పెట్టి నిరసన వ్యక్తం చేశారని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్, బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం పేర్కొన్నారు.శుక్రవారం సింగరేణి ఆర్జీ-వన్ ఏరియాలోని అన్ని గనులు,డిపార్ట్మెంట్లలో జరిగిన నిరసన కార్యక్రమం అనంతరం వారు గోదావరిఖని భాస్కర్‌రావు భవన్లో ఏర్పాటు చేసిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. సింగరేణిలో గుర్తింపు సంఘంగా కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు 12డిమాండ్‌లతో కూడిన సమ్మె నోటీసును అందజేయడం జరిగిందని వారు తెలిపారు.సింగరేణిలో గుర్తింపు సంఘం ఏఐటీయుసి మరియు ప్రాతినిధ్య సంఘం ఐఎన్టీయుసితో జాతీయ సమ్మె గురించి సిఐటియు నాయకులు సంప్రదించకుండా సమ్మెకు జాతీయ సంఘాలు మద్దతని వారిని సంప్రదించకుండా సమ్మె చేయాలని ఏకపక్షంగా గనులపై గేట్ మీటింగ్‌లు, ప్రెస్‌మీట్‌లు, సోషల్‌మీడియా పోస్టింగ్స్ పెడుతూ కార్మిక వర్గ ఐక్యతను దెబ్బతీస్తూ ఏకపక్షంగా వ్యవహరిస్తున్న సిఐటియు విధానాన్ని వ్యతిరేకిస్తున్నామని వారన్నారు.సిఐటియు జేపీసీ విచ్చిన్నానికి పాల్పడిందని వారు ఆరోపించారు.గుర్తింపు సంఘం ఏఐటీయుసి యాజమాన్యంతో లాలూచీపడి సింగరేణి లో సమ్మె చేయడం లేదని సిఐటియు నాయకులు చెప్పడాన్ని ఏఐటియుసి తీవ్రంగా ఖండిస్తుందని వారు తెలిపారు. కార్మిక వర్గ ఐక్యతను



దెబ్బతీస్తూ సమ్మె కు మద్దతు అంటూ సిఐటియు నాయకులు జాతీయ సంఘాలను సంప్రదించకుండా ఒంటెత్తు పోకడలతో గనులు, డిపార్ట్మెంట్లలో గేట్‌మీటింగ్‌లు, ప్రెస్ మీట్‌లలో, సోషల్ మీడియాలో ఏఐటియుసి పై ఆరోపణలు చేయడం సరైంది కాదన్నారు. సిఐటియు నాయకులు యాజమాన్యం వద్ద సమ్మె చేయమని, కార్మికుల వద్ద సమ్మె చేయాలని చెప్పడాన్ని వారు ఖండించారు.కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం వైఖరికి నిరసనగా సింగరేణి వ్యాప్తంగా కార్మికులకు నల్ల బ్యాడ్జీలు పెట్టి నిరసన వ్యక్తం చేయడం జరిగిందని వారు తెలిపారు.ఈ సమావేశంలో ఏఐటియుసి నాయకులు మాదన మహేష్, మిట్ట శంకర్, సాయన్న, మానాల శ్రీనివాస్, పర్లపెల్లి రామస్వామి, నాగేందర్, ప్రభుదాస్, బండి మల్లేశ్, బి.సమ్మయ్య, బలుసు రవి, నాయిని శంకర్, కారంపూడి వెంకన్న, గొడిశల నరేశ్, ఉప్పులేటి తిరుపతి, దేవేందర్ రెడ్డి, జగదీష్, నగేష్, కనకయ్య, జగన్, జైపాల్ రెడ్డి, బండారి శ్రీనివాస్, రవిందర్ రెడ్డి, ఆఫీసు కార్యదర్శి తొడుపునూరి రమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ బంద్..సమ్మెలో పాల్గొన్న కార్మిక వర్గానికి జేజేలు..

**గోదావరిఖని, ఫిబ్రవరి 16, (జనంసాక్షి) :** కార్మిక రైతు సంఘాలు ఇచ్చిన దేశవ్యాప్త గ్రామీణ బంద్..సమ్మెలో ప్రధాని నరేంద్ర మోడీ మెడలు వంచి పాల్గొన్న కార్మికులకు.. రైతులకు ప్రజలకు విప్లవ జేజేలని కార్మిక సంఘాల జేఏసీ నాయకులు తెలిపారు.శుక్రవారం గోదావరిఖని చౌరస్తాలో కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నిరసన..ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కార్మిక సంఘాల జేఏసీ నాయకులు సీఐటీయూ జిల్లా అధ్యక్షులు వేల్పుల కుమార్, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు ఈ నరేష్,ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు ఈ.రాజేందర్, జేఏసీ నాయకులు తోకల రమేష్, ఎఐటీయూసీ నాయకులు రామన్న, టీఎన్‌టీయూసీ నాయకులు ఏడుకొండలు మాట్లాడారు.నరేంద్ర మోడీ ప్రభుత్వం పెట్టుబడి దారులకు వంతపడుతోందని అన్నారు. పేదల,బడుగు బలహీన వర్గాలైన కార్మిక వర్గం నడ్డివిరుస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వ రంగ సంస్థలు, సహజ వనరులను కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు దారాదత్తం చేస్తుంద న్నారు.అమ్మకాల పేరుతో ప్రభుత్వ రంగ సంస్థల్లో 100శాతం వాటాలను తెగనమ్ముతుందని నేషనల్ మానిటైజేషన్ పైపులైన్ ఎన్ఎంపి పాలసీ ద్వారా మౌలిక వసతులను లీజు పేరుతో ప్రైవేటీకరిస్తుందన్నారు. ఉద్యోగుల కష్టార్జితమైన పిఎఫ్ పెన్షన్ నిధులను ప్రైవేటు ఇన్సూరెన్స్ మ్యూచువల్ ఫండ్ సంస్థలకు కట్టబెడుతుందన్నారు.సింగరేణిలోని నాలుగు బొగ్గు గనులను వేలం వేయడానికి విశ్వప్రయత్నం చేసిందన్నారు. కార్మికులు, మధ్యతరగతి



ప్రజల్లో అత్యధికులు పాలసీ దారులుగా ఉన్న ఎల్ఐసి వాటాలను అమ్మేందుకు తెరపడిందన్నారు. కార్పొరేట్లు ఎగ్గొట్టిన రుణాలతో ప్రభుత్వం బ్యాంకులను నిర్వీర్యం చేస్తుందన్నారు.ఈ విధానాలు ఉద్యోగుల భద్రతతో పాటు దేశ ఆర్థిక స్వావలంబన మనకే వర్తిస్తుందన్నారు. అనేక త్యాగాలతో పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చిందని, కనీస వేతనాలు నిర్ణయించే విధానానికి స్వస్తి పలికిందన్నారు.సమ్మె హక్కును కాలరాసిందన్నారు.పిఎఫ్,ఈఎస్ఐ వెల్ఫేర్ బోర్డులను నిర్వీర్యం చేసిందన్నారు. తిరిగి 12 గంటల పనివిధానం అమల్లోకి తెస్తుంద న్నారు. కాంట్రాక్టు లేబర్ విధానం అన్ని రంగాల్లో మరింత పెంచి శ్రమదోపిడికి గురిచేస్తుందన్నారు. కనీస వేతనం నెలకు రూ.26వేలు నిర్ణయించేందుకు బిజెపి ప్రభుత్వం అంగరించడం లేదని, కోట్లాది మంది కార్మికులకు వర్తించే ఈపీఎఫ్ పెన్షన్ నెలకు పదివేలకు పెంపు, సిఎంపిఎఫ్‌ను రద్దుచేసి పాత పెన్షన్ ఓపిఎస్‌ను పునరుద్ధరణ ను వ్యతిరేకిస్తుందన్నారు. నిరసన ధర్నా కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల నుండి మొగిలిచర్ల సురేష్ ,మండేద్దుల మల్లేష్, ఎం.దుర్గయ్య, ఎడ్ల రవి కుమార్, మార్తా రాములు, కంది చంద్రయ్య, మల్లేశం, రాయమల్లు, వీరేశం, ఐ.సాంబయ్య, ఈ చంద్రయ్య, లక్ష్మి, రాధా, అయ్యావుల శ్రీకాంత్, మర్రి శ్రావణ్, మహేందర్, ఆర్.శ్రీనివాస్, రూపేష్, బైరి రాకేష్, సోన్నాయిల శివకుమార్, నేతాజీ, మధు, సది, ఆర్.మొగిలి, ఏ.శ్రీనివాస్, వేణు,యు.శ్రీనివాస్, బి.రవి,తదితరులు పాల్గొన్నారు.

ఆట

## యువరాజ్ సింగ్ ఇంట్లో చోరీ

**విలువైన నగలు, నగదు మాయం**

భారత జట్టు దిగ్గజ క్రికెటర్ యువరాజ్ సింగ్ తల్లి షబ్నాన్ సింగ్ ఇంట్లో దొంగతనం జరిగింది. ఈ విషయమై ఆమె హర్యానా పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ప్రస్తుతం యువరాజ్ సింగ్ తల్లి షబ్నాన్ సింగ్ ఇల్లు హర్యానాలోని పంచకులలో ఉంది. ఈ ఇల్లే చోరీకి గురైంది. అయితే ఈ దొంగతనం జరిగి సుమారు ఆరు నెలలైంది. తాజాగా కేసు నమోదు అయ్యింది. పంచకులలోని సెక్టార్-4 ఎండీసీలో భారత మాజీ క్రికెటర్ యువరాజ్ సింగ్ ఇంట్లో 75 వేల రూపాయల నగదు, నగలు చోరీకి గురైన ఉదంతం వెలుగులోకి వచ్చింది. పని మనిషే ఈ చోరికి పాల్పడిందని యువీ తల్లి షబ్నమ్ ఆరోపించింది. ఎండీసీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సెక్టార్-4 ఎండీసీకి చెందిన షబ్నమ్ సింగ్ ఇంటిని శుభ్రం చేసేందుకు సాకేత్డీకి చెందిన లలితాదేవిని, వంట చేసేందుకు బీహార్‌కు చెందిన సలీందర్ దాస్‌ను నియమించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

**టీ20 ప్రపంచకప్ 2024 వరకు**

## హెడ్ కోచ్‌గా ద్రవిడే

టీమిండియా హెడ్ కోచ్ పదవిపై బీసీసీఐ కార్యదర్శి జై షా కీలక ప్రకటన చేశాడు. జూన్‌లో జరిగే టీ20 ప్రపంచకప్ 2024 వరకు భారత జట్టు హెడ్ కోచ్‌గా రాహుల్ ద్రవిడే కొనసాగుతాడని స్పష్టం చేశాడు. ద్రవిడ్‌తో రెండేళ్ల ఒప్పందం 2023 వన్డే ప్రపంచకప్‌తో ముగిసింది. అయితే ప్రపంచకప్ అనంతరం జరిగిన దక్షిణాఫ్రికా పర్యటనలోనూ హెడ్ కోచ్‌గా కొనసాగాల్సిందిగా బీసీసీఐ కోరింది. అయితే రాహుల్ పదవీ కాలం ఎప్పటివరకు అన్నది మాత్రం బీసీసీఐ చెప్పలేదు. తాజాగా ద్రవిడ్‌తో మాట్లాడి.. టీ20 ప్రపంచకప్ 2024 వరకు ఒప్పందాన్ని పొడిగించినట్లు జై షా వెల్లడించాడు.రాజ్‌కోట్ వేదికగా భారత్-ఇంగ్లండ్ మధ్య గురువారం మొదలైన మూడో టెస్ట్‌కు ముందు జై షా మాట్లాడుతూ '2023 వన్డే ప్రపంచకప్ ముగిశాక రాహుల్ ద్రవిడ్‌తో మాట్లాడే అవకాశం దొరకలేదు. మెగా టోర్నీ అనంతరం ద్రవిడ్ భాయ్ వెంటనే దక్షిణాఫ్రికా పర్యటనకు వెళ్లిపోయాడు. ఆ తర్వాత స్వదేశంలో అఫ్గాన్‌తో సిరీస్‌తో బిజీ అయ్యాడు. రాజ్‌కోట్ టెస్ట్‌కు ముందు ద్రవిడ్‌తో నేరుగా మాట్లాడే అవకాశం దొరికింది.



# ఇంగ్లాండ్ ధీటుగా..

**ఆటముగిసే సమయానికి 207/2.. భారత్ 445 ఆలౌట్.. బెన్ డక్కెట్ మెరుపు సెంచరీ**

రాజ్ కోట్ టెస్టులో భారత్ నిలకడగా ఆడుతోంది. ఓవర్ నైట్ స్కోర్ 326 /5 రెండోరోజు ఆట కొనసాగించిన టీమిండియా ప్రారంభలోనే సెంచరీ హీరో జడేజా ( 112), వైట్ వాచ్ మన్ కులదీప్ యాదవ్ (4) వికెట్లు కోల్పోయింది. ఈ ఇద్దరూ జట్టు స్కోర్ 331 వద్దే అవుట్ అయ్యారు. తొలిరోజు 110 పరుగులతో క్రీజులో ఉన్న జడ్డూ మరో రెండు పరుగులు జోడించి పెవిలియన్ కు చేరాడు. ఒక పరుగుతో క్రీజులో ఉన్న కులదీప్ మరో 3 రన్స్ చేసి అవుట్ అయ్యాడు. దీంతో భారత్ 331 పరుగులకే 7 వికెట్లు కోల్పోయింది. జడేజాను తన బౌలింగ్ లోనే క్యాచ్ పట్టి రూట్ అవుట్ చేశాడు. కులదీప్ ను అండర్సన్ అవుట్ చేశాడు. ఈ దశలో రవిచంద్రన్ అశ్విన్, తొలి టెస్ట్ మ్యాచ్ ఆడుతున్న ధ్రువ్ జురెల్ పట్టుదలతో బ్యాటింగ్ చేశారు. దీంతో లంచ్ సమయానికి భారత్ 7 వికెట్ల నష్టానికి 388 పరుగులు చేసింది. లంచ్ సమయానికి ధ్రువ్ జురెల్ (31), అశ్విన్ (25) క్రీజులో ఉన్నారు. అప్పటికి 8వ వికెట్ కు 57 పరుగులు జోడించారు.అయితే లంచ్ తర్వాత కాసేపటి అశ్విన్ (37) రెహాన్ అహ్మద్ బౌలింగ్ లో అవుట్ అయ్యాడు. దీంతో 77 పరుగుల 8వ వికెట్ భాగ్యస్వామ్యానికి తెరపడింది. జట్టు స్కోర్ 408 పరుగుల వద్ద టీమిండియా 8వ వికెట్ కోల్పోయింది. తొలి మ్యాచ్ ఆడుతున్న ధ్రువ్ జురెల్ (46) హాఫ్ సెంచరీకి నాలుగు పరుగులు దూరంలో అవుట్ అయ్యాడు. దీంతో భారత్ 415 పరుగుల 9వ వికెట్ కోల్పోయింది. ఈ వికెట్ కూడా రెహాన్ అహ్మద్ కే దక్కింది.పదో వికెట్ కు బుమ్రా (26), సిరాజ్ (3 నాటౌట్) 30 పరుగులు జోడించారు. చివరి వికెట్ గా బుమ్రా అవుట్ కావడంతో టీమిండియా తొలి ఇన్నింగ్స్ 445 పరుగుల వద్ద ముగిసింది. ఇంగ్లాండ్ బౌలర్లలో మార్క్ వుడ్ కు 4 వికెట్లు దక్కాయి. రెహాన్ అహ్మద్ కు రెండు.. అండర్సన్, జోరూట్, టామ్ హర్ట్ లీకి తలో వికెట్ తీశారు. భారత్ బ్యాటర్లలో సర్ఫరాజ్ ఖాన్ రనౌట్ అయ్యాడు. ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్ ను దూకుడుగానే మొదలుపెట్టింది. బాజ్ బాల్ వ్యూహాన్ని అమలు చేసింది. ముఖ్యంగా బెన్ డక్కెట్ చెలరేగిపోయాడు. ఫోర్ల వర్షం కురిపించాడు. తొలి వికెట్ కు జాక్ క్రాలీ (15) తో కలిసి కేవలం 13.1 ఓవర్లలోనే 89 పరుగులు జోడించాడు. జాక్ క్రాలీ అవుటైనా తర్వాత ఓలీ పోప్ తో కలిసి 93 పరుగలు జోడించాడు. పోప్ ను సిరాజ్ అవుట్ చేయడంతో ఇంగ్లాడ్ 182 పరుల వద్ద రెండో వికెట్ కోల్పోయింది. సెంచరీతో విధ్వంసం సృష్టించిన డక్కట్ (133 బ్యాటింగ్, 118 బంతుల్లో 21 ఫోర్లు, 2 సిక్సులు ) జోరూట్ (9 బ్యాటింగ్ ) మరో వికెట్ పడకుండా జాగ్రత్త పడ్డారు. దీంతో రెండోరోజు ఆటముగిసే సరికి ఇంగ్లాండ్ కేవలం 35 ఓవర్లలోనే రెండు వికెట్లు మాత్రమే కోల్పోయి 207 పరుగులు చేసింది.

## అశ్విన్ అదరహో..

**500 వికెట్ల క్లబ్ లో రవిచంద్రన్ అశ్విన్**

భారత్ స్పిన్నర్ మరో రికార్డు బద్దలు కొట్టాడు. టెస్టుల్లో 500 వికెట్లు తీశాడు. ఇంగ్లాండ్ బ్యాటర్ జాక్ క్రాలీ అవుట్ చేసి ఈ ఘనత సాధించాడు. 98వ టెస్టులో ఈ మైలురాయిని చేరుకున్నాడు. విశాఖ జరిగిన రెండో టెస్టులో అశ్విన్ ఈ ఘనత సాధిస్తాడని భావించారు. కానీ ఆ మ్యాచ్ ముగిసే సరికి 500 వికెట్లకు ఒక అడుగు దూరంలో నిలిచాడు. రాజ్ కోట్ వేదికగా జరుగుతున్న మూడో టెస్టులో ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్ లో మొదటి వికెట్ ను పడగొట్టి అశ్విన్ అరుదైన ఘనతను అందుకున్నాడు. జాక్ క్రాలీ ఇచ్చిన క్యాచ్ రజత్ పటీదార్ పట్టుకోవడంతో అశ్విన్ ఆనందంతో గంతేశాడు. తక్కువ బంతుల్లో 500 వికెట్లు తీసిన బౌలర్ల జాబితా అశ్విన్ రెండోస్థానంలో నిలిచాడు. ఈ లిస్టులో ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్ గ్లెన్ మెక్ గ్రాత్ టాప్ లో ఉన్నాడు. మెక్ గ్రాత్ 25, 528 బంతులు వేసి.. 500 వికెట్ల మార్కు అందుకున్నాడు. ఆ తర్వాత రెండోస్థాన్ భారత్ టాప్ స్పిన్నర్ అశ్విన్ నిలిచాడు. అశ్విన్ 25,714 బంతులు వేసి.. 500 వికెట్ల మైలురాయిని చేరుకున్నాడు.ఇంగ్లాండ్ వెటనర్ ఫాస్ట్ బౌలర్ల జేమ్స్ అండర్సన్ 28, 150 బంతుల్లో 500 వికెట్ల క్లబ్ లో చేరి 3వ స్థానంలో నిలిచాడు.. ఇంగ్లాండ్ కే చెందిన మరో ఫాస్ట్ బౌలర్ స్టువర్ట్ బ్రాడ్ 28,430 బంతుల్లో 500 వికెట్లు తీశాడు. వెస్టిండీస్ దిగ్గజ ఫాస్ట్ బౌలర్ కోట్నీ వాల్ష్ 500 వికెట్లు పడగొట్టడానికి 28, 833 బంతులు వేశాడు. టాప్ -5లోని ఉన్న బౌలర్లలో అశ్విన్ ఒక్కడే స్పిన్నర్. మెక్ గ్రాత్, అండర్సన్, బ్రాడ్, వాల్ష్ నలుగురు పేసర్లు. ఇలా అతి తక్కువ బంతుల్లో 500 వికెట్లు తీసిన స్పిన్నర్ గానూ అశ్విన్ మరో రికార్డు కూడా సృష్టించాడు.





## మహేశ్, రాజమౌళి సినిమాలకు టైటిల్

సూపర్ స్టార్ మహేష్ బాబు తన తదుపరి సినిమా అగ్ర దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి తో చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాకి ఇప్పటికే స్క్రిప్ట్ పని పూర్తయిందని రాజమౌళి తండ్రి, ఈ సినిమాకి కథా రచయిత అయిన విజయేంద్ర ప్రసాద్ పలు మీడియా ఇంటర్వ్యూ లో చెప్పిన సంగతి కూడా తెలిసిందే. ఈ సినిమా కథా నేపథ్యం ఒక అడ్వెంచర్ లా ఉంటుంది అని ఇంతకు ముందు రాజమౌళి చెప్పారు. మహేష్ బాబుతో చేస్తున్న సినిమా ఒక యాక్షన్ సినిమాగా ఉంటుందని, అది జేమ్స్ బాండ్ తరహాలో లేదా ఇండియానా జోన్స్ తరహాలో ఉంటుందని, అయితే అది భారతీయ సంస్కృతి ఆధారంగా నిర్మితమై ఉంటుందని రాజమౌళి ఇంతకుముందు ఒక మీడియా సంస్థలతో మాట్లాడుతూ చెప్పారు. ఈ సినిమా కోసమే ఈమధ్యనే మహేష్ బాబు జర్మనీ వెళ్లి కొన్ని రోజులు శారీరక శిక్షణ పొందిన సంగతి కూడా తెలిసిన విషయమే. అయితే ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో ఈ సినిమా టైటిల్స్ గురించి వార్తలు వైరల్ అవుతున్నాయి. ఈ సినిమాకి రెండు పేర్లను అనుకుంటున్నట్టుగా అందులో ఒకటి 'మహారాజా' ఇంకోటి 'చక్రవర్తి' అని ఇలా వైరల్ అవుతున్నాయి. అన్ని భాషలకి ఇవే టైటిల్స్ ఖరారు చేసినట్టుగా వార్తలు వస్తున్నాయి.కానీ అధికారికంగా ఈ మహేష్ బాబు, రాజమౌళి సినిమా గురించి ఎటువంటి సమాచారం లేదు కానీ, రోజూ ఈ సినిమా గురించి కొన్ని వార్తలు మాత్రం సామాజికమాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. ఇప్పుడు ఈ సినిమా టైటిల్స్ గురించిన వార్తలు వైరల్ అవుతున్నాయి.

# మార్చి 1న ఆపరేషన్ వాలంటైన్

**విడుదలకు పలు చిన్నచిత్రాల క్యూ**

మార్చి 1న థియేటర్లలోకి రావడానికి తెలుగు సినిమాలు చాలా క్యూ కడుతున్నాయి. మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్, మానుషీ చిల్లర్ జంటగా నటించిన 'ఆపరేషన్ వేలంటైన్' విడుదల కానుంది. వెన్నెల కిశోర్ హీరోగా తెరకెక్కిన కామెడీ స్పై థ్రిల్లర్ 'చారి 111' కూడా ఆ రోజే రానుంది. వీటితో పాటు అనసూయ ఓ పాత్రలో నటించిన 'రజాకార్', శివ కందుకూరి 'భూతద్దం భాస్కర్ నారాయణ' సినిమాలు ఉన్నాయి. ఇప్పుడీ లిస్టులో మరో చిన్న సినిమా చేరింది. 'రాధా మాధవం' సైతం ఆ రోజు విడుదల కానుంది. వినాయక్ దేశాయ్ హీరోగా రూపొందిన పల్లెటూరి ప్రేమకథా చిత్రం 'రాధా మాధవం'. అపర్ణ దేవి హీరోయిన్. దాసరి ఇస్సాకు దర్శకత్వం వహిస్తున్నారు. గోనల్ వెంకటేష్ నిర్మాత. ఈ చిత్రానికి కథ, మాటలతో పాటు పాటలను కూడా వసంత్ వెంకట్ బాలా అందించారు. సెన్సార్ కార్యక్రమాలు పూర్తి అయ్యాయి. మార్చి 1న చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు దర్శక నిర్మాతలు చెప్పారు. రాధా మాధవం' ప్రచార చిత్రాలు, పాటలకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించిందని చిత్ర బృందం సంతోషం వ్యక్తం చేసింది. సెన్సార్ బోర్డు ఈ చిత్రానికి యు/ఎ సర్టిఫికెట్ ఇచ్చింది. చక్కని సందేశాత్మక చిత్రం తీశారని సెన్సార్ సభ్యులు ఇచ్చిన ప్రశంసలు తమకు ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చాయని వారు పేర్కొన్నారు. 'రాధా మాధవం' సినిమా ఫస్ట్ లుక్‌ను కొన్ని రోజుల క్రితం రాజ్ కందకూరి విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... 'హీరోగా వినాయక్ దేశాయ్ రెండో చిత్రమిది. ఫస్ట్ లుక్ పోస్టర్ చూస్తుంటే... మంచి పల్లెటూరి ప్రేమకథ చూడబోతున్నామని ఫీలింగ్ కలిగించింది. మన ప్రేక్షకులు చిన్నా పెద్దా అని తేడాలు చూడరు. కంటెంట్ బాగుంటే చిన్న చిత్రాలను కూడా ఆదరిస్తారు. ఈ సినిమాను కూడా ఆదరిస్తారని ఆశిస్తున్నా' అని చెప్పారు. తమను ఎంకరేజ్ చేస్తున్న రాజ్ కందుకూరికి హీరో వినాయక్ దేశాయ్ కృతజ్ఞతలు చెప్పారు. వినాయక్ దేశాయ్, అపర్ణా దేవి జంటగా నటించిన ఈ సినిమాలో మేక రామకృష్ణ, జయ ప్రకాష్, ప్రియ, నవీన్, రవి శివతేజ, సుమన్, రాచర్ల లాస్య, ధనుష్ ఆచార్య, రాచర్ల మహేష్, శ్రీకాంత్ పర్కాల, సతీష్ కొల్లిపల్లి, శ్రీను, అడెపు మణిదీప్, చిరంజీవి, కామనగరి జ్యోతి, సురభి శ్యామల ప్రధాన తారాగణం. ఈ చిత్రానికి నిర్మాత: గోనాల్ వెంకటేష్, దర్శకత్వం: దాసరి ఇస్సాకు, కథ - మాటలు - పాటలు: వసంత్ వెంకట్ బాలా, సంగీతం : చైతు కొల్లి, ఛాయాగ్రహణం: తాజ్ జీడీకే, కూర్పు: కె. రమేష్, పోరాటాలు: రాబిన్ సుబ్బు




## చెన్నైలోనూ మయం అవుతున్న థియేటర్లు

హైదరాబాద్ నగరంలో ఇప్పటికే అనేక థియేటర్లను కూల్చేశారు. కమర్షియల్ కాంప్లెక్సులు వస్తున్నాయి. తాజాగా చెన్నై నగరంలోని ప్రముఖ సినిమా థియేటర్ కాంప్లెక్సులలో ఉదయం కాంప్లెక్సొకటి. ఈ థియేటర్ త్వరలోనే కాలగర్భంలో కలిసిపోనుంది. స్థానిక అశోక్ నగర్‌లో అశోక్ పిల్లర్, అశోక్ నగర్ మెట్రో స్టేషన్‌కు ఎదురుగా ఉన్న ఈ థియేటర్ కాంప్లెక్స్‌లో నాలుగు స్క్రీన్‌లు ఉన్నాయి. ఉదయం, సూర్యన్, చంద్రన్‌లను మొదట నిర్మించగా, ఆధునికీకరణ పేరుతో ఉదయం థియేటర్‌లోని బాల్కనీ భాగాన్ని మినీ ఉదయంగా మార్చారు. స్థానిక అన్నాశాలైలో దేవి కాంప్లెక్స్, ఎగ్మోర్‌లోని ఆల్బర్ట్ థియేటర్ కాంప్లెక్స్‌లకు ధీటుగా అశోక్ నగర్‌లో 1983లో ప్రారంభించిన ఉదయం కాంప్లెక్స్‌లో 41 యేళ్ళుగా ఎన్నో చిత్రాలను ప్రదర్శించి ప్రేక్షకులకు వినోదాన్ని అందించారు. అశోక్ నగర్ వాసులతో పాటు వడపళని, సైదాపేట, జాఫర్‌ఖాన్ పేట, కేకే నగర్, ఈక్కాడుతాంగల్, మాంబాళం, గిండి ప్రాంతాల్లోని ప్రేక్షకులకు ఈ కాంప్లె క్స్ ఎంతో అనువుగా ఉండేది. ఈ థియేటర్‌ను ఆరుగురు అన్నదమ్ములు నిర్మించారు. వీరంతా కలిసి థియేటర్‌ను విక్రయానికి పెట్టగా, 2012లో వీరిలో ఒక సోదరుడైన పరమశివం పిళ్ళై రూ. 80 కోట్లకు బిడ్డింగ్ వేశారు. ఈ థియేటర్ వేలానికి రాగానే ఫౌండర్స్ ఫ్యామిలీ నుంచి 53 మంది షేర్ హోల్డర్స్ తెరపైకి రావడంతో న్యాయపరమైన చిక్కులు ఉత్పన్నమయ్యాయి.

జనంసాక్షి సినిమా

## డబుల్ ఇస్మార్ విడుదల తేదీ వాయిదా

టాలీవుడ్ డాషింగ్ డైరెక్టర్ పూరీ జగన్నాథ్ , రామ్ కాంబినేషన్‌లో వస్తున్న తాజా చిత్రం 'డబుల్ ఇస్మార్ట్' బ్లాక్ బస్టర్ మూవీ ఇస్మార్ట్ శంకర్‌కు సీక్వెల్‌గా వస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. ప్రముఖ బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ ఈ సినిమాలో విలన్ పాత్రలో నటిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి వరుస అప్‌డేట్‌లను ఇవ్వగా ఫ్యాన్స్ సంబరాలు చేసుకుంటున్నారు. అయితే తాజాగా ఈ సినిమా విడుదల తేదీపై ఒక ఇంట్రెస్టింగ్ అప్‌డేట్ వచ్చింది. ఈ సినిమాను మొదట మార్చి 8న గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా ఈ విడుదల తేదీ వాయిదా పడినట్లు తెలుస్తుంది. షూటింగ్ ఆలస్యం అవ్వడం అనుకున్న టైమ్‌కి పోస్ట్ ప్రొడక్షన్ పనులు పెండింగ్ ఉండడంతో ఈ సినిమాను జూన్ 14న విడుదల చేసేందుకు మేకర్స్ ఎ÷–లాన్ చేస్తున్నట్లు సమాచారం. కాగా దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఇక ఈ సినిమాకు మెలోడీ బ్రహ్మ మణిశర్మ సంగీతం అందిస్తున్నాడు.

## అమెరికాలో చిరుకు సత్కారం

మెగా స్టార్ చిరంజీవికి భారత ప్రభుత్వం 'పద్మ విభూషణ్' ఇచ్చి సత్కరించింది. తెలుగు సినిమా పరిశ్రమలో అక్కినేని నాగేశ్వర రావు తరువాత పద్మ విభూషణ్ దక్కించుకున్నది ఒక్క చిరంజీవి మాత్రమే. ఇంతకు ముందు అంటే 2006 లో చిరంజీవికి అప్పటి భారత ప్రభుత్వం పద్మ భూషణ్ ఇచ్చి సత్కరిస్తే, ఇప్పుడు 18 సంవత్సరాల తరువాత పద్మ విభూషణ్ వచ్చింది. ఈ అవార్డు అధికారికంగా ప్రకటించిన తరువాత తెలుగు చలన చిత్ర పరిశ్రమకి చెందిన నటీనటులు, నిర్మాతలు, సాంకేంతిక నిపుణులు చిరంజీవి ఇంటికి వెళ్లి అతన్ని అభినందించారు. అలాగే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా కొన్ని రోజుల క్రితం పద్మ అవార్డు గ్రహీతలు అందరికీ సన్మానం జరిపింది. అప్పుడు చిరంజీవికి కూడా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. చిరంజీవి ఇప్పుడు అమెరికా పర్యటన కోసమై తన భార్య సురేఖతో వెళ్లారు. అక్కడ పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ ప్రతినిధి, ప్రముఖ నిర్మాత టీజీ విశ్వప్రసాద్ చిరంజీవిని కలిశారు. అక్కడ చిరంజీవికి ఒక చిరు సన్మానం చెయ్యాలని నిశ్చయించుకున్నారని తెలిసింది. చిరంజీవికి ప్రపంచ వ్యాప్తంగా అభిమానులు వున్న సంగతి అందరికీ తెలిసిన విషయమే. అందుకని ఇప్పుడు అమెరికాలో చిరంజీవికి పద్మవిభూషణ్ వచ్చిన సందర్భంగా విశ్వప్రసాద్ ఒక సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్టుగా తెలిసింది.



జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
17 ఫిబ్రవరి 2024

# తెలంగాణ పోలీస్‌కు ఓవరాల్ చాంపిన్‌షిప్ ట్రోఫీ



**హైదరాబాద్, ఫిబ్రవరి 16 (జనంసాక్షి) :** ఆల్ ఇండియా పోలీస్ డ్యూటి మీట్‌లో తెలంగాణ పోలీస్ ఓవరాల్ చాంపియన్ షిప్ (చార్మినార్ ట్రోఫి) సాధించింది. లక్నోలో జరిగిన ఆల్ ఇండియా పోలీస్ డ్యూటి మీట్ లో 5 బంగారు, 7 వెండి పతకాలతో తెలంగాణ పోలీసులు తమ ప్రతిభను చాటారు. ఫోటోగ్రఫీ (బంగారు, వెండి, రన్నర్స్ ట్రోఫి), ప్రొఫెషనల్ ఫోటోగ్రఫీ (బంగారు, వెండి, విన్నర్స్ ట్రోఫి), వీడియో గ్రఫీ (వెండి, రన్నర్స్ ట్రోఫి) విభాగాల్లో పతకాలు సాధించారు. ఉమ్మడి రాష్ట్రంలో 2012 లో పోలీస్ టీం ఓవరాల్ ఛాంపియన్ షిప్ సాధించింది. 12 ఏళ్ల తర్వాత తెలంగాణ పోలీస్ విభాగం ఆ రికార్డు సాధించింది. పతకాలు సాధించిన విజేతలను డిజిపి రవిగుప్తాను, పోలీస్ అధికారులను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అభినందించారు.



# బింగే హాల్, సర్వస్వతి ఎంటర్‌ప్రైజ్ ప్రారంభోత్సవం!

**హైదరాబాద్, ఫిబ్రవరి 16 (జనంసాక్షి) :** బింగే హాల్, సర్వస్వతి ఎంటర్‌ప్రైజ్ ప్రారంభోత్సవంలో టూరిజం పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త పాల్గొన్నారు. హైదరాబాద్‌లోని నాగోల్, అలకాపురి కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన బింగే హాల్, సర్వస్వతి ఎంటర్‌ప్రైజ్ (ప్రయివేటు థియేటర్, పార్టీ లాంజ్) ప్రారంభోత్సవ కార్యక్రమంలో హాజరై, రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన సందర్భంగా ముందుగా వారికి పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా స్వాగతిం చి,శాలువతో సన్మానించారు. తదనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లా డారు. ఈ కార్యక్రమంలో.. యాజమాన్యం సాయి నిఖిల్, అనిల్, శ్రీనివాస్, రాజు, దయానంద్ ఐవీఎఫ్ నాయకులు, ఆర్యవైశ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఏసిబి వలలో అవినీతి సూపరింటెండెంట్

- మూడు లక్షలు లంచం తీసుకుంటా పట్టుబద్ధ నల్గొండ ప్రభుత్వ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ల లచ్చు నాయక్

**నల్గొండటౌన్, ఫిబ్రవరి 16(జనంసాక్షి) :** నల్గొండ జిల్లా కేంద్రంలోని గవర్నమెంట్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ల లచ్చు నాయక్ ను తన ఇంట్లో ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు.గవర్నమెంట్ హాస్పిటల్ కి మెడిసిన్ సప్లయ్ చేసే కాంట్రాక్టర్ రాపోలు వెంకన్న నుండి 3 లక్షల రూపాయలు లంచం డిమాండ్ చేశాడు.సదరు అధికారి లచ్చు నాయక్ ఇబ్బంది పెట్టడంతో ముందుగానే ఏసీబీ అధికారులను కలిసిన కాంట్రాక్టర్ తన బాధను మొర పెట్టుకున్నాడు.ఇదువరకు కూడా లక్ష ముట్ట చెప్పాడు. అయన కూడా సదరు అధికారి మరల మూడు లక్షలు కావాలని డిమాండ్ చేశాడు పైసలు ఇవ్వకపోతే మరల టెండర్ వేస్త అన్నాడు చేసేది ఏమి లేక వెంకన్న ఏసీబీను ఆచరించాడు. కాంట్రాక్టర్ డబ్బులు ముట్ట చెప్పే పనిలో ఉండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం లచ్చు నాయక్ ఇంట్లో కొనసాగుతున్న తనిఖీలు పలు రికార్డులు స్వాదినం చేసుకొని క్షుణ్ణంగా పరిశీలించున్నారు. ఈ కార్యక్రమం లో ఏసీబీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ఉన్నత విద్యలో పరిశోధనలు ఎంతో అవసరం




- సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శశిభూషణ్ చైతన్య
- డిమ్ టూబీ విశ్వవిద్యాలయ విద్యార్థులకు స్వల్పకాలిక శిక్షణ

**మొయినాబాద్, ఫిబ్రవరి 16,(జనంసాక్షి) :** ఉన్నత విద్యలో పరిశోధన ప్రయోగాలు విద్యార్థులకు ఎంతో అవసరం అని సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శశిభూషణ్ అన్నారు. మండల పరిధిలోని హిమాయత్నగర్ సమీపంలో గల చైతన్య డిమ్డ్ టూబీ విశ్వవిద్యాలయంలో ఫార్మసీ విద్యార్థులకు జాతీయ పౌష్టికాహార సంస్థలో స్వల్పకాలిక శిక్షణ రెండు రోజుల పాటు బీ-పార్మసీ పార్మడి విద్యార్థిని విద్యార్థులకు శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు రోజుల శిక్షణలో 145 మంది విద్యార్థులు పాల్గొన్నారు. నగరంలోని భారత వైద్య పరిశోధన మండలి, జాతీయ పౌష్టికాహార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ పౌష్టికాహార సంస్థ మ్యూజియం, పరిశోధన ప్రయోగాలను తెలియజేశారు. ప్రయోగశాలలో ఉంటే ప్రయోగాలను అందులో గల వివిధ రసాయలను వివరించారు. డాక్టర్ శశిభూషణ్ మాట్లాడుతూ ఫార్మసి, ఫార్మడి చదువుతున్న విద్యార్థులు ప్రస్తుతం జరగుతున్న పరిశోధనలను, పౌష్టికాహాలను తెలుసుకోవాలన్నారు. రక్తహీనతపై వివరించారు. సుసంపన్నమైన బలవర్ధకమైన ఆహారం గురించి తెలియజేశారు. పరస్పర చర్యలు విద్యార్థులు ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని సూచించారు. విద్యార్థులలో నైపుణ్యం పెరగడానికే ఇలాంటి స్వల్పకాలిక శిక్షణలు ఎంతో అవసరపడతాయని సూచించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ జి.కుమారస్వామి, చైతన్య డిమ్ టూబీ గాదె రాంబాబు, అసోసియేషన్ రిజిస్ట్రార్, అధ్యపకులు పాల్గొన్నారు.

# టెక్నికల్ సర్టిఫికెట్ కోర్స్ పరీక్షల హాల్ టికెట్లు విడుదల

**నిర్మల్ బ్యూరో, ఫిబ్రవరి16 (జనంసాక్షి) :** టైలరింగ్ ,. డ్రాయింగ్ వంటి టెక్నికల్ సర్టిఫికెట్ కోర్స్ పరీక్షలు ఈనెల 24 నుండి 27 వరకు జరుగుతాయని జిల్లా విద్యాశాఖ అధికారి ఏ.రవీందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. టెక్నికల్ సర్టిఫికెట్ కోర్స్ పరీక్షలు అయిన టైలరింగ్ అండ్ ఎంబ్రాయిడరీ లోయర్, హయ్యర్ పరీక్షలు, డ్రాయింగ్ లోయర్, హయ్యర్ పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లు బిఎస్ఈ. తెలంగాణ. జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో ఈనెల 15వ తేదీ నుండి అందుబాటులోకి వచ్చాయని ఆయన తెలిపారు. హాల్ టికెట్ డౌన్లోడ్ చేసుకోవడానికి జిల్లా పేరు, ట్రేడ్ కోడు, ట్రేడ్ పేరు, అభ్యర్థి పేరు మరియు పుట్టిన తేదీలు అవసరం అవుతాయని ఆయన తెలిపారు. డ్రాయింగ్ లోయర్, హయ్యర్ పరీక్షలు 24వ తేదీ నుండి 27వ తేదీ వరకు (నాలుగు రోజులు) జరుగుతాయని, టైలరింగ్, ఎంబ్రాయిడరీ లోయర్ పరీక్షలు ఈ నెల 25వ తేదీన(ఒక రోజు), మరియు టైలరింగ్ మరియు ఎంబ్రాయిడరీ హయ్యర్ పరీక్షలు ఈనెల 26 నుండి 27 వరకు(రెండు రోజులు) జరుగుతాయని, ఈ విషయాన్ని దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు గమనించాలని ఆయన కోరారు.

# కాంగ్రెస్ పాలనలోనే యాదవులకు గుర్తింపు

- శ్రీ సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయ మాజీ చైర్మన్ కృష్ణమూర్తి యాదవ్



పాలకుర్తి, ఫిబ్రవరి 16 (జనంసాక్షి) కాంగ్రెస్ పాలనలో యాదవులకు ప్రత్యేక గుర్తింపు దక్కిందని శ్రీ సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయ మాజీ చైర్మన్ చిలువేరు కృష్ణమూర్తి యాదవ్ అన్నారు. ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం మండల కేంద్రంలో గల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు బైకానీ ఐలేష్ యాదవ్ తో కలిసి ఆయన మాట్లాడుతూ బీసీల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ కృత నిశ్చయంతో ఉందని అన్నారు. గత 15ల పాలనలో బిఆర్ఎస్ ప్రభుత్వం బీసీలను విస్మరించిందని విమర్శించారు. చట్టసభల్లో యాదవులకు పెద్దపీట వేయాలని లక్ష్యంతో యాదవుల ముద్దుబిడ్డ అనిల్ యాదవ్ ను రాజ్యసభ సభ్యుడిగా ఎంపిక చేయడం అభినందనీయమన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గేలు యాదవులను గుర్తించడం పట్ల అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు. రాజకీయంగా యాదవులు అభివృద్ధి చెందాలని కోరారు. జనాభా ప్రాతిపదికన యాదవులకు మంత్రివర్గంలో స్థానం కల్పించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. రాబోవు పార్లమెంటు ఎన్నికల్లో యాదవులు ఐక్యంగా కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచి, యాదవుల సత్తా చూపించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి పట్టణ మాజీ అధ్యక్షులు సలేంద్ర వెంకన్న యాదవ్, సలేంద్ర సంపత్ యాదవ్, పట్టణ యూత్ అధ్యక్షులు కత్తుల నరేష్ యాదవ్,చిలువేరు మహేందర్ యాదవ్,జిట్టబోయిన యాకయ్య యాదవ్, సలేంద్ర సందీప్ యాదవ్ చిలువేరు సాయి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ఖాతాలోకి మంథని మున్సిపాలిటీ





- నెగ్గిన అవిశ్వాసం

మంథని, (జనంసాక్షి) : పెద్దపల్లి జిల్లా మంథని మున్సిపాలిటీ కాంగ్రెస్ ఖాతాలోకి చేరింది. మంథని మున్సిపల్ చైర్ పర్సన్ పుట్ట శైలజ, వైస్ చైర్మన్ ఆరెపల్లి కుమార్ పై 9 మంది కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాసం నెగ్గింది. బీఆర్ఎస్ కు చెందిన మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ పై ఈ నెల 1వ తేదీన పెద్దపల్లి అదనపు కలెక్టర్ అవిశ్వాసం నోటీసు అందజేయగా కలెక్టర్ ఆదేశాల మేరకు మంథని ఆర్డీవో, ప్రొసిడింగ్ అధికారి హనుమానాయక్ అధ్యక్షతన అవిశ్వాసంపై శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 9 మంది కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా చేతులు ఎత్తడంతో అవిశ్వాసం నెగ్గినట్లు ఆర్డీవో హనుమ నాయక్ ప్రకటించారు. అనంతరం మంథని పట్టణంలో స్వర్గీయ మాజీ స్పీకర్ దుద్దిల్ల శ్రీపాదరావు విగ్రహానికి, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి కౌన్సిలర్లు మండల ,పట్టణ కాంగ్రెస్ నాయకులు పూలమాల వేసి నివాళి అర్పించారు. అలాగే బాణసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు.

## కానిస్టేబుల్‌గా ఎంపికైన వారిని అభినందించిన నాలుగో బెటాలియన్ కమాండెంట్ శివప్రసాద్ రెడ్డి



వరంగల్ ఈస్ట్, ఫిబ్రవరి 16 (జనం సాక్షి) : నాలుగో బెటాలియన్ ట్రైనింగ్ సెంటర్లో దాదాపుగా 300 మంది కానిస్టేబుల్ అభ్యర్థులకు శిక్షణ ఇవ్వగా అందులో 30 మంది అభ్యర్థులు కానిస్టేబుల్ గా ఎంపిక అవ్వడం పట్ల కమాండెంట్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కానిస్టేబుల్ గా ఎంపికైన వారిని కమాండెంట్ డి శివప్రసాద్ రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో కమాండెంట్ మాట్లాడుతూ విద్యార్థులు కృషి, పట్టుదల తో కష్టపడితే అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చు అని వీరు జీవితంలో ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అభ్యర్థులకు ట్రైనింగ్ ఇచ్చిన ట్రైనింగ్ సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## అగ్రి సౌత్ 2024 సదస్సులో ముల్కనూర్ రైస్ స్టాల్




**భీమదేవరపల్లి, ఫిబ్రవరి 16 (జనం సాక్షి) :** అగ్రి సౌత్ 2024 పేరిట హైదరాబాదులో ఆచార్య ఎన్‌జి రంగా అగ్రికల్చర్ యూనివర్సిటీలో నిర్వహించిన రైతు సదస్సులో సుమారు 85 రైతు స్టాల్స్‌ను ఏర్పరిచారు. అందులో ముల్కనూర్ గ్రామీణ సహకార సంఘం వారి రైస్ స్టాల్ ఏర్పాటు చేసి రైతులకు సొసైటీ అందిస్తున్న సేవలను సిబ్బంది వివరించారు. జై శ్రీరామ్, ఆర్ ఎన్ ఆర్, బిపిటి బియ్యాన్ని స్టాల్స్ లో ప్రదర్శించారు. ములకనూర్ సహకార సంఘం నుండి 60 మందికి పైగా రైతులు ఈ సదస్సుకు హాజరయ్యారు.

# సింగరేణి కొత్త గనులకు పూర్తి సహకారం



- కేంద్ర బొగ్గు శాఖ కార్యదర్శి అమ్రిత్ లాల్ మీనా
- బొగ్గు ఉత్పత్తి, రవాణాలో సింగరేణి పనితీరు భేష్
- సింగరేణి పనితీరుపై ఉన్నతస్థాయి సమీక్ష

(ప్రత్యేక ప్రతినిధి /జనం సాక్షి)

సింగరేణి సంస్థ పనితీరు సంతృప్తికరంగా ఉందని, సంస్థ అభివృద్ధి కోసం చేపట్టనున్న గనులకు పూర్తి సహకారం అందిస్తామని కేంద్ర బొగ్గు శాఖ కార్యదర్శి అమ్రిత్ లాల్ మీనా హామీ ఇచ్చారు. ఈ ఏడాది నిర్దేశించుకున్న 70 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్య సాధనలో ముందుండటంపై ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. శుక్రవారం హైదరాబాద్ సింగరేణి భవన్ లో ఆయన సంస్థ ఛైర్మన్, ఎండి ఎన్.బలరామ్ మరియు ఇతర డైరెక్టర్లతో కంపెనీ ప్రగతిపై ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో సింగరేణి ప్రస్తుత పనితీరు భవిష్యత్తు ప్రణాళికలపై ఛైర్మన్ ఎన్.బలరామ్ వివరించారు. సింగరేణి ప్రాంతంలోని మూడు బొగ్గు బ్లాకుల కేటాయింపు పద్ధతిలో సింగరేణి సంస్థకే కేటాయించేలా చూడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అలాగే రానున్న కాలంలో చేపట్టనున్న కొత్త గనులకు త్వరితగతిన అనుమతులు లభించేలా చూడాలన్నారు. దీనిపై కేంద్ర ప్రభుత్వ శాఖ కార్యదర్శి స్పందిస్తూ నిబంధనలకు లోబడి సింగరేణికి మేలు కలిగే విధంగా తగిన సహకారాన్ని అందిస్తామని సింగరేణి భవిష్యత్తుకు ఎటువంటి ఇబ్బందీ ఉండదని ఆయన హామీ ఇచ్చారు. అలాగే సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన సోలార్, థర్మల్ ప్రాజెక్టుల పనితీరును అడిగి తెలుసుకున్నారు. సోలార్ రంగంలో చేపట్టే ప్రాజెక్టులపై కూలంకశంగా తెలుసుకున్నారు. సింగరేణి చేపట్టిన వ్యాపార విస్తరణ చర్యలైన థర్మల్, సోలార్, జియో థర్మల్, ఓబీ నుంచి ఇసుక ఉత్పత్తి, కమర్షియల్ ఇసుక తయారీ తదితర ప్రాజెక్టులపై అభినందనలు తెలిపారు. ఈ సమావేశంలో కేంద్ర బొగ్గు శాఖ అదనపు కార్యదర్శి శ్రీమతి రూపేందర్ బ్రార్, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ శ్రీమతి సంతోష్, సంస్థ డైరెక్టర్లు డి.సత్యనారాయణ రావు(ఈ అండ్ ఎం), ఎన్ వి కె శ్రీనివాస్ (ఆపరేషన్స్ మరియు పర్సనల్), జి వెంకటేశ్వర్ రెడ్డి ( ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్), ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(కోల్ మూమెంట్) జె.ఆల్విన్, జీఎం(కో ఆర్డినేషన్) ఎం.సురేష్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో భేటీ

హైదరాబాద్ సింగరేణి భవన్ లో సమీక్షా సమావేశం అనంతరం రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీమతి శాంతకుమారిని బొగ్గు శాఖ కార్యదర్శి అమ్రిత్ లాల్ మీనా కలిసి పలు అంశాలపై చర్చించారు. ఆయన వెంట సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ కూడా ఉన్నారు.




Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Sy.No. 210, Padmanagar, Chinthakunta, Karimnagar Dist, Telangana - 505462 Published at Janam Sakshi Office, Bawazeer Estate, Beside HUDA High School, Civil Hospital Road, Karimnagar - 505001, Telangana. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2002/12105